

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

రాజమహేంద్రవరం

: fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

8-7-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 158 పేజీలు: 8+4 వెల: 6.50



టిక్‌టాక్‌వల్లే గెలిచా: డొనాల్డ్ ట్రంప్

అయోధ్య ట్రస్టు అధీనంలో 30 కిలోల బంగారు ఆభరణాలు

5లో


# ఎంట్రప్రెన్యూర్లుగా రైతులు



మంగళవారం జరిగిన 19వ ఎస్ఐపిబి సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

### పారిశ్రామికీకరణ ఆ దిశగా సాగాలి

### వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ప్రోత్సాహం

### మరిన్ని ఇథనాల్ ప్రాజెక్టులు ఏర్పాటు: సిఎం చంద్రబాబు

### 19వ ఎస్ఐపిబి సమావేశంలో 11 ప్రాజెక్టులకు ఆమోదం

**విజయవాడ, జూలై 7, ప్రభాతవార్తప్రతినిధి:** రైతు కుటుంబాలకు అదనపు ఆదాయం సమకూర్చేలా కార్యచరణ ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. రైతులు ఎంట్రప్రెన్యూర్లుగా ఎదిగేందుకు దోహదం చేసేలా పారిశ్రామికీకరణ జరగాలన్నారు. ఆ దిశగా పెట్టుబడులను ఆకర్షించాలని అధికారులకు సూచించారు. ఇందులో భాగంగా భవిష్యత్‌లో పెరిగే ఇథనాల్ డిమాండ్‌ను అందిపుచ్చుకోవాలని చెప్పారు. ఇథనాల్ బ్లెండింగ్ 40 శాతానికి పెంచితే. మొక్కజొన్న రైతులకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. ఇథనాల్ తయారీ రంగంలో వచ్చే అన్ని పెట్టుబడులను ప్రోత్సహించాలన్నారు. పెట్రోలు, డీజిల్‌లో మిక్స్ చేసేందుకు ఇథనాల్ భారీగా అవసరం కానుందన్నారు. ఇథనాల్, మీథేన్, ఏవియేషన్ ఫ్యూయల్‌కు సంబంధించి పాలసీ తీసుకురావాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలపై దృష్టిపెట్టాలన్నారు. ఆ దిశలో రైతులను ప్రోత్సహించాలన్నారు. సంపద సృష్టి, సర్క్యులర్ ఎకానమీ అనేది ప్రభుత్వ విధానం అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను పెద్దఎత్తున ప్రోత్సహించాలని నిర్దేశించారు. సచివాలయంలో మంగళవారం 19వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశాన్ని ముఖ్యమంత్రి నిర్వహించారు. ఈ సమావేశంలో మొత్తం 11 ప్రాజెక్టులకు సంబంధించి రూ.9,076.11 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. దీంతో 10,531 ఉద్యోగాలు రాష్ట్రానికి రానున్నాయి.

**100 ఎక్స్‌పీరియన్స్ సెంటర్ల ఏర్పాటు లక్ష్యం:** పర్యాటకరంగంలో అపార అవకాశాలు ఉన్నాయి. తిమ్మమ్మ మర్రిమాను సహా రాష్ట్రవ్యాప్తంగా 100 టూరిస్ట్ స్పాట్‌ల దగ్గర ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు ఏర్పాటు చేయాలి. పోలవరం, దిండి, గండికోట, కంబం చెరువు, లంబసింగి లాంటి ప్రాంతాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి. లంబసింగి, అరకు సమీపంలో రిసార్ట్ ఏర్పాటుకు జిందాల్ సంస్థ ఆసక్తి వ్యక్తం చేస్తోంది. >>2

## కాగ్నిజెంట్, విశాఖ ఐటి సెజ్‌కు కేంద్రం ఆమోదం

**విజయవాడ, జూలై 7,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ టెక్నాలజీ సంస్థ కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ విశాఖపట్నంలో ఐటీ/ఐటీఈఎస్ ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారిక అనుమతులు పొందింది. ఈ మేరకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ తుది నోటిఫై చేసింది. విశాఖపట్నం రూరల్ మండలం పరిధిలోని ఐటీమధురవాడ2 ప్రాంతంలో 8.98 హెక్టార్ల విస్తీర్ణంలో ఈ సెజ్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించి కాగ్నిజెంట్ సంస్థకు లెటర్ ఆఫ్ అప్రూవల్ కూడా జారీ అయింది. సెజ్ చట్టం ప్రకారం డెవలప్‌మెంట్ కమిషనర్ నేతృత్వంలో ఒక అప్రూవల్ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. కస్టమ్స్ కార్యకలాపాలను సులభతరం చేసేందుకు ఈ సెజ్‌ను ఇన్‌ల్యాండ్‌కంటైనర్ డిపో >>2

# పెట్టుబడుల కేంద్రంగా ఎపి




మంగళవారం సియోల్‌లోని ఎల్‌జీ సైన్స్‌పార్కులో అక్కడి ప్రతినిధులతో మంత్రి నారా లోకేష్

### మూలపేటలో ప్రపంచస్థాయి నాఫ్తాక్రేకర్ కేంద్రాన్ని ప్రారంభించండి

### ఎఐ, ఐటి, ఎలక్ట్రానిక్స్‌లో వేగంగా పురోగతి

### సియోల్‌లో ఎల్జీకెమ్ ప్రెసిడెంట్ యున్‌జు కోహ్, హుందాయ్ ఇడితో మంత్రి లోకేష్ భేటీ

**విజయవాడ,జూలై7,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో పెట్టుబడులకు అత్యంత అనుకూల మౌలిక పరిస్థితులున్నాయని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పునరుద్ఘాటించారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన స్థల సదుపాయాలు, రవాణ వ్యవస్థ ఉందని వివరించారు. సౌత్ కొరియా పర్యటనలో భాగంగా మంగళవారం ఎల్జీ కెమ్ గ్లోబల్ స్ట్రాటజీ సెంటర్ ప్రెసిడెంట్ ఎల్జీ ఓవర్సీస్ హోల్డింగ్ కంపెనీస్ హెడ్ యున్‌జు కోహ్ తో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సియోల్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ కాకినాడపోర్టు సమీపంలో పాలీస్టైరిన్ తయారీ కేంద్రం/సముదాయాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. దక్షిణ కొరియాలోని ఎల్జీ కెమ్ అధునాతన కార్యకలాపాలను నమూనాగా తీసుకుని, మూలపేటలో ప్రపంచ స్థాయి నాఫ్తాక్రాకర్ కేంద్రాన్ని ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని కోరారు. భారతదేశంలో సమగ్రమైన ఈవీ, బ్యాటరీ పవర్ స్టోరేజీ పర్యావరణ వ్యవస్థను సృష్టించేందుకు, సమీకృత క్యాథోడ్ యాక్టివ్ మెటీరియల్, సెల్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలన్నారు. మూలపేటలో ఎస్ఏఎఫ్ బయోఇథనాల్ ఉత్పత్తిపై దృష్టి సారించి, జీవ ఇంధనాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను వాల్యూ యాడెడ్ వనరులుగా మార్చేందుకు, ప్లాస్టిక్ రీసైక్లింగ్, పైరోలిసిస్ ప్లాంట్లను ప్రారంభించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో భాగస్వామ్యం వహించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఎల్జీ కెమ్ గ్లోబల్ స్ట్రాటజీ సెంటర్ ప్రెసిడెంట్ యున్‌జు కోహ్ మాట్లాడుతూ ఎల్జీ పాలిమర్స్ విశాఖపట్నం ప్లాంట్ (గోపాలపట్నం) ద్వారా గతంలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ భారతీయ కార్యకలాపాలకు, ఇతర తయారీదారులకు (పాలీస్టైరీన్) కీలకమైన పాలిమర్ భాగాలను సరఫరా చేశామని గుర్తుచేశారు. ప్రస్తుతం శ్రీసిటీలో, యాక్రిలోనిట్రైల్ బ్యూటాడైన్ స్టైరీన్ కాంపౌండ్ ప్లాంట్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించిన తాజా ప్రతిపాదనలపై సంస్థ >>2



మంగళవారం జకార్తాలో ప్రధాని మోడీని అత్యున్నత పురస్కారంతో సత్కరిస్తున్న ఇండొనేసియా అధ్యక్షుడు సుబియాంటో

## ఇండొనేసియాకు 'బ్రహ్మాస్త్రం'

### బ్రహ్మోస్, అస్త్ర క్షిపణుల సరఫరాకు భారత్ అంగీకారం

### ఉభయ దేశాల మధ్య 19కీలక ఒప్పందాలపై సంతకాలు

### రక్షణరంగంలో మరింత సహకారం

### అధ్యక్షుడు సుబియాంటోతో ప్రధాని మోడీ ద్వైపాక్షిక చర్చలు

**జకార్తా, జులై 7:** భారత్, ఇండోనేసియా తమ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని సరికొత్త శిఖరాలకు చేర్చాయి. రక్షణ, వాణిజ్యం, సాంకేతికత, ఆరోగ్యం, సాంస్కృతిక రంగాల్లో సహకారాన్ని విస్తృతం చేసే లక్ష్యంతో ఇరు దేశాలు 19 కీలక ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఈ చారిత్రక పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీకి ఇండోనేషియా తమ దేశ >>2

## ప్రధాని మోడీకి ఇండొనేసియా అత్యున్నత పురస్కారం

## 'బిన్‌టాంగ్ ఆదిపూర్ణ' పురస్కారం అందించిన అధ్యక్షుడు సుబియాంటో

**జకార్తా,జులై 7:** ప్రధాని మోడీకి అరుదైన గౌరవం దక్కింది. ఇండోనేసియా ప్రభుత్వం ఆయన్ను అత్యున్నత పురస్కారంతో సత్కరించింది. 'బిన్‌టాంగ్ ఆదిపూర్ణ రిపబ్లిక్ ఆఫ్ ఇండొనేసియా' అవార్డుతో మోడీని సన్మానించారు. ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ఆ మెడల్‌ను అందజేశారు. ప్రస్తుతం మోదీ ఇండోనేసియా పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. ఎంతో ప్రేమతో ఇండోనేషియాకు తనకు అత్యున్నత పురస్కారాన్ని అందజేసినట్లు పీఎంవో కార్యాలయం తన ట్వీట్‌లో తెలిపింది. ఈ గౌరవం కోట్లాది మంది భారతీయులకు చెందుతుందని మోడీ పేర్కొన్నారు. ఈ సత్కారం ఇండోనేసియా >>2



మంగళవారం ఒడ్డుకు వచ్చిన మత్స్యకారులతో పోలీసులు

## ఆ 10 మంది మత్స్యకారులు సురక్షితం

### మూడు రోజులు అన్వేషించి ఒడ్డుకు చేర్చిన శ్రీకాకుళం పోలీసు బృందం

**ఇచ్ఛాపురం (శ్రీకాకుళం జిల్లా), జూలై 7 ప్రభాతవార్త:** గత నెల జూన్ 24వ తేదీన విశాఖపట్నం తీర ప్రాంతానికి చెందిన 10 మంది మత్స్యకారులు చేపల వేట నిమిత్తం బోటులో సముద్రంలోకి వెళ్లారు. వేట నిర్వహిస్తున్న సమయంలో బోటు ఒడిశా సముద్ర సరిహద్దు ప్రాంతానికి చేరుకోగా ఇంజిన్ సాంకేతిక లోపం తలెత్తడంతో పాటు ప్రతికూల వాతావరణం, తుఫాను ప్రభావం కారణంగా సముద్రంలో చిక్కుకుపోయారు. ఈ విషయం సోషల్ మీడియా ద్వారా తెలియగానే విశాఖపట్నం రేంజ్ ఐజీ మరియు మెరైన్ విభాగం ఐజీ గోపీనాథ్ జట్టి తక్షణమే స్పందించి శ్రీకాకుళంజిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డికి అవసరమైన ఆదేశాలు జారీచేశారు. చిక్కుకుపోయిన మత్స్యకారులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చేందుకు వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఇచ్ఛాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.చిన్నా >>2

## గోదావరి పుష్కరాల్లో తోలుబొమ్మలాట ప్రదర్శనలు

## జీరాంజీ కింద కామన్ ఫెసిలిటీ సెంటర్లు: డి.సిఎం పవన్



మంగళవారం విజయవాడలో జరిగిన హస్తకళా ప్రదర్శనలో స్టాల్స్ పరిశీలిస్తున్న డి.సిఎం పవన్

# ఇక హస్తకళల పర్యాటకం

**విజయవాడ,జూలై7,ప్రభాతవార్తప్రతినిధి:** కళాకారుల ప్రతిభ ప్రపంచానికి తెలియాలి. పిల్లలు, వారి తల్లిదండ్రుల కళను వారసత్వంగా కొనసాగించాలని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. సంప్రదాయం గుర్తుచేసుకోవడానికి కాదు, మరింత ముందుకు సాగాలన్నారు. లోకల్ టు గ్లోబల్ రీతిన మన హస్తకళలు ప్రపంచానికి చేరాలి అన్నారు. మన వస్తువులకు మార్కెటింగ్ పెరగాలి. కళారూపాలకు మూలాధారమైన కర్ర నిల్వ అవసరం. కళాకారులపై కేసులు లేకుండా చేశామన్నారు. మంగళవారం విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో >>2

## కృష్ణలంక పిఎస్‌లో నాగరాజు విచారణ

### సిట్‌ను అనుమతించిన హైకోర్టు

### సాయికృష్ణ లాకప్‌డెత్ కేసు

**విజయవాడ,జూలై7,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కీలక తీర్పునిచ్చింది. నిందితుడు, సస్పెండైన సీఐ నాగరాజును విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో విచారించేందుకు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(సిట్)కు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు దిగువ కోర్టు ఇచ్చిన ఆదేశాలను న్యాయస్థానం సవరించింది. అలాగే విచారణ ప్రక్రియ మొత్తాన్ని వీడియోగ్రఫీ చేసి సంబంధిత కోర్టు ముందు ఉంచాలని పేర్కొంది. సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో సీఐ నాగరాజు కస్టడీపై దిగువ కోర్టు ఇచ్చిన ఆదేశాలను మార్చాలని కోరుతూ ఏపీ హైకోర్టులో ఇటీవల సిట్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై నిన్న (సోమవారం) విచారణ జరగగా.. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును మంగళవారానికి రిజర్వ్ చేసింది. ఈ మేరకు నేడు తీర్పు వెలువరించింది. సోమవారం నాడు కేసు విచారణ సందర్భంగా ఇరువర్గాల న్యాయవాదులు పోటాపోటీగా తమ వాదనలు వినిపించారు. ఏపీ ప్రభుత్వం తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కీలక విషయాలను కోర్టు దృష్టికి తెచ్చారు. విజయవాడ కోర్టు విధించిన కొన్ని షరతుల కారణంగా దర్యాప్తునకు ఆటంకం కలుగుతోందని హైకోర్టుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపారు. నిందితుడిని ప్రశ్నించేందుకు పరిమితులు ఉండటంతో దర్యాప్తు సక్రమంగా జరిగే అవకాశం లేదని పేర్కొన్నారు.

నాగరాజును విచారించే సమయంలో వీడియో రికార్డింగ్‌కు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని.. అయితే ఆడియో రికార్డింగ్ వల్ల దర్యాప్తు గోప్యత దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో విచారణ వల్ల నిందితుడి హక్కులకు ఎలాంటి భంగం కలగదని ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదించారు. మరోవైపు నాగరాజు తరఫు న్యాయవాది కూడా హైకోర్టులో తన వాదనలు వినిపించారు. తన క్లయింట్‌కు ప్రాణహాని ఉందని, భద్రతా కారణాల దృష్ట్యా కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో విచారణకు అనుమతి ఇవ్వొద్దని హైకోర్టును కోరారు. అన్ని రకాల సౌకర్యాలు, భద్రత ఉన్న రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలోనే విచారణ చేపట్టేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. ఈ మేరకు నేడు తీర్పు వెలువరించింది.



## అహ్మదాబాద్ పేలుళ్ల కేసులో 38మందికి ఉరి ఖరారు

### 11మందికి జీవిత ఖైదు

### ప్రత్యేక కోర్టు తీర్పు సమర్థించిన హైకోర్టు

**అహ్మదాబాద్, జులై 7:** అహ్మదాబాద్‌లో 2008నాటి వరుస బాంబుపేలుళ్ల కేసులో 38 మంది దోషులకు విధించిన మరణశిక్ష గుజరాత్ హైకోర్టు సమర్థించింది. మరో 11 మందికి విధించిన జీవిత ఖైదును కూడా యథాతథంగా కొనసాగిస్తూ కీలక తీర్పు వెలువరించింది. ఉగ్రదాడిలో మరణించిన బాధితుల కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. 2022లో ప్రత్యేక ట్రయల్ కోర్టు విధించిన మరణశిక్షలను ఉన్నత హైకోర్టు సమర్థించింది. ఒకే కేసులో ఇంత పెద్దసంఖ్యలో నిందితులకు ఉరిశిక్ష ఖరారు కావడం భారత న్యాయవ్యవస్థ చరిత్రలోనే ఇది మొదటిసారి. ట్రయల్‌కోర్టు ఇచ్చిన ఈ తీర్పును సవాలు చేస్తూ దాఖలైన >>2



## ఫ్రాన్స్ అధ్యక్షునికి తప్పిన ప్రమాదం

### డమాస్కస్‌లోని హోటల్ వద్ద భారీ పేలుడు, 18 మందికి తీవ్రగాయాలు

2లో




మంగళవారం సియోల్‌లో ఎల్‌జీ అధికారులు,ప్రతినిధులతో మంత్రి నారా లోకేష్

# పెట్టుబడుల కేంద్రంగా ఏపి

>> ఉన్నతస్థాయి బృందంతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. హ్యుందాయ్ మోబిస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ యంగ్ బిన్ కిమ్ మాట్లాడుతూ... భారత్ లోని చెన్నై, అనంతపురంలో మాడ్యూల్స్, కీలక విడిభాగాలను తమ సంస్థ తయారు చేస్తుందని తెలిపారు. గురుగ్రామ్ ఆఫ్టర్‌మార్కెట్ విడిభాగాల కేంద్రం ఉంది. చెన్నై లాజిస్టిక్స్ కేంద్రం నుంచి హ్యుందాయ్/కియా సర్వీస్ విడిభాగాలను ఎగుమతి చేస్తుందని చెప్పారు. కొత్తగా హైదరాబాద్ లో ఆర్ అండ్ డీ కేంద్రం, బెంగళూరులో సాఫ్ట్ వేర్ ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అనంతపురంలోని తయారీ కేంద్రం ద్వారా హ్యుందాయ్ సంస్థ కియా ఇండియా కోసం మాడ్యూల్స్, కీలక విడి భాగాలను ఉత్పత్తి చేస్తుందని, ఎయిర్‌బ్యాగ్స్, ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ వంటి కీలక భాగాలను సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

**అపాక్ట్ సీఈవో సియాంగ్ డాంగ్ లీతో మంత్రి నారా లోకేష్ భేటీ:** సెమీకండక్టర్స్, ఒసాట్ (అసెంబ్లింగ్, ప్యాకేజింగ్, టెస్టింగ్) రంగంలో పేరెన్నికగన్న అపాక్ట్ కంపెనీ సీఈవో సియాంగ్ డాంగ్ లీ తో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సియోల్ లో సమావేశమ య్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్‌లో అపాక్ట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి నిర్ణయించినందుకు ధన్య వాదాలు తెలిపారు. అపాక్ట్‌తో దీర్ఘకాలిక భాగస్వా మ్యాన్ని ఆశిస్తున్నట్లు చెప్పారు. భారతదేశంలో పెట్టుబ డులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్న హనా మైక్రాన్ తో పాటు ఇతర ఒసాట్ సంస్థలను ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా అనుసంధానించాలని దిగిని కోరారు. సెమీకండక్టర్ కార్యకలాపాలకు సంబం ధించి యువతలో నైపుణ్యాభివృద్ధిని పెంపొం దించడం కోసం ఏపీఎస్ఎస్‌డీసీతో భాగస్వామ్యం కుదుర్చుకోవాలని మంత్రి లోకేష్ ప్రతిపాదిం చారు. భారతదేశంలో అపాక్ట్ కార్యకలాపాల విస్తరణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని స్పష్టం చేశారు. అపాక్ట్ సీఈవో సియాంగ్ డాంగ్ లీ మాట్లాడుతూ హైదరాబాద్ కేంద్రంగా ఫిబ్రవరి 2024లో ప్రకటించిన ఏఎస్ఐపీ టెక్నాలజీస్ జాయింట్ వెంచర్, విశాఖపట్నం కోసం 12 ఆగస్టు 2025న ఇండియా సెమీకండక్టర్ మిషన్ కింద ఆమోదం లభించిందని తెలిపారు. రూ. 468కోట్లతో సంవత్సరానికి 96 మిలియన్ల పరికరాలను తయారుచేసే లక్ష్యంతో ఏర్పాటు కానున్న విశాఖ యూనిట్ నిర్మాణం త్వరలోనే ప్రారంభమవుతుందని చెప్పారు. ఎసిప్ ఎపాక్ట్ వైజాగ్ ఒసాట్ జాయింట్ వెంచర్ ఆంధ్రప్రదేశ్‌కు లభించిన ఒక ప్రతిష్ఠాత్మక సెమీకండక్టర్ విజయంతమని ఆయన అభివర్ణించారు. ఏపీ ప్రభుత్వం అందించిన ప్రతిపాద నలను సానుకూలంగా పరిశీలిస్తామని ఈ సందర్భంగా లీ తెలిపారు.

# ఇక హస్తకళల పర్యాటకం



హస్త కళాకారులు తయారు చేసిన టోపీని ధరించిన డి.సిఎం పవన్

>> ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ (లేపాక్షి) ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహో త్సవం 2026ను పవన్ కళ్యాణ్ ప్రారంభించారు ఈ మహోత్సవంలో రాష్ట్ర నలుమూలల నుంచి వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ హస్త కళాకారులు ఉత్పత్తి చేసిన కళా రూపాలను ప్రదర్శనకు ఉంచారు. ఈ సందర్భంగా తోలుబొమ్మలాట కళాకారులు ప్రదర్శించిన రామాయణంలోని రావణ సంహార ఘట్టాన్ని తిలకించారు. సతీమణి అన్నా కొణిదల కోసం ఉప్పాడ జాందానీ చీరలు కొనుగోలు చేశారు. ప్రతి స్టాల్‌ను సందర్శిస్తూ, హస్తకళా ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ కళాకారులకు తనవంతు ప్రోత్సాహం అందించారు. కళాకారులతో మమేకమవుతూ, వారి నైపుణ్యాన్ని అభినందించారు. కళాకా రుల సాధకబాధకాలు అడిగి తెలుసుకున్నారు. వారికి అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కళాకారుల కోరిక మేరకు క్లస్టర్ల వారీగా గ్రూపు ఫోటోలు దిగారు. మన రాష్ట్రానికే సొంతమైన హస్తకళల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. మహోత్సవంలో కాకినాడకు చెందిన తోలుబొమ్మల కళాకారులు ఏర్పాటు చేసిన స్టాల్‌ను పవన్ కళ్యాణ్ సందర్శించారు. సనాతన ధర్మ ఔన్నత్యాన్ని తెలియజేసే విధంగారూపొందించిన రామాయణ, భారత, భాగవత కళారూపాలను పవన్ కళ్యాణ్ పరిశీలించారు. తోలుబొమ్మలాట కళాకారులు ప్రదర్శించిన రావణ సంహార ఘట్టం అందర్నీ ఆకట్టుకుంది. తరతరా లుగా తోలుబొమ్మలాటను నమ్ముకుని జీవనాధారం సాగిస్తున్న తమ కుటుంబాలు, నేడు అంతర్జాతీయ స్థాయి ప్రదర్శనలు ఇచ్చే స్థితికి చేరుకున్నట్టు కళాకారులు వివరించారు. తోలుబొమ్మలాట ఔన్నత్యాన్ని చాటేలా రాబోయే గోదావరి పుష్కరాల్లో తోలుబొమ్మలాట ప్రదర్శన ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. హస్తకళాకారుల స్టాళ్లను పరిశీలించారు. కొండపల్లి, ఏటికొప్పాక వంటి బొమ్మలను ఆసక్తిగా చూశారు. హస్తకళాకారుల గ్రామాలను పర్యాటకంతో అనుసంధానించాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో చేనేత, హస్తకళల సలహాదారు సుచిత్రా ఎల్లా సూచించిన ప్రతిపాదనను పవన్ అభినందించారు. అనంతరం ఆయన మాట, మంతి కార్యక్రమంలో మాట్లాడుతూ హస్త కళాకారుల కోసం కంటిచూపు పరీక్షలు నిర్వహిస్తాం. భారతదేశ ఉనికికి హస్త కళారూపాలు మూలం. హస్త కళాకారుల కోసం ప్రభుత్వం దన్నుగా నిలబడుతుంది. ప్రతి కళాకారుడికి ఒక కథ, ఒక కష్టం ఉంటుంది. హస్తకళల గ్రామాలను పర్యాటకంగా అనుసంధానం చేయాలి. హస్త కళాకారుల సమస్యలపై కేబినెట్‌లో ప్రస్తావిస్తా జాతి గొప్పతనం నిర్మాణాల్లో కాదు, కళాకారుల పనితనంలో ఉంటుందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. బొబ్బిలి వీణలు, ఏటికొప్పాక బొమ్మలు మన సంస్కృతి చాటుతున్నాయన్నారు. హస్తకళా రూపాలు ప్రపంచానికి చేరాలంటే ఆన్‌లైన్ మార్కెటింగ్ అవసరం అన్నారు. ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం తరహాలో హస్తకళల పర్యాటక అభివృద్ధికి చర్యలుతీసుకుంటామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రిస్పష్టం చేశారు. కళాఖండాన్ని రూపొందించిన కళాకారుడికి ఆ గుర్తింపు దక్కే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కళాకారుల కష్టాన్ని ప్రపంచానికి పరిచయం చేసే విధంగా ప్రత్యేక డాక్యుమెంటరీలు రూపొందించాలని అధికారులకి దిశానిర్దేశం చేశారు. విబి జీ రాం జీ పథకం కింద క్లస్టర్లవారీగా కామన్ ఫెసిలిటీ సెంటర్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. హస్తకళల పరిరక్షణకు అన్నివిధాల చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. హస్తకళాకారుల ఆరోగ్య పరిరక్షణకు క్లస్టర్ల వారీగా నిరంతరం వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు.

**లేపాక్షి ఈ కామర్స్ యాప్ ఆవిష్కరణ:** హస్తకళా మహోత్సవం వేదిక నుంచి లేపాక్షి ఈ కామర్స్ యాప్ ను పవన్ కళ్యాణ్ ఆవిష్కరించారు. ఈ యాప్ గూగుల్ ప్లే స్టోర్ తో పాటు యాపిల్ యాప్ స్టోర్ లోనూ అందుబాటులో ఉంటుంది. ఈ యాప్ ద్వారా మన రాష్ట్ర హస్తకళా ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్త మార్కెటింగ్ అవకాశాలు దక్కనున్నాయి. దీంతో పాటు రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వివిధ క్లస్టర్లలో ఏర్పాటు చేసిన 100 ఉద్యమ్ వర్క్ షాపులను ప్రారంభించారు. 2 వేల మంది కళాకారులను అధికారిక పారిశ్రామిక వ్యవస్థలోకి తీసుకురావడం లక్ష్యంగా ఈ వర్క్ షాపులను నిర్వహిస్తున్నారు. అనంతరం సంప్రదాయ హస్తకళల పరిరక్షణ, ప్రచారంలో విశేష కృషి చేసిన పలువురిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, జౌళి, వస్త్ర పరిశ్రమల శాఖ మంత్రి ఎస్. సవిత, విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ , రాష్ట్ర చేనేత, హస్తకళల విభాగం సలహాదారు సుచిత్ర ఎల్లా, హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ , పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కళ్యాణం శివశ్రీనివాస్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, చేనేత, జౌళిశాఖ కమిషనర్ రేఖారాణి , అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు పీసీసీఎఫ్ పి.వి. చలపతిరావు , ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ , ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## జీరాంజీ కింద తొలి విడతగా రూ.2,545.50 కోట్లు విడుదల

**విజయవాడ,.జూలై7,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామీణ ఉపాధి, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్రం భారీ ఊతం ఇచ్చింది.కూలీల వేతనాల కోసం రూ.1,414.16 కోట్లు కేటాయింపు చేసింది. మెటీరియల్ వ్యయాలకు రూ.942.77 కోట్లు విడుదల చేసింది.గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత ఆస్తుల నిర్మాణానికి ప్రాధాన్యం. ఇస్తూ ఈ పథకం అమలు చేస్తూంది..వీబీజీ-గ్రాం ద్వారా గ్రామీణాభివృద్ధికి కొత్త దిశ అని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలియచేసారు.వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనలో ఏపీ ముందంజలో ఉంటుందని కేంద్రమంత్రి పెమ్మసాని ఆశాభావం వ్యక్తం చేసారు.

## ప్రశ్న రావణ్ నెల్లూరు జైలుకు తరలింపు

**నెల్లూరు క్రైమ్, జూలై 7, ప్రభాతవార్త :** హిందూ దేవుళ్లను అవమానించడంతోపాటు, మావోయిస్టు పార్టీకి అనుకూలంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన కేసులో ప్రశ్న రావణ్‌ను పోలీసుల అరెస్టు చేసి గన్నవరం కోర్టులో హాజరు పరచగా న్యాయస్థానం ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. నేస్తమా ఆదేశాల మేరకు ప్రశ్న నెల్లూరు జిల్లా కేంద్ర కారాగారానికి తరలించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజులను దూషించిన కేసులోనూ నెల్లూరు దర్గా మిట్ట పోలీస్ స్టేషన్లో ఆయనపై కేసు నమోదయి ఉంది.

# ఎంట్రప్రెన్యూర్లుగా రైతులు

>> ఏటికొప్పాక, కొండపల్లి, ధర్మవరం, మంగళగిరి, ఉప్పాడ, పొందూరు కళారూపాల్ని కూడా తీర్చిదిద్దాలి. ఇందుకోసం వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలి. నేచర్, వాటర్, అమ్యూజ్మెంట్ పార్కులను అనుసంధానించాలి. సూర్యలంక మాస్టర్ ప్లాన్ త్వరితగతిన రూపొందించాలి. కుప్పంలో కంగుంది కోట, చిత్తూరు జిల్లాలో ఎలిఫెంట్ సఫారీ వంటివి అభివృద్ధి చేయాలి. ముఖ్యంగా పర్యాటక రంగం నుంచి జీఎస్‌డీపీకి వాటా పెరిగేలా చూడాలి అని ముఖ్యమంత్రి చెప్పారు. మరోవైపు రాష్ట్రంలో పర్యాటకరంగ అభివృద్ధికి అవసరమైన హోటల్ గదులు పెద్దఎత్తున వస్తున్నాయని సీఎం అన్నారు. 2024లో 4,390 హోటల్ రూములు ఉంటే ఈ రెండేళ్లలో 9,364 హోటల్ రూముల నిర్మాణానికి అనుమతులు ఇచ్చామన్నారు. దీంతో రాష్ట్రంలో 13,753 హోటల్ రూములు అందుబాటులోకి వస్తుండగా... దీనికి కృషి చేసిన అధికారులను సీఎం అభినందనలు తెలిపారు.

**సోలార్ సెల్స్ తయారీలో అగ్రగామి కావాలి:** రెన్యూవబుల్ ఎనర్జీ విస్తృతం కావడంతో సోలార్ సెల్స్ తయారీ పరిశ్రమలను ఆహ్వానించాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. సోలార్ సెల్స్ లో ఏపీ అగ్రగామిగా నిలవాలన్నారు. ఇంకా ఏర్పాటు చేయాల్సిన 38 ఎంఎస్ఎంఈ పార్కులను త్వరితగతిన ప్రారంభించాలని నిర్దేశించారు. రైల్వే టెర్మినల్స్ కు ఎంఎస్ఎంఈ పార్కులను ఇంటిగ్రేట్ చేయాలన్నారు. లాజిస్టిక్స్ యూనివర్సిటీ, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లతో యువతకు ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటయ్యే పరిశ్రమలకు గ్రీన్ ఎనర్జీ వినియోగించేలా చూడాలన్నారు. బీపీసీఎల్, ఆమ్కా ప్రాజెక్టులు త్వరగా గ్రౌండింగ్ అయ్యేలా సంప్రదింపులు జరపాలన్నారు. రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశానికి మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, పి.నారాయణ, గొట్టిపాటి రవికుమార్, దుర్గేష్, సీఎస్ సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ప్రజాప్రభుత్వం అధికారం చేపట్టిన ఈ రెండేళ్లలో ఇప్పటివరకు 19 ఎస్ఐపీబీ సమావేశాలు నిర్వహించగా 339 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. వీటితో రాష్ట్రానికి మొత్తం రూ.11,86,271 కోట్ల విలువైన పెట్టుబడులు వస్తున్నాయి. అలాగే 10,41,821 మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయి.

# ఫ్రాన్స్ అధ్యక్షునికి తప్పిన ప్రమాదం

**డమాస్కస్, జులై 7:** సిరియా రాజధాని డమాస్కస్‌లో వరుస పేలుళ్లు తీవ్ర కలకలం రేపాయి. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ఆ దేశ పర్యటనలో ఉండగా ఆయన బస చేసిన హోటల్ వద్దే ఈ పేలుళ్లు చోటుచేసుకున్నాయి. అయితే, ఈ ఘటనలో ఆయన క్షేమంగా బయటపడినట్లు అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్-షరాతో సమావేశమయ్యేందుకు అధ్యక్ష భవనంలోకి మెక్రాన్ వెళ్లిన వెంటనే సమీపంలోని ఫోర్ సీజన్స్ హోటల్ వద్ద పేలుళ్లు సంభవించినట్లు సమాచారం. సుదీర్ఘ కాలంగా అంతర్యుద్ధంతో నలిగిపోయిన సిరియా.. ఇటీవల అక్కడ పాలకులు మారిన తర్వాత పునర్నిర్మాణంపై దృష్టి సారించింది. పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే గతంలో పలు దేశాలు విధించిన అనేక ఆంక్షలు ఎత్తివేయడానికి పాశ్చాత్య దేశాలను ఒప్పించడంలో కీలక పాత్ర వహించిన మెక్రాన్. అల్-షరా అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా ఆ దేశంలో కీలక పర్యటన చేపట్టారు. ఇందులో భాగంగా ప్రతినిధుల బృందంలోతో కలిసి డమాస్కస్‌లోని ఫోర్ సీజన్స్ హోటల్‌లోనే బస చేశారు. మెక్రాన్ పర్యటన కొనసాగుతున్న సమయంలోనే హోటల్‌కు సమీపంలో రెండు పేలుళ్లు సంభవించాయి. చెత్తడబ్బాలో ఒకటి, పార్కింగ్ చేసిన కారులో మరో పేలుడు జరిగినట్లు సిరియా అధికారిక మీడియా తెలిపింది. ఈ ఘటనలో నలుగురు భద్రతా సిబ్బందికి గాయాలైనట్లు సమాచారం. అయితే, డమాస్కస్‌లోని జస్టిస్ ప్యాలెస్ సమీపంలోని ఓ కేఫ్‌లో ఇటీవలే భారీ పేలుడు సంభవించగా, పది మంది ప్రాణాలు కోల్పోయారు.

# కాగ్నిజెంట్, విశాఖ ఐటి సెజ్‌కు కేంద్రం ఆమోదం

>> గా కూడా ప్రకటించడం విశేషం. కొన్ని నెలల క్రితం, ఫిబ్రవరిలో, తెలంగాణలోని నానక్‌రామ్ గూడ, ఆదిభట్లలో రెండు ఐటీ సెజ్‌ల ప్రతిపాదనలను కాగ్నిజెంట్ వెనక్కి తీసుకుంది. ఆ తర్వాత ఇప్పుడు విశాఖలో భారీ ప్రాజెక్ట్‌కు అనుమతులు సాధించడం ప్రాధాన్యం సంతరించుకుంది.ఈ ప్రాజెక్ట్‌తో సుమారు రూ.1,580 కోట్ల పెట్టుబడి, దాదాపు 8,000 ఉద్యోగాల కల్పన జరుగుతుందని అంచనా. దశలవారీగా పూర్తిస్థాయి క్యాంపస్‌ను అభివృద్ధి చేయనుండగా, విశాఖపట్నం ఐటీ స్వరూపాన్ని ఈ ప్రాజెక్ట్ సమూలంగా మార్చనుందని నిపుణులు భావిస్తున్నారు. విశాఖలో ఈ సెజ్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే ఎంతో మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ముఖ్యంగా విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల సాఫ్ట్ వేర్ ఇంజనీర్‌లకు, కొత్తగా చదువులు పూర్తి చేసి ఉద్యోగాల కోసం చూసే ఫ్రెషర్ లకు చాలా ఉపయుక్తంగా ఉంటుంది. స్థానిక యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఇతర రాష్ట్రాలకు నగరాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి తగ్గుతుంది మౌలిక సదుపాయాలు, రవాణా, ఇంటర్నెట్ ఫెసిలిటీ వంటి అంశాలలో మెరుగుదల ఈ ప్రాంతంలో ఐటీ రంగ అభివృద్ధికి దోహదం చేస్తుంది. ఈ ప్రాజెక్టు ఏపీ ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకు వెళ్లేందుకు ఉపయోగపడుతుంది. విశాఖ ఐటీ సెక్టార్ వృత్తి చెందడం ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థ కూడా బలపడుతుంది. ఇది ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధికి కీలకమవుతుంది. రాబోయే రోజులలో విశాఖలో మరిన్ని ఐటీ సంస్థలు వచ్చే అవకాశం పెరుగుతుంది. ఇది యువతకు ఉపాధి, రాష్ట్రానికి ఆర్థిక ప్రగతిని కలిగిస్తుంది.

# వేగంగా అమరావతి నిర్మాణం

## సిఆర్‌డిఎ 63వ సమావేశంలో సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూలై 7,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి నిర్మాణం వేగవంతంగా జరిగే విధంగా సీఆర్డీఏ అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు కీలక కార్యచరణను చేపట్టాలని ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశించారు.ఆ దిశలో అధికారులు స్పందించి పనిచేయాలన్నారు.రాజధానిలో నిర్మాణాలు,ఇతర అభివృద్ధి పనులకు అవసరమైన భూసేకరణ జరిగే విధంగా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలో సీఆర్డీఏ 63వ అథారిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో ఏపీ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, సీఎస్ సాయిప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాజధాని అమరావతి అభివృద్ధి, రెండో దశ ల్యాండ్ పూలింగ్, రైతులకు యాన్యుటీ, వ్యవసాయ రుణమాఫీ, ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు, వివిధ సంస్థలకు భూ కేటాయింపులు సహా తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించి పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. 2024 జూన్ 12 నుంచి రెండో దశ ల్యాండ్ పూలింగ్‌లో భూములు ఇస్తున్న రైతులకు ఎకరానికి వార్షిక యాన్యుటీగా రూ.40 వేల చొప్పున చెల్లించేందుకు అథారిటీ ఆమోదం తెలిపింది. భూములు అప్పగించిన తేదీ నుంచి పదేళ్లపాటు ఈ యాన్యుటీ అమల్లో ఉంచేందుకు నిర్ణయం తీసుకున్నారు. ప్రతి ఏడాది జరీబు భూములకు ఎకరానికి రూ.5 వేల చొప్పున, మెట్ట భూములకు ఎకరానికి రూ.3 వేల చొప్పున యాన్యుటీ పెంపునకూ అథారిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిపారు. గ్రామ కంఠాల్లో భూములు కోల్పోయిన వారికి ఏడాదికి రూ.10 వేల చొప్పున చెల్లించాలని నిర్ణయించారు.కొత్తగా ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో భూములు ఇచ్చే రైతు కుటుంబాలకు వ్యవసాయ రుణమాఫీ అమలు చేయాలని అథారిటీ తీర్మానించింది. 2026 జనవరి 6 లోపు తీసుకున్న వ్యవసాయ రుణాలకు ఈ నిర్ణయం వర్తించేలా అథారిటీ ఆమోదం తెలిపింది. ఇనాం భూములకు సంబంధించి దేవదాయ శాఖకు రూ.159 కోట్లు చెల్లించేందుకూ ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.. అమరావతిలో అభివృద్ధి చేస్తున్న 25 టౌన్‌షిప్‌లలో ప్రతి దాంట్లోనూ తప్పనిసరిగా ఒక అంతర్జాతీయ పాఠశాల ఉండేలా ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.ఇందుకు సమావేశం ఆమోదం తెలిపింది.ల్యాండ్ పూలింగ్‌కు ఇంకా భూములు ఇవ్వని రైతులకు మంగళవారం రాత్రి వరకు అవకాశం కల్పిస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు. ఆ తర్వాతా భూములు ఇవ్వకపోతే బుధవారం నుంచి భూసేకరణ ప్రక్రియను అమలు చేయాలని సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు.ఇప్పటికే జారీ చేసిన ల్యాండ్ అక్విజిషన్ నోటిఫికేషన్‌ను 2.5 ఎకరాల భూమికీ అమలు చేయాలని సమావేశం నిర్ణయం తీసుకుంది.ఏపీ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ సీఆర్డీఏ 63వ అథారిటీ సమావేశం నిర్ణయాలను మీడియాకు వివరించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం: ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

**కోవూరు (నెల్లూరు), జూలై 7, ప్రభాతవార్త :** ప్రజా సమస్యల పరిష్కారమే నా ధ్యేయమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మంగళవారం నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి వినతిని పరిశీలించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో వెంటనే ఫోన్‌లో మాట్లాడి సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా, ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజా సంక్షేమం, ప్రజల సమస్యలకు వేగవంతమైన పరిష్కారం అందించడమే కూటమి లక్ష్యమని పేర్కొన్నారు.



మంగళవారం జకార్తాలో ఇండొనేసియా అధ్యక్షుడు సుబియాంటోతో భేటీ అయిన ప్రధాని మోడీ

# ఇండొనేసియాకు 'బ్రహ్మోస్త్రం'

>> అత్యున్నత పౌర పురస్కారమైన బింటాంగ్ ఆదిపుర్ణ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేషియాను ప్రదానం చేసి అరుదైన గౌరవాన్ని అందించింది. జకార్తా పర్యటనలో భాగంగా ఇరు దేశాల మధ్య జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ ఒప్పందాలు కుదిరాయి. రక్షణ రంగంలో సహకారం ఈ ఒప్పందాల్లో ప్రధానంగా నిలిచింది. సముద్ర భద్రత, భద్రతా సహకారంపై ఉన్న అవగాహన ఒప్పందాన్ని ఇరు దేశాలు పొడిగించాయి. దీనికి తోడు, ఇండోనేషియాకు బ్రహ్మోస్, అస్త్రక్షిపణి వ్యవస్థలను అందించేందుకు ఒక రక్షణ కాంట్రాక్టుపై సంతకాలు జరిగాయి. భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్), ఇండోనేషియాకు చెందిన రిపబ్లికోర్ప్ మధ్య గగనతలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే క్షిపణుల సహకారంపైనా ఒక ఒప్పందం కుదిరింది. వాణిజ్య, ఆర్థిక రంగాల్లోనూ వ్యూహాత్మక భాగస్వామ్యానికి బలమైన పునాది పడింది. ఖనిజాలు, ఉక్కు సరఫరా వ్యవస్థలలో సహకారాన్ని మరింతగా పెంచుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. ఇందులో భాగంగా స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్, ఇండోనేషియాకు చెందిన పీటీ క్రాకటౌ స్టీల్ మధ్య ఒక వ్యూహాత్మక జాయింట్ వెంచర్ ఏర్పాటు కానుంది. వీటితో పాటు విపత్తు నిర్వహణ, వ్యవసాయం, టెలికమ్యూనికేషన్స్, వైద్య ఉత్పత్తుల నియంత్రణ, ఎన్నికల నిర్వహణ వంటి అంశాలపై కూడా పలు అవగాహన ఒప్పందాలు జరిగాయి. విద్యా, సాంస్కృతిక సంబంధాలను పెంపొందించే దిశగా ఐఐఎం బెంగుళూరు, పీటీ ఇంటెలిజెన్షియా గ్రహతామా మధ్య ఒక ఎంఓయూ కుదిరింది. ఇండోనేషియాలోని చారిత్రక ప్రంబనన్ ఆలయ సముదాయ పరిరక్షణ, పునరుద్ధరణ కోసం ఒక లెటర్ ఆఫ్ ఇంటెంట్‌ను కూడా మార్చుకున్నారు. ఈ పరిణామాలు ఇరు దేశాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేశాయని భారత విదేశాంగశాఖ ప్రకటించింది.

## ప్రధాని మోడీకి ఇండొనేసియా అత్యున్నత పురస్కారం

>> ప్రజల భావోద్వేగాలకు చెందుతుందని తెలిపారు. భారత్, ఇండోనేసియా మధ్య ఉన్న సన్నిహిత సంబంధాలకు ఇది నిదర్శనమన్నారు. ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోకు తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసినట్లు మోడీపేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రత, శ్రేయస్సు కోసం పాటుపడే వ్యక్తులను ఇండోనేసియా సర్కారు బింటాంగ్ ఆదిపూర్ణ అవార్డుతో సత్కరి స్తుంది.జకార్తాలోని అధ్యక్ష భవనంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ప్రధాని మోడీకి బింటాంగ్ ఆదిపూర్ణ పురస్కారాన్ని స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రబోవో మాట్లాడుతూ ఇండోపసిఫిక్ ప్రాంతంలో స్థిరత్వాన్ని నెలకొల్పే శక్తిగా భారత్ పోషిస్తున్న కీలక పాత్రకు, ద్వైపాక్షిక సంబంధాలను మార్చడంలో ప్రధాని మోడీ వ్యక్తిగత నాయకత్వానికి ఈ పురస్కారం ఒక గుర్తింపు.మా గణతంత్రంఅందించే అత్యున్నత పురస్కారం ఇది. ఇండోనేషియా,భారత్ మధ్య ఉన్న చారిత్రక నాగరికతాబంధాలు,విడదీయరాని వ్యూహాత్మకవిశ్వాసానికి ఇది నిదర్శనమని ప్రకటించారు.

# ఆ 10 మంది మత్స్యకారులు సురక్షితం

>>నాయుడు ఆధ్వర్యంలో కవిటి ఎస్ఐ రవివర్మతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్ల చిరంజీవి, బషీర్ మరియు హోంగార్డు శ్రీనివాస్‌తో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి, వెంటనే ఒడిశా సరిహద్దు ప్రాంతానికి పంపించారు. ఆయా పోలీసు బృందం ఒడిశా మెరైన్ పోలీసు, కోస్ట్ గార్డ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ, సముద్రంలో చిక్కుకున్న మత్స్యకారులతో నిరంతరం సంప్రదిస్తూ (కమ్యూనికేషన్) కొనసాగించింది.

మూడు రోజులపాటు నిరంతర శ్రమతో సహాయక చర్యలు నిర్వహించి, బోటును సురక్షితంగా పారాదీప్ సముద్ర తీర ప్రాంతానికి చేర్చడంలో కీలక పాత్ర పోషించారు. అనంతరం మత్స్యకారులకు అవసరమైన భద్రత, ఆహారం, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి, వారి కుటుంబ సభ్యుల వద్దకు క్షేమంగా చేరేలా అన్ని చర్యలు తీసుకున్నారు.

ఈ సందర్భంగా మత్స్యకారుల ప్రాణాలను కాపాడేందుకు అంకితభావంతో పనిచేసిన జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి పర్యవేక్షణలో ఇచ్ఛాపురం సీఐ ఎం.చిన్నానాయుడు ఆధ్వర్యంలోని పోలీసు బృందాన్ని విశాఖపట్నం రేంజ్ ఐజీ మరియు మెరైన్ విభాగం ఐజీ గోపీనాథ్ జట్టి అభినందిస్తూ, వారి సేవా స్ఫూర్తిని ప్రశంసించారు.

## 38మందికి ఉరి ఖరారు

>> అప్పీళ్లను, అలాగే మరణశిక్షల ఖరారు పిటిషన్లను గుజరాత్ హైకోర్టు సమగ్రంగా విశ్లేషించింది. డిజిటల్ ఆధారాలు, ఫోరెన్సిక్ నివేదికలు, నిందితుల కాల్ డేటా రికార్డులను పరిశీలించిన తర్వాత.. దిగువ కోర్టు ఇచ్చిన తీర్పు చట్టబద్ధమైనదని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. దోషులకు శిక్షల ఖరారుతో పాటు, ఉగ్రదాడిలో సర్వస్వం కోల్పోయిన కుటుంబాల పట్ల న్యాయస్థానం మానవీయ కోణంలో స్పందించింది. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయక పౌరుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 10 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని హైకోర్టు గుజరాత్ ప్రభుత్వానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. అలాగే తీవ్ర గాయాలపాలైన బాధితులకు రూ. 5 లక్షలు మరియు స్వల్ప గాయాలైన వారికి రూ. 1 లక్ష చెల్లించాలని కోర్టు ఆదేశించింది. తీర్పు అనంతరం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమిత్ పటేల్ మాట్లాడుతూ, డివిజన్ బెంచ్ తీర్పు వెలువరించడానికి ముందు మార్చి 2025 నుండి ఈ అప్పీళ్లపై రోజువారీ ప్రాతిపదికన విచారణ జరిగిందని తెలిపారు. "ఈ కేసులో విచారణ మార్చి 2025 నుండి రోజువారీగా జరుగుతూ వచ్చింది. మంగళవారం గుజరాత్ హైకోర్టు డివిజన్ బెంచ్ తన తీర్పును వెలువరించింది" అని పటేల్ పేర్కొన్నారు. పూర్తి స్థాయి తీర్పు ఇంకా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రాలేదని, పూర్తి ఉత్తర్వును పరిశీలించిన తర్వాతే దీనిపై మరింత వ్యాఖ్యానించగలనని ఆయన చెప్పారు. "ప్రస్తుతానికి, పూర్తి తీర్పు అప్‌లోడ్ చేయబడలేదు, కాబట్టి నేను దానిని చదివే అవకాశం పొందలేదు. తీర్పు పూర్తి పాఠాన్ని పరిశీలించిన తర్వాతే నేను దానిపై వివరంగా వ్యాఖ్యానించగలను" అని ఆయన అన్నారు. ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసే హక్కు దోషులకు ఉంటుంది.

## వారం - వర్జ్యం

08-07-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, పునర్వసు కార్తె
అష్టమి మ.12.37
రేవతి మ.3.55
వర్జ్యం : లేదు
దు. ఉ.11.46-మ.12.38
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** మాటల చాతుర్యంతో శత్రువులను సైతం మిత్రులుగా మార్చుకుంటారు. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

**వృషభం:** దూరప్రాంతాల నుండి ముఖ్య సమాచారం తెలుసుకుంటారు. చర్చాగోష్ఠులలో పాల్గొంటారు.దీర్ఘకాలిక సమస్యలు తీరుతాయి.

**మిథునం:** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. కొత్తకార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఓర్పుతో ఎంతటి కార్యాన్నైనా సాధిస్తారు.

**కర్కాటకం:** కాలానుగుణంగా వచ్చే మార్పులకు అనుగుణంగా నడుచుకోవడానికి కొంత ఇబ్బంది పడతారు.

**సింహం:** ఇంటాబయటా మీ మాటే చెల్లుబాటు కాగలదు. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం. శుభవార్తలు వింటారు.

**కన్య :** స్థిరాస్తి వివాదాలు పరిష్కార మవుతాయి. వాహనాల విషయంలో జాగ్రత్తలు అవసరం. క్రీడారంగం యందు ఆసక్తి చూపుతారు.

**తుల :** గృహసంబంధమైన విషయాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారనే భావన మీ వారిలో రానివ్వకుండా జాగ్రత్తలు వహించండి.

**వృశ్చికం:** ఉపయోగపడని వ్యక్తులనుకున్న వారే కార్య విజయాలను కారణం అవుతారు. ఆస్తి వివాదాలు తీరి లబ్ధిని పొందుతారు.

**ధనుస్సు:**రాజకీయ రంగాలలోని వారికి కొంతవరకు అనుకూలంగా ఉంటుంది. చేతి వృత్తి పని వారికి అనుకూలంగా ఉంటుంది.

**మకరం:** పుకారులను నమ్మకండి. సంతాన విద్యా విషయాలలో కొంత అశాంతికి లోను అవుతారు. గృహ యోగం కలదు.

**కుంభం:**పనులు నిదానంగా పూర్తి చేస్తారు. నూతన ఒప్పందాలు కుదురు తాయి. ఉద్యోగ యత్నాలు ముమ్మరం చేస్తారు.

**మీనం:** ముఖ్యమైన పత్రాలను జత చేయవలసిన వాటిని మర్చి పోయే అవకాశం ఉంది. జాగ్రత్తలు పాటించండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# బాలికపై లైంగిక దాడి.. ఆత్మహత్య

## నిందితులపై పోక్సో కేసు నమోదు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూలై7,ప్రభాతవార్త:** బాలిక పై లైంగిక దాడి,బాలిక ఆత్మహత్యాయత్నం, మృతి చెందిన సంఘటన తూర్పు గోదావరి జిల్లా లో చోటు చేసుకుంది.దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ప్రకారం కొవ్వూరు మండలం బంగారమ్మపేట గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలికపై లైంగిక దాడి జరిగినట్లు ఆరోపణలు వెలుగుచూశాయి. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో రావులపాలెం మండలం ఊబలంక గ్రామానికి చెందిన బసవాని లక్ష్మణ్‌ను నిందితుడిగా గుర్తించిన పోలీసులు.. అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బాధితురాలు, నిందితుడు వరుసకు అన్నాచెల్లెలు అవుతారని సమాచారం. ఈ ఘటన అనంతరం బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. బాలికను కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వెల్లడించారు. ఈ ఘటనపై పోలీసులు పోక్సోతో పాటు సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# పంటల బీమా పథకాలు కొనసాగింపు

- అర్హులైన ప్రతి రైతు నమోదు చేసుకోవాలి • రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు
- రుణ రైతులకు ఆప్ట్అవుట్ విధానం యథాతథం • రుణేతర రైతులు కూడా స్వచ్ఛందంగా నమోదు చేసుకోవచ్చు
- అగ్రిస్టాక్ ఫార్మర్ ఐడి, ఇపంట ధ్రువీకరణకు ప్రాధాన్యం • రాష్ట్ర ప్రభుత్వం ప్రీమియం సబ్సిడీ భారం భరిస్తుంది

**విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని రైతులకు పంటల భద్రత కల్పించేందుకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పునర్వ్యవస్థీకరించబడిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకంలను 2026-27 సంవత్సరానికి (ఖరీఫ్, రబీ) మరో ఏడాది పాటు కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ, సహకార శాఖల ద్వారా సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయని పేర్కొన్నారు. పంటల బీమా పథకాల ద్వారా ప్రకృతి వైపరీత్యాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, ఇతర అనుకోని కారణాలతో పంట నష్టపోయిన రైతులకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఖరీఫ్-2026 సీజన్‌లో నోటిఫై చేసిన ప్రాంతాల్లో నోటిఫై చేసిన పంటలను సాగు చేస్తున్న యజమాని రైతులు, కౌలు రైతులు, భాగస్వామ్య సాగుదారులు, పంటపై బీమా హక్కు కలిగిన వారు అందరూ పథకంలో నమోదు చేసుకోవచ్చని మంత్రి పిలుపునిచ్చారు.



**రైతులు గడువులోపు నమోదు చేసుకోవాలి:** పధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ఖరీఫ్-2026 సీజన్‌లో వరి మినహా అన్ని నోటిఫైడ్ పంటలకు రుణ కాలం ఏప్రిల్ 1 నుంచి జూలై 31 వరకు ఉండగా, రుణ, రుణేతర రైతుల నమోదు గడువు జులై 31గా నిర్ణయించబడిందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. వరి పంటకు రుణ కాలం ఏప్రిల్ 1 నుంచి ఆగస్టు 15 వరకు ఉండగా, నమోదు గడువు ఆగస్టు 15గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

రబీ 2026-27 సీజన్‌లో వరి మినహా అన్ని నోటిఫైడ్ పంటలకు రుణ కాలం అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 15 వరకు ఉండగా, నమోదు గడువు డిసెంబర్ 15గా నిర్ణయించారని, వరి పంటకు రుణ కాలం అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు ఉండగా నమోదు గడువు డిసెంబర్ 31గా నిర్ణయించినట్లు తెలిపారు.

**రుణ రైతులకు 'ఆప్ట్ అవుట్' విధానంలో బీమా:** సీజనల్ పంట రుణం లేదా కిసాన్ క్రెడిట్ కార్డు పరిమితి మంజూరైన లేదా పునరుద్ధరించిన రైతులు సంబంధిత బ్యాంకు శాఖల ద్వారా ఆటోమేటిక్‌గా పంట బీమా పరిధిలోకి వస్తారని మంత్రి తెలిపారు. బీమా వద్దనుకునే రైతులు మాత్రమే నమోదు గడువుకు కనీసం ఏడు రోజుల ముందుగా రుణం మంజూరు చేసిన బ్యాంకు శాఖకు లిఖితపూర్వకంగా 'ఆప్ట్ అవుట్' ప్రకటన సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. అలాంటి ప్రకటన సమర్పించని రైతులందరూ స్వయంచాలకంగా బీమా పరిధిలోకి వస్తారని స్పష్టం చేశారు. నోటిఫై చేసిన పంటలకు సంబంధించి రుణ రైతులకు బీమా వర్తింపజేయడం తప్పనిసరి అని పేర్కొన్న మంత్రి, బ్యాంకులు రైతు చెల్లించాల్సిన ప్రీమియం వాటాను డెబిట్ చేసి, వాస్తవ సాగు విస్తీర్ణం ఆధారంగా పంటల వారీగా బీమా నమోదు చేయాలని సూచించారు. నిర్ణీత గడువులోపు ప్రీమియంతో కూడిన సమగ్ర వివరాలను బీమా సంస్థలకు పంపించడంతో పాటు విదిశిలో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

నిర్ణీత సమయంలో ప్రీమియం, రైతుల వివరాలను బీమా సంస్థలకు పంపించడంలో బ్యాంకులు లేదా శితిదిళి విఫలమైతే, బీమా రక్షణ కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాల్సిన బాధ్యత ఆయా బ్యాంకులదేనని స్పష్టం చేశారు.

**రుణేతర రైతులకు స్వచ్ఛంద నమోదు:** రుణేతర రైతులు స్వచ్ఛందంగా పథకంలో నమోదు చేసుకోవచ్చని మంత్రి తెలిపారు. ఇందుకోసం యజమాని రైతులు రికార్డ్ ఆఫ్ రైట్స్ ల్యాండ్ పొజెషన్ సర్టిఫికేట్ లేదా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఇతర భూ రికార్డులను సమర్పించాల్సి ఉంటుంది.

కౌలు రైతులు, భాగస్వామ్య సాగుదారులు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన ఒప్పంద పత్రాలు లేదా సంబంధిత ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. అదనంగా బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌బుక్ ప్రతులు, రైతు స్వీయ పంట సాగు ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. పూర్తి వివరాలతో సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి విదిశిలో నమోదు చేస్తారని, అసంపూర్ణ దరఖాస్తులు లేదా అవసరమైన పత్రాలు లేని దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోరని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

## ఆగస్టు 1 నుంచి మార్కెట్లోకి 'స్వయం ఎపి' బ్రాండ్

- 65 ప్రత్యేక ఉత్పత్తులకు సెర్ప్ గుర్తింపు
- గ్రామీణ మహిళా ఉత్పత్తులకు స్థిరమైన మార్కెట్ • ఎస్‌హెచ్‌జీ మహిళా కుటుంబాల్లో వివాహాలకు కల్యాణలక్ష్మి
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఆగస్టు 1 నుంచి మార్కెట్లోకి 'స్వయం ఎపి బ్రాండ్' అందుబాటులోకి వస్తుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం విజయవాడలోని సెర్ప్ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి ఆయా ప్రాంతాల సంప్రదాయాలను ప్రతిబింబించేలా 65 ప్రత్యేక ఉత్పత్తులను సెర్ప్ గుర్తించిందని, 587 మహిళా సంఘాల ఆధ్వర్యంలో తయారవుతోన్న ఈ ఉత్పత్తులను ఆగస్టు 1నుంచి మార్కెట్లోకి తీసుకు వస్తున్నట్టు మంత్రి ప్రకటించారు. ఈ ఉత్పత్తుల నిల్వ, ఆర్డర్ల నిర్వహణ, స్పీడ్ సరఫరా కోసం రెండు ఫుల్ ఫిల్‌మెంట్ సెంటర్లను కూడా ప్రారంభిస్తామన్నారు. విజయవాడలో బాపూజీ మ్యూజియం దగ్గర మరియు గొల్లపూడిలోని టీటీడీసీ ప్రాంగణంలో రెండు సిగ్నేచర్ స్టోర్లు కూడా ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రి తెలిపారు. ఉత్పత్తులు అన్నీ నాణ్యతా ప్రమాణాల మేరకు ఉండేలా చూస్తున్నామని, ఈ విషయంలో మహిళా సంఘాలకు పూర్తి శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ మహిళా ఉత్పత్తులకు స్థిరమైన మార్కెట్ సౌకర్యం కల్పించడం ద్వారా వారి ఆదాయం పెంచడంతో పాటు స్వయం ఏపీ బ్రాండ్‌ను మరింతగా అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి లక్ష్యానికి అనుగుణంగా పని చేస్తున్నట్టు మంత్రి పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటయ్యే పారిశ్రామిక సంస్థల సమర్థవంత పనితీరుకోసం ప్రతి నెలా సామాజిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఎస్‌హెచ్‌జీ మహిళల ద్వారా ఆధునిక యాంత్రిక, లాండ్రీ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సెర్ప్ అధికారులకు మంత్రి సూచించారు. ఎస్‌హెచ్‌జీ మహిళలకు వివాహ సంబంధిత అవసరాల కోసం తక్కువ వడ్డీతో, సులభంగా రుణం అందించేందుకు స్త్రీ నిధి "కల్యాణ లక్ష్మి" పథకం ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఎస్‌హెచ్‌జీ మహిళలందరిని ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన పథకాలలో 100 శాతం నమోదు చేసి జీవిత, ప్రమాద బీమా రక్షణ కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. వెలుగు మార్టులు పనితీరు నిరంతరం పర్యవేక్షించడంతో పాటు నష్టాలతో మూతపడిన, సరిగా పనిచేయని మార్టుల విషయంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ సెక్రటరీ సిఇఒ వాకాటి కరుణ, సెర్ప్ డైరెక్టర్లు, మార్కెటింగ్ సిబ్బంది, స్వయం ఎపి బ్రాండ్ కన్సల్టెంట్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గుమ్మడి గోపాలకృష్ణకు సిఎం అభినందన

- కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డుకు ఎంపికపై చంద్రబాబు ప్రశంస



**విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ఇటీవల కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డుకు ఎంపికైన ఎపి నాటక అకాడమీ ఛైర్మన్, ప్రముఖ రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణను ముఖ్య మంత్రి చంద్రబాబు అభినందించారు. సిఎం చంద్రబాబును సచివాలయంలో గోపాలకృష్ణ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రంగస్థలం నటనకు తొలిసారి కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు రావడం సంతోషకరమన్న సిఎం, గుమ్మడి గోపాలకృష్ణకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. గోపాలకృష్ణ వేసే నాటకాలన్నీ బాగుంటాయని, తన ప్రదర్శనలతో తెలుగు నాటక రంగానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారని ముఖ్యమంత్రి కొనియాడారు.

## చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యంపై వీడని మిస్టరీ

## వదంతులు నమ్మవద్దు: డిఎస్పీ తిలక్



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 7 ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా తుని మండలం దొండవాక పంచాయతీ పరిధిలోని సిహెచ్ అగ్రహారానికి చెందిన చిన్నారి జ్ఞానేశ్వరి మిస్సింగ్ కేసులో మిస్టరీ వీడలేదు. ఇంతవరకు ఏవిధమైన ఆచూకి లభించకపోగా సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న ప్రచారంతో దర్యాప్తులో పోలీసులకు తలనొప్పిగా మారింది. కాగా ఈ సంఘటన పై పోలీసు దర్యాప్తు కొనసాగుతోందని పెద్దాపురం డిఎస్పి తిలక్ అన్నారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిన్నారి జ్ఞానేశ్వరిని తల్లి వద్దకు చేర్చడమే లక్ష్యంగా పోలీసులు పని చేస్తున్నారన్నారు. చిన్నారి ఆచూకీ తెలిసినవారు పోలీసులకు సమాచారం అందిస్తే వారిపై ఎటువంటి కేసులు ఉండవని సంచలన ప్రకటన చేశారు. చిన్నారి జ్ఞానేశ్వరి కేసు పై పక్కా సమాచారంతో మీడియాలో వార్తలు ప్రచురించాలని, అసత్య కథనాల వలన కేసు పురోగతిపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. కేసులో పురోగతి సాధించేందుకు మీడియా సహకరించాలని కోరారు.

## శాంతిపురంలో అమెరికన్ విద్యార్థుల సందడి

- ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలు పరిశీలన



**శాంతిపురం, జులై 7 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం ఎంకెపురం గ్రామంలో అమెరికన్ విద్యార్థులు సందడి చేశారు. అమెరికాలోని ప్రెస్టిషియన్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థుల బృందం గ్రామంలో ఉన్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించింది. ఈ కార్యక్రమం రైతు సాధికార సంస్థ, ఎపి కమ్యూనిటీ మేనేజ్‌డ్ నాచురల్ ఫామింగ్ వారి ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా అమెరికన్ విద్యార్థులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి పంట సాగు విధానాలు అడిగి తెలుసుకున్నారు. పంటల నిర్వహణ, గోఆధారిత వ్యవసాయ ఉత్పత్తులు, జీవామృతం, ఘనజీవామృతం తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. రైతుల అనుభవాలను ఆసక్తిగా తిలకించారు. కుప్పం ప్రాంతంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ విధానం ఎంతో ఆదర్శంగా ఉందని అమెరికన్ విద్యార్థులు పేర్కొన్నారు. రైతులు అనుసరిస్తున్న విధానాలతో పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం అభివృద్ధికి సిఎం చంద్రబాబునాయుడు చూపిన దూరదృష్టిని అమెరికన్ విద్యార్థులకు వివరించారు. అలాగే స్వర్ణ కుప్పం లక్ష్యాల గురించి తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతుల ఆదాయం, నేల, ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు రామకుప్పం మండలం చెల్దిగానిపల్లి, పెద్దగానూరు గ్రామాలను సందర్శించారు. కార్యక్రమంలో డిపిఎం అమృతవల్లి, నోడల్ అధికారి బాజీబాబు, ఎఎంసి డైరెక్టర్లు, ఎఫ్ఎంటిలు, రైతులు పాల్గొన్నారు.

# విపత్తుల ప్రభావాన్ని తగ్గించేలా సమర్థవంతమైన చర్యలు

- ప్రజల ప్రాణాలు, జీవనోపాధి పరిరక్షణే ప్రభుత్వ ప్రాధాన్యత • వాతావరణ హెచ్చరికల ఆధారంగా ముందస్తు చర్యలు చేపట్టి 'జీరో లాస్' లక్ష్యంగా పనిచేయాలి
- జిల్లా కలెక్టర్లు వ్యక్తిగతంగా సన్నద్ధత, ప్రతిస్పందన చర్యలను పర్యవేక్షించాలి • రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత

**విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** విపత్తుల ప్రభావాన్ని తగ్గించేలా సమర్థవంతమైన చర్యలు చేపడుతున్నట్లు హోం మంత్రి అనిత తెలిపారు. ఈ విషయంలో పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. నైరుతి రుతుపవనాలు, ఎల్‌నినో ప్రభావంపై ఉన్నత స్థాయి అధికారులతో హోం మంత్రి అనిత సమీక్ష నిర్వహించారు. విపత్తుల వల్ల ఏ ఒక్క ప్రాణనష్టం జరగకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని హోం మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో నిరంతరం పని చేసేలా ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు.



రాయలసీమ జిల్లాలపై ఎక్కువగా ఎల్‌నినో ప్రభావం చూపుతుందని అన్నారు. శ్రీసత్యసాయి, అనంతపురం, అన్నమయ్య జిల్లాల్లో తీవ్రస్థాయిలో వర్షాల కొరత ఉందని తెలిపారు. కర్నూలు, నంద్యాల, చిత్తూరు, కడప జిల్లాల్లో ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, తిరుపతిలో వర్షభావ ప్రభావం మధ్యస్థంగా ఉన్నట్లు వెల్లడించారు. కరవు ముప్పు ఉన్న మండలాల్లో ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. వరద ముప్పు ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజల తరలింపునకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. పునరావాస కేంద్రాలలో ఆహారం, తాగునీరు, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు, విద్యుత్ వంటి కీలక సేవలకు ఎలాంటి అంతరాయం కలగకూడదని సూచించారు. పోలీస్, ఫైర్, ఎన్‌డీఆర్‌ఎఫ్ ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు అత్యవసర స్పందనకు సిద్ధంగా ఉండాలని హోం మంత్రి అనిత ఆదేశించారు. తూర్పు గోదావరి జిల్లాపై ఎల్ నినో ప్రభావం తీవ్రస్థాయిలో ప్రభావం చూపిందని సంబంధిత అధికారులు తెలుపుతున్నారు.

గతేడాదితో పోల్చితే ఈ ఏడాది వరి సాగు గణనీయంగా తగ్గిందని, ఇప్పటి వరకు కేవలం 30 శాతం విస్తీర్ణంలోనే నాట్లు వేశారని అధికారిక గణాంకాలు స్పష్టం చేశాయి. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు పంట నష్ట పోకుండా ఉండేందుకు ప్రభుత్వం ముందస్తుగా ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. వరి మాత్రమే పండే ప్రాంతాల్లో రైతులు సాధారణ వరి రకాలు కాకుండా తక్కువ సమయంలో పంట వచ్చే వరి రకాలను సాగు చేయాలని సూచించింది. చెరువులు, బావులు, బోర్ల కింద పంటలు పండించే రైతులు తప్పని సరిగా పంట మార్పిడి విధానాన్ని పాటించాలని అధికారులు తెలుపుతున్నారు.

సోషల్ మీడియా వేదికగా వ్యవస్థీకృత దుష్ప్రచారానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హోం మంత్రి అనిత పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
అటవీ శాఖ
వేలం ప్రకటన

సంఖ్య: 712/2022-ఫి1, తేది: 01.07.2026

శాఖీయంగా సేకరించబడిన టేకు-450 ఘ.మీ., మారుజాతి-237 ఘ.మీ అటవీ ఫలసాయము ఉన్నది ఉన్నట్లుగా ప్రభుత్వకలప డిపో, రాజమహేంద్రవరం డిపోలో తేది: 21.07.2026, 22.08.2026, 21.09.2026 తేదీలలో హాజరైన పాటదారుల సమక్షములో జిల్లా అటవీశాఖాధికారిచే గాని లేదా వారి అనుమతి పొందిన మరే ఇతర అధికారిచే గాని బహిరంగంగా వేలం వేయబడును. ఇతర వివరాలను ఈ కార్యాలయములో పొందగలరు.

సం/-. జిల్లా అటవీశాఖాధికారి, తూర్పుగోదావరి డివిజను, రాజమహేంద్రవరం.

DIPR.NO. 20843/CL/ADVT/1/1/2022-23 తేది: 07.07.2026


## పొగాకు వేలం కేంద్రాల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

- వర్జీనియా పొగాకు కొనుగోలుపై మంత్రి అచ్చెన్నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష



**సచివాలయం, జులై 7 ప్రభాతవార్త:** వర్జీనియా పొగాకు కొనుగోళ్ళ ప్రక్రియ, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించే చర్యలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు మంగళవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సామాజిక సంక్షేమ, విద్యుత్, రెవెన్యూ శాఖల మంత్రులతో పాటు టుబాకో బోర్డు చైర్మన్, టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పాల్గొన్నారు. రాష్ట్రంలోని అన్ని ఆక్షన్ ప్లాట్‌ఫారమ్‌ల పరిస్థితి, కొనుగోళ్ళ పురోగతి, రైతుల ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రి సమగ్రంగా చర్చించారు. ఈనెల 9న టుబాకో బోర్డు కేంద్ర సంయుక్త కార్యదర్శి ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్న నేపథ్యంలో రైతులు, పొగాకు కొనుగోలు సంస్థల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా అధిక రిజెక్షన్ నమోదవుతున్న ఆక్షన్ ప్లాట్ ఫార్మ్‌లపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను గుర్తించి వేంటనే పరిష్కరించాలని సూచించారు. పొగాకు వేలం కేంద్రాలను సంబంధిత సహచర మంత్రులు స్వయంగా సందర్శించి రైతులతో మాట్లాడాలని, కంపెనీల సిండికేట్ వ్యవహారాలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. ఆక్షన్‌లలో పాల్గొన కుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న కంపెనీలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని టుబాకో బోర్డు అధికారులను మంత్రి ఆదేశించారు. రైతుల శ్రమకు తగిన ప్రతిఫలం అందేలా, వర్జీనియా పొగాకుకు న్యాయమైన ధరలు లభించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టంచేశారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.విశ్వశ్రీ, చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ పక్కా గృహాలు

- రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి

**సచివాలయం, జులై 7 ప్రభాతవార్త:** రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ పక్కా గృహాలు అందించే లక్ష్యంతో ఈ ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి స్పష్టంచేశారు. పేదలకు పక్కా గృహాలు అందించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా అవసరమైన బడ్జెట్ కేటాయింపులు చేయడంతోపాటు కేంద్రం నుంచి అధిక నిధులు సాధించి వారి సొంత ఇంటి కల నిజం చేయడానికి శాయశక్తులా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సచివాలయంలో మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ 2014-19మధ్య మొత్తం 13,04,516ఇళ్లు మంజూరు చేస్తే రూ.10,194కోట్లు ఖర్చుచేసి 8,04,853ఇళ్లు పూర్తిచేసి లబ్ధిదారులకు అందించిన ఘనత మన ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. అందరికీ ఇళ్లు అందించాలన్న ఏకైక లక్ష్యంతో ఆనాడు రూ.10 వేల కోట్లకు పైగా నిధులు ఖర్చుచేశారని గుర్తుచేశారు. అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీ, బిసిలు ఇళ్ళ నిర్మాణంలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.712.83 కోట్లు అదనపు ఆర్థిక సాయం అందించారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఇంటికి రూ.50వేల చొప్పున ఆదివాసీ గిరిజనులకు ఇంటికి రూ.75వేల చొప్పున అందించి వారికి చేయూత నివ్వడం జరిగిందని మంత్రి పార్థసారధి పేర్కొన్నారు.

స్వర్ణ గ్రామం, వార్డుల్లో పనిచేసే 370మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ప్రభుత్వ గృహ నిర్మాణ శాఖకు కేటాయించడంతో గృహ నిర్మాణాలు మరింత వేగవంతం అవుతాయని మంత్రి హర్షం వ్యక్తంచేశారు. సిబ్బంది కేటాయింపుపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. వివిధ కార్పొరేషన్లలో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు ను 60 నుంచి 62కు పెంచడంతో గృహ నిర్మాణంలో నైపుణ్యం, విశేష అనుభవం ఉన్న దాదాపు 348మంది విధుల్లో కొనసాగే అవకాశం ఉందని వారి పర్యవేక్షణలో ఇళ్ళ నిర్మాణం మరింత వేగవంతం అవుతాయన్నారు. పోలవరం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని గృహ నిర్మాణ శాఖ చేపడుతుందని మంత్రి పార్థసారధి తెలిపారు. ఇప్పటికే బుట్టాయిగూడెం, తాడువాయి తదితర ప్రాంతాలో వేగంగా గృహ నిర్మాణాలు చేస్తున్నామన్నారు. పునరావసంలో భాగంగా పోలవరం పూర్తయ్యే లోపు నిర్వాసితులు అందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని మంత్రి పార్థసారధి స్పష్టంచేశారు.




కెనరా బ్యాంక్ Canara Bank

ప్రాంతీయ కార్యాలయం : భీమవరం
2వ అంతస్తు, జె.పి. రోడ్డు, చిన్నమీరాం, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా-534204.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు

టు:
1) శ్రీ నదిల్ల నాగార్జున, తండ్రి: విజయుడు, డి నెం.11-5-18, శేషయ్య మెట్ట, ఆర్యాపురం, రాజమండ్రి, తూర్పు గోదావరి, ఆంధ్రప్రదేశ్-533101. మరొక చిరునామా: డి నెం. 8-19-5/18, పుల్లితోటవారి వీధి, రాజమండ్రి, తూర్పు గోదావరి, ఆంధ్ర ప్రదేశ్-533101.
2) శ్రీ నదిల్ల విజయుడు, తండ్రి: అర్జునుడు, డి నెం.11-5-18, శేషయ్య మెట్ట, ఆర్యాపురం, రాజమండ్రి, తూర్పు గోదావరి, ఆంధ్రప్రదేశ్-533101.

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.

మా కెనరా బ్యాంక్, రాజమండ్రి దేవీచౌక్ బ్రాంచ్ నుండి శ్రీ నదిల్ల నాగార్జున, తండ్రి: విజయుడు వారు పొందిన ఋణసౌకర్యాల వివరములు:

| లోన్ స్వభావం & లోన్ అకౌంట్ నెం. | లోన్ మొత్తం మరియు లోన్ తేది | ప్రస్తుత తేది నాటికి బకాయి మొత్తం వడ్డీతో | వడ్డీ రేటు |
|---|---|---|---|
| Housing loan A/c No. 36379830000083 | 17-09-2016 తేదీన రూ.8,00,000/- | రూ. 1,20,717.47/- | 11.50% ప్రస్తుతం |

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు / ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ సదరు ఋణాన్ని 29-06-2026 తేదీన నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ) గా వర్గీకరించింది. అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసిన బకాయి తేది నాటికి రూ.1,20,717.47 (అక్షరాల ఒక లక్ష ఇరవై వేల ఏడు వందల పదిహేడు రూపాయల నలభై ఏడు పైసలు మాత్రమే) + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఇందుమూలముగా ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కును మేము వినియోగించుకుంటాము. ఇంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధింపబడుచున్నారు. సదరు చట్టం మరియు/ లేదా అమలులో ఉన్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కుకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.

SARFAESI చట్టం సందలి సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోనటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది.

మా బ్రాంచ్ రికార్డులో అందుబాటులో ఉన్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిస్టర్డ్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసు పంపించడం జరిగింది.

తనఖా / తాకట్టు వుంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి

[CERSAI ID: 400013652302]: రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, ఉల్లితోట వీధి, పాత డోర్ నెం.5-11/A మరియు T.S. నెం.289/P. ప్రస్తుత డోర్ నెం. 8-19-5/1, 8-19-5/2 మరియు కొత్త డోర్ నెం.7-2-5, 7-2-6 నందు మొత్తం విస్తీర్ణం 940 చ॥గ॥ల స్థలంలోని దక్షిణమున కె. భగవాన్‌కు కేటాయించిన 40 చ॥గ॥లు మరియు ఏనుగుగుమ్మల వీధి వైపు వెళ్లే ఉమ్మడి దారికి సంబంధించిన 47 చ॥గ॥లు మినహాయించగా మిగిలిన విస్తీర్ణం 852.97 చ॥గ॥లులోని అవిభాజ్యమైన మరియు నిర్దిష్టపరచని విస్తీర్ణం 35.54 చ॥గ॥లులోని ఖాళీ స్థలం కలదు. హద్దులు: సబ్ ఐటమ్ నెం.1: తూర్పు: క్రింద పేర్కొన్న 2వ ఐటమ్‌లోని కొంత భాగం, కంద్రేగులవారి ఆస్తి మరియు ఇతరుల ఆస్తి - 72.0 అ॥లు, దక్షిణం: క్రింద పేర్కొన్న 3వ ఐటమ్‌లోని కొంత భాగం, కోర్లేపల్లి భగవాన్‌కు కేటాయించిన స్థలం మరియు ఏనుగుగుమ్మల వీధి వైపు వెళ్లే ఉమ్మడి దారి - 61.0 అ॥లు, పడమర: క్రింద పేర్కొన్న 2వ ఐటమ్‌లోని కొంత భాగం, జీడిపిక్కల సుబ్బయ్య గారి ఆస్తి, ఇతరుల ఆస్తి మరియు స్థలం యజమానులకు చెందిన ఉమ్మడి దారి - 70.6 అ॥లు, ఉత్తరం: విక్రమ్ కోటారి గారి ఆస్తి మరియు డోర్ నెం. 8-19-5 యొక్క ఆస్తి, ఇతరుల ఆస్తి మరియు క్రింద పేర్కొన్న 5వ ఐటమ్‌లోని కొంత భాగం - 61.0 అ॥లు. విస్తీర్ణం 482.91 చ॥గ॥లు లేదా 403.76 చ॥మీ॥లులోని ఆస్తి. సబ్ ఐటమ్ నెం.2: తూర్పు: పైన పేర్కొన్న 1వ ఐటమ్ ఆస్తి - 30.9 అ॥లు, దక్షిణం: కోర్లేపల్లి ప్రజలు యొక్క ఆస్తి మరియు ఇతరుల ఆస్తి - 13.0 అ॥లు, పడమర: జీడిపిక్కల సుబ్బయ్య మరియు ఇతరుల ఆస్తి మరియు స్థలం యజమానులకు చెందిన ఉమ్మడి దారి - 30.9 అ॥లు, ఉత్తరం: విక్రమ్ కోటారి గారి ఆస్తి, డోర్ నెం.8-19-5 యొక్క ఆస్తి మరియు ఇతరుల ఆస్తిలోని కొంత భాగం - 13.0 అ॥లు. విస్తీర్ణం 44.41 చ॥గ॥లు లేదా 37.13 చ॥మీ॥లులోని ఆస్తి. సబ్ ఐటమ్ నెం.3: తూర్పు: శ్రీ కోర్లేపల్లి భగవాన్ గారికి కేటాయించిన ఆస్తి - 9.9 అ॥లు, దక్షిణం: కోర్లేపల్లి ప్రజలు మరియు ఇతరుల ఆస్తి - 10.3 అ॥లు, పడమర: జీడిపిక్కల సుబ్బయ్య మరియు ఇతరుల ఆస్తి మరియు స్థలం యజమానులకు చెందిన ఉమ్మడి దారి - 9.9 అ॥లు, ఉత్తరం: పైన పేర్కొన్న 1వ ఐటమ్ - 10.3 అ॥లు. విస్తీర్ణం 11.10 చ॥గ॥లు లేదా 9.28 చ॥మీ॥లులోని ఆస్తి. సబ్ ఐటమ్ నెం.4: తూర్పు: కంద్రేగులవారి ఆస్తి మరియు ఇతరుల ఆస్తి - 60.0 అ॥లు, దక్షిణం: కోర్లెపల్లి వారి ఆస్తి మరియు ఇతరుల ఆస్తి - 32.3 అ॥లు, పడమర: పైన పేర్కొన్న 1వ ఐటమ్ ఆస్తి - 60.0 అ॥లు, ఉత్తరం: క్రింద పేర్కొన్న 5వ ఐటమ్ ఆస్తి - 32.3 అ॥లు. విస్తీర్ణం 215.0 చ॥గ॥లు లేదా 179.76 చ॥మీ॥లులోని ఆసి. సబ్ ఐటమ్ నెం.5: తూర్పు: కంద్రేగుల వారి ఆస్తి మరియు ఇతరుల ఆస్తి - 16.0 అ॥లు, దక్షిణం: 1వ ఐటమ్‌లోని కొంత భాగం మరియు 4వ ఐటమ్‌లోని కొంత భాగం - 56.0 అ॥లు, పడమర: విక్రమ్ కోటారి గారి ఆస్తి, డి నెం.8-19-5 యొక్క ఆస్తి మరియు ఇతరుల ఆస్తిలోని కొంత భాగం - 16.0 అ॥లు, ఉత్తరం: విక్రమ్ కోటారి ఆస్తి, డి నెం.8-19-5 యొక్క ఆస్తి మరియు ఇతరుల ఆస్తిలోని కొంత భాగం - 56.0 అ॥లు. విస్తీర్ణం 99.55 చ॥గ॥లు లేదా 83.23 చ॥మీ॥లులోని ఆస్తి. ఈ హద్దుల యందు మొత్తం విస్తీర్ణం 852.97 చ॥గ॥లు లేదా 713.16 చ॥మీ॥లులోని పైన పేర్కొన్న ఐదు సబ్-ఐటమ్స్ అవిభాజ్యమైన, అసమాన & నిర్దిష్టపరచని ఉమ్మడి వాటా స్థలం 35.54 చ॥గ॥లు లేదా 29.71 చ॥మీ॥లు అన్ని ఈజిమెంటరీ హక్కులతో.

ఐటమ్ నెం.II: పైన పేర్కొన్న విస్తీర్ణం 852.97 చ॥గ॥ల స్థలంలో నిర్మించబడిన శ్రీ వేణు గోపాల్ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లోని (స్టిల్ట్ + మొదటి + రెండవ + మూడవ) గ్రౌండ్ ఫ్లోర్‌లో డోర్ నెం. 8-19-5/2 తో నెం. జి-1 విస్తీర్ణం 800 చ॥అ॥ల రెసిడెన్షియల్ ఫ్లాట్. ఇందులో అవిభాజ్యమైన, నిర్దిష్టపరచని ఉమ్మడి వాటా 35.54 చ॥గ॥లు కలదు. హద్దులు: తూర్పు: ఓపెన్ టు స్కై, దక్షిణం: ఈ ఫ్లాట్‌కు మరియు ఫ్లాట్ నెం.కు మధ్య ఉన్న ఉమ్మడి గోడ, పడమర: కారిడార్, ఉత్తరం: కారిడార్. కామన్ ఏరియాలు, బాల్కనీలు, కార్ పార్కింగ్ మొదలైన వాటితో సహా. టైటిల్ హోల్డర్ : శ్రీ నదిల్ల నాగార్జున

తేది: 03.07.2026, ప్రదేశం: భీమవరం సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

వార్త

చెడు మంత్రి వల్ల రాజు, చెడు సహవాసం వల్ల మంచి అలవాట్లు, చరిత్రహీనత వల్ల సంపదలు నాశనమవుతాయి.

- ఇబ్బన్

# దుష్కృత్యానికి చెంపదెబ్బ!

దేశం యావత్తును తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిన అహ్మదాబాద్ బాంబు పేలుళ్ల కేసులో కింది కోర్టు తీర్పును గుజరాత్ హైకోర్టు ఖాయం చేసింది. 38 మందికి ఉరిశిక్ష, 11 మందికి జీవితఖైదును ఖాయపరుస్తూ తీర్పు చెప్పింది. సుమారు 70 నిమిషాల వ్యవధిలో అహ్మదాబాద్ నగరాన్ని అతలాకుతలం చేసిన 21వరుస బాంబు పేలుళ్ల దుర్ఘటనలో 56 మంది ప్రాణాలు కోల్పోయారు. 46 మంది గాయపడ్డారు. భారతదేశ చరిత్రలో అత్యంత భయానక ఉగ్రదాడిగా నిలిచిపోయింది. స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా 'సిమి' మాజీ నాయకుడు సఫ్దర్ నాగోరి, మరికొందరితో ఏర్పాటు చేసిన ఇండియన్ ముజాహిదిన్ ఈ ప్రేలుడు సంఘటనలకు సూత్రధారులు. కాగా శిక్షపడిన నేరస్థులందరూ హైకోర్టులో అప్పీల్ చేసుకుని వాదించుకోవడం విశేషం. 2002 గోద్రా అనంతర అల్లర్లకు ప్రతీకారంగానే ఈ ప్రేలుళ్లకు ప్లాన్ చేసినట్లు పోలీసు దర్యాప్తులో తేలింది. కొందరు నిందితులు సమర్థించుకున్నారు కూడా. వీరిపై దేశద్రోహం, ఉగ్రవాద కార్యకలాపాలు, పేలుడు పదార్థాల చట్టం, హత్యాకావించడం వంటి నేరారోపణలపై వారం దరి మీద అహ్మద్ పోలీసులు 35 ప్రాథమిక సమాచార నివేదికలు దాఖలు చేయగా ఒకే మూస కేసులుగా విచారణ జరిగింది. మొత్తం 78 మంది నిందితులపై విచారణ జరుగగా 49 మందిని దోషులుగా నిర్ధారించింది. తగిన ఆధారాలు లేవన్న కారణంగా 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. ఒకరు అప్రూవర్‌గామారారు. దాదాపు 13ఏళ్లపాటు విచారణ అనంతరం అహ్మదాబాద్ ప్రత్యేక సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎ.ఆర్.పటేల్ ఫిబ్రవరి 8, 2022న తీర్పు వెలువరించి అదే నెల 18న శిక్షలు ఖరారు చేశారు. 38 మందికి ఉరిశిక్ష, 11 మందికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు చెప్పారు. ఒక ఉగ్రవాద కేసులో ఇంత పెద్ద సంఖ్యలో ఉరిశిక్షలు విధించడం భారత న్యాయ చరిత్రలోనే అరుదైన విషయం. 7వేలకుపైగా పేజీల తీర్పులో ప్రస్తావించిన ఎన్నో అంశాలను పరిగణనలోకి తీసుకొని శిక్షలు విధించారు. ఈ కేసులో నిందితులను సభ్యసమాజంలో తిరుగనివ్వడమంటే మానవ మాంసానికి తహతహలాడే చిరుతను వారిపైకి వదిలి పెట్టినట్లే అవుతుందని కోర్టున్యాయమూర్తి వ్యాఖ్యానించారు. భారత రాజ్యాంగం పట్ల ఏమాత్రం గౌరవభావం లేని నిందితులు ప్రజాస్వామ్యవ్యవస్థను కూల్చివేయాలనే ఉద్దేశంలోనే ఈ దురాగతానికి పాల్పడ్డారని కోర్టు అభిప్రాయానికి వచ్చింది. ఇలాంటి నేరాలను అతిసాధారణ నేరాలుగా ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని కోర్టు అభిప్రాయపడింది. దేశంలో ఉగ్రవాదాన్ని, వాటి ఛాయల్ని తుడిచిపెట్టాలన్న సంకల్పంతో, ఇతరులకు ఇలాంటి కేసుల్లో శిక్షలే భయపెట్టించాలని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. కేవలం నిందితులను శిక్షించడం ద్వారా వారిని సత్ప్రవర్తన వైపు మళ్లించాలన్నది న్యాయవ్యవస్థ ప్రధాన సిద్ధాంతం. కానీ అహ్మదాబాద్ ఘోరకలికి బాధ్యులైనవారు క్షమార్హులు కాదనే సందేశాన్ని ఈ తీర్పు స్పష్టంచేస్తోంది. వందమంది దోషులు తప్పించుకున్నా పర్వాలేదు, కానీ ఒక్క నిర్దోషికి కూడా శిక్ష పడకూడదన్న' న్యాయ సిద్ధాంతం నేపథ్యంలోనే ఈ అంశంపై దోషులను గుర్తించి సిద్ధపడడానికి బాగా సమయం తీసుకోవాల్సి వచ్చింది. సంఘటనకు బాధ్యులుగా భావించి గుర్తించిన నిందితుల్లో 28 మంది నిందితులను కోర్టు నిదానంగా ఒక్కొక్కరి పాత్రను సమీక్షించింది. ఉగ్రవాదం వంటి అత్యంత హీనమైన కేసుల్లో కేవలం సందేహాల కారణంగా శిక్ష విధించరాదని కోర్టు అభిప్రాయపడుతూనే బలమైన సాక్ష్యాధారాలుఉన్నవారినే నిందితులుగా నిర్ధారించింది. సుదీర్ఘకాలం సాగిన దర్యాప్తులో కేసులో ప్రధాన సాక్ష్యాల గుర్తింపు, పేలుడు పదార్థాలు, ఆయుధాల స్వాధీనం వంటి అంశాల్లో దర్యాప్తులో కొన్ని లోపాలున్నాయని ప్రతివాద న్యాయవాదులు ఈ కేసును నీరుగార్చేందుకు ప్రయత్నించారు. అయినా నిజమైన నిందితులను గుర్తించడంలో కిందికోర్టు బాగా ప్రయాసపడినట్లే! సాక్ష్యాల సమగ్ర పరిశీలన అనంతరమే నిందితుల పాత్రను నిర్ధారించుకున్న తర్వాతనే వారిపై అభియోగాల ఖరారు, పాత్ర, శిక్షార్హతపై పలు చర్చలు కూడా నడిచాయి. ప్రత్యేక కోర్టులు ఉరిశిక్ష విధిస్తే న్యాయప్రక్రియలో హైకోర్టు శిక్షలు ధృవీకరించాల్సి ఉంటుంది. అదే ఇప్పుడు జరిగింది. దీనికి మరో మజిలీ సుప్రీంకోర్టు. ఏ నిరపరాధి శిక్షించబడకూడదు. ఏ అపరాధీ తప్పించబడకూడదనే న్యాయసూత్రంతో న్యాయప్రక్రియమిళితమై ఉంది. దుస్సంఘటన, దురాగతం ఏ స్థాయిలో ఉన్నా, ఎవరు నిందితులెవరైనా ఏదో ఒకనాడు శిక్షలను అనుభవించాల్సిందే. ఉగ్రవాదంపై రాజీ ఉండబోదన్న సంకల్పానికి ప్రతీకగా గుజరాత్ అహ్మదాబాద్ ప్రేలుళ్ల సంఘటన విచారణ చట్టబద్ధంగా సాగింది. సాక్ష్యాధారాల సేకరణ, నిందితుల హక్కుల పరిరక్షణ కూడా ఈ కేసులో ప్రధానంగా పాటించారు. ఇలాంటి ఉదంతాలు జరగకుండా నిఘా వ్యవస్థ మరింత పటిష్టంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని కూడా ఈ సంఘటన గుర్తు చేస్తోంది. ఆనాటి దుర్ఘటనకు బలైన కుటుంబాలకు హైకోర్టు పరిహారాలను ప్రకటించడం మానవతా దృక్పథంతో కూడినదే. విచారణ కాలంలో 9 మంది న్యాయమూర్తుల ముందు 1163 మంది సాక్షులను విచారించగా చివరకు ప్రత్యేక కోర్టు తీర్పును గుజరాత్ హైకోర్టు ఆ శిక్షలను సమర్థించడం ఆహ్వానించదగినది. ఆనాటి ఘటనలు ఎంతో అమానుష కృత్యంగా భావించి యావత్తుభారతదేశం తల్లడిల్లిపోయింది. జస్టిస్ అల్పేష్ కోగే, జస్టిస్ సమీర్ జె దవే కూడిన అహ్మదాబాద్ డివిజన్ బెంచి స్పెషల్ కోర్టు తీర్పును కూలంకషంగా పరిశీలించింది. దుష్కృత్యాలు ఏ రూపంలో జరిగినా వాటి వెనుక ఉన్న ముష్కరులకు శిక్షలు తప్పవని నేటి తీర్పు తేటతెల్లం చేస్తోంది.



కష్టాల్లో ఉన్నాననీ, తాను హీనుడనీ, ఏమీ సాధించలేననీ, పగలూ రాత్రి అనుకుంటూ ఉండే మనిషి ఎందుకూ కొరగాడు.

వివేకానందుడు



మనిషి గుణాలన్నిటికీ సాహసం మొదలు, సాహసం ఇతర గుణాలకు బాధ్యత వహిస్తుంది.

చర్చిల్

# ప్రజావాక్కు



### వినియోగదారుల రక్షణ నైతిక బాధ్యత

వాట్సాప్ ప్రతిపాదించిన యూజర్‌నేమ్ ఫీచర్‌పై దేశవ్యాప్తంగా జరుగుతున్న చర్చ ఒకకీలక అంశాన్ని వెలుగులోకి తెచ్చింది. వినియోగదారుల సౌలభ్యం ఎంత ముఖ్యమో, వారి భద్రత అంతకంటే ముఖ్యమనే విషయాన్ని ఈ వివాదం గుర్తు చేస్తోంది. ఫోన్ నంబర్‌కు బదులుగా యూజర్‌నేమ్ ఆధారంగా సంభాషించే అవకాశం కల్పించడం గోప్యతకు మేలు చేసినా, అదే సమయంలో నకిలీ గుర్తింపులు, వ్యక్తుల పేర్లను అనుకరించడం, ఆర్థిక మోసాలు, సైబర్ నేరాలకుఅవకాశం కల్పిస్తుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈనేపథ్యంలో కేంద్రప్రభుత్వం భద్రతాపరమైన అంశాలపై వివరణ కోరుతూ జాగ్రత్త వైఖరిని అవలంబించడం సముచితమే. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న భారతదేశంలో సామాజిక మాధ్యమ వేదికలు కేవలం చట్టపరమైన నిబంధనలను పాటించడం మాత్రమేకాకుండా, వినియోగదారుల రక్షణను తమ నైతిక బాధ్యతగా భావించాలి. పారదర్శకత, జవాబుదారీతనం, గుర్తింపు ధ్రువీకరణ వంటి ప్రమాణాలను పాటించాలి.

- సి.హెచ్.సాయిరుత్విక్, శ్రీకాకుళం

### అందరికీ విద్యాశక్తి పథకం

కార్పొరేటివ్ ప్రైవేటు, ప్రభుత్వపాఠశాలలకు చాలా వ్యత్యాసంఉండి. ఉంటుంది, ఉండాలి కూడా. నిజమైన మానవ వికాసం ప్రభుత్వ పాఠశాలల్లోనే జరుగుతుంది. అక్కడ మాత్రమే కరికులర్ ఎగ్స్ట్రా కరికులర్ యాక్టివిటీస్ విశాలమైన పాఠశాల ప్రాంగణంలో ఆహ్లాదకరమైన గ్రామీణ వాతావరణంలో స్వేచ్ఛను ఆస్వాదించగలిగేలా విద్యా బోధన జరుగుతుంది. ఇక్కడ కోచింగ్ కంటే టీచింగ్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యాశాఖ మాత్యులు ఈనాటి కాలానికి తగినట్టుగా విద్యార్థిని విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా విద్యాబోధన జరగాలని భావిస్తూ మార్పులను ఆహ్వానిస్తూ ఒత్తిడి లేకుండా సూచిస్తూ ఉన్నారు.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### సర్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఓటరు ప్రక్షాళన జాబితాను ఓటర్ సవరణలతో పాటు చనిపోయిన వారి ఓట్లు, అనర్హత ఓట్లను తొలగించాలి .ఎన్యూమరేషన్ ఫారం పట్ల అవగాహన కల్పించాల్సిన బాధ్యత బీఎల్ఓలదే. ఫారాలు నింపాల్సిన బాధ్యత కూడా వాళ్లదే.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### రచయితలను ఆదుకోవాలి

ఒక అక్షరం వేయి గుండెలను మేలుకొలుపుతుంది. ఒకపాట ఒక నియంతను గద్దె దింపుతుంది. ఒక పుస్తకం సమాజాన్ని జాగత్రృతం చేసి దేశ ప్రగతికి అవసరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి బాటలు వేస్తుంది. పుస్తకాన్ని ఎటువంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయం లేకుండా ఎక్కడైనా ఎప్పుడైనా పాఠకుడు చదవటానికి అవకాశంఉంది. సమాజాన్ని సరైన పంథాలో పెట్టడానికి రాబోయే కాలంలో ప్రజలకు ఎదురయ్యే కష్టాలను ఏకరువు పెట్టడానికి రచయిత తన కాలాన్ని కత్తిలా ఉపయోగించి అక్షరయజ్ఞం చేస్తాడు. ప్రతిఫలాన్ని ఆశించకుండా తన విజ్ఞానాన్ని ఆర్థిక స్థోమతను వినియోగించి రచనలు చేసి ముద్రించి గ్రంథాలను విఫణవీధిలోకి తెస్తున్నాడు. కాని ఆపుస్తకాలు కొనేవారు కరవైపోయారు. ఒక్కో పుస్తకాన్ని ఆవిష్కరించాలంటే కనీసం యాభైవేల రూపాయలు ఖర్చు అవుతుంది. అమ్మకాలు లేక వంద రూపాయలకు కనీసం పదిరూపాయల సొమ్ము కూడా తిరిగి రావడం లేదు. ప్రభుత్వాలు రచయిత గ్రంథాల ముద్రణకు ఎంతో కొంత సహాయం చేయాలి.

- జాన్నభట్ల నరసింహప్రసాద్, నాగారం

### జీవన ప్రమాణాన్ని పెంచే ఉపాధిహామీ

ఉపాధి హామీ కేవలం ఒక సంక్షేమ పథకం మాత్రమేనా ప్రజల జీవన ప్రమాణాలను పెంచే శక్తి ఏమైనా ఉందా అని ఆలోచిస్తే ఇది సంక్షేమంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలను కచ్చితంగా పెంచుతుందిఅని చెప్పవచ్చు. ఉపాధి హామీ ద్వారా ఆస్తుల సృష్టితో పాటు రైతులఆస్తుల సృష్టి కూడా కచ్చితంగా చెప్పవచ్చు. ఇలాంటి పథకాలు కేవలం సంక్షేమం అనే మూస ధోరణిలో కాకుండా అత్యవసర సమయాలలో కూడా పని చేస్తుంది అని చెప్పవచ్చు. ముఖ్యంగా లాక్‌డౌన్ ఉదంతం తీసుకుంటే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉండడానికి ఈ పథకమే ముఖ్య కారణం. అందువల్ల ఉపాధి హామీ కేవలం సంక్షేమం మాత్రమే కాదు జీవన ప్రమాణ రేటును పెంచే స్కీమ్ అని నిశ్చితంగా చెప్పొచ్చు.

- భారత అవినాష్, జనగామ

### ఆర్ట్స్ కాలేజీని తరలించవద్దు

మానుకోటలో ప్రస్తుతం నడుస్తున్న రెడ్యాల ఆర్ట్స్ జూనియర్ కాలేజీని అదే ప్రాంతంలో నడపాలి. రెడ్యాల ప్రాంతానికి తరలించవద్దు. గిరిజన పిల్లలు జిల్లాకేంద్రంలో ఉండి చదువుకోవాలి. గ్రామాలకు తరలించడం వలన విద్యార్థులకు టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బందికి ఇబ్బందికరంగా ఉంటుంది.

-కదురు శ్రీనివాస్, వరంగల్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి
ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# యుద్ధాలకు దూరం వ్యూహాత్మక సంబంధాలే!

*భారత్ వ్యూహాత్మకంగా సమదూరం పాటించటమే కాకుండా చైనా లాంటి దేశాన్ని న్యూట్రల్గా కొన్నాళ్ళయినా చేయగలుగుతే పాకిస్థాన్ కవ్వింపులు, ఉగ్రవాదాల దాడులను తేలిగ్గా అధిగమించ గలదు! పాకిస్థాన్ బెలూచిస్థాన్ తలనొప్పిని ఎదుర్కొంటూనే పాక్ ఆక్రమిత కాశ్మీర్ తిరుగుబాటుతో అతలాకుతలమవుతున్నది! అందుకనే అంతర్జాతీయంగా దృష్టిమరల్చటానికి మన దేశం మీద ఏదైనా పన్నాగం పన్నే అవకాశం వుంది! మొన్నటి ఇజ్రాయిల్, ఇరాన్ యుద్ధంలో ప్రధానమంత్రి జాగ్రత్తగా వ్యవహరించి దౌత్యపరంగా మెరుగైన విధానాలతో భారత్‌కు గౌరవస్థానాన్ని, ఇతర దేశాలు మెచ్చుకొనే విధంగా కల్పించ గలగటంలో కృతకృత్యులయ్యారు! అదే విధంగా ఇప్పుడున్న అనిశ్చిత శాంతి పరిస్థితులలో తప్పటడుగులు మన దేశం వేయదనే నమ్మకం క్రమేపీ బలపడుతున్నది!.*



రావులపాటి సీతారాంరావు

విదేశాంగ వ్యవహారాలు ఎప్పుడు ఏ మలుపు తిరుగుతాయో చెప్పటం ప్రఖ్యాతిగాంచిన విదేశీవ్యవహారాల పండితులకు, విశ్లేషకులకూ సాధ్యపడదు! దానికి కారణం పరిస్థితులు దేశాల నాయకుల చేతుల్లో వుండవు! ఏ క్షణంలో ఏం జరుగుతుందో ఎవరూ ఊహించలేని పరిస్థితులల్లో దేశాల నాయకులు ఎప్పటికి ఏది ప్రస్తుతమో, ఏది అవసరమో చేసుకుంటూ పోకతప్పదు! భారతదేశానికి ఇబ్బందికరమైన పరిస్థితే వచ్చిపడింది! (ఫిబ్రవరి 25-26) అంటే అమెరికా, ఇజ్రాయిల్ కలిసి కట్టుగా ఇరాన్ మీద దాడి చేయకమునుపు (కొద్ది రోజుల తేడా ఫిబ్రవరి 28 నాడు దాడులు మొదలయ్యాయి), యాదృచ్ఛికంగా ప్రధాని మోడీ ఇజ్రాయిల్ రాజధాని టెల్ ఎవివ్‌ను సందర్శించారు! దాడుల తర్వాత ప్రధాని ఇజ్రాయిల్ పర్యటన ప్రత్యక్ష ఇబ్బందులు తెచ్చిపెట్టక పోయినా అనూహ్యంగా ఇజ్రాయిల్, ఇరాన్ దేశాల సంఘర్షణలలో ఎటు మొగ్గాలో (విధిలేని పరిస్థితులలో) అన్న నిర్ణయం తీసుకోవాల్సి వస్తుందా ఆ పరిస్థితి తప్పదా? అని మన విదేశాంగ శాఖ ఆలోచన చేయక తప్పలేదు! అదృష్టవశాత్తు భారత్ ఆ సంఘర్షణలల్లో భాగంగా మారే పరిస్థితి కలగలేదు! ప్రధాని మోడీ మౌనంగా పరిస్థితులను ఆకళింపు చేసుకొని జాగ్రత్తగా వ్యవహరించటం వల్ల ఆ గండం నుంచి ఒక విధంగా భారత్ బయటపడింది! అయితే ప్రస్తుతానికి ఇబ్బందికరమైన నిర్ణయాలు దాటవేయటం జరిగింది కానీ ముందు ముందు మరింత క్లిష్టంగా ఇజ్రాయిల్ ఇరాన్ సంబంధాలు మారితే భారత్ ఏవిధంగా వ్యవహరించాల్నో, ఆలోచన చేయాల్సిన అవసరం మాత్రం వుంది! ఇరాన్ ప్రధాని అయతుల్లా అలీ ఖొమైనీ అంతిమ సంస్కారాల కార్యక్రమానికి హాజరుకాకపోవటం దేశంలో ఎవరికీ ఆశ్చర్యాన్ని అందుకే కలిగించలేదు. భారత్ పంపిన డెలిగేషన్లో విదేశాంగ శాఖ మినిష్టర్ ఆఫ్ స్టేట్ పబిత్రా మార్గరిటా, బీహార్ గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అలా హాస్నియాన్ (రిటైర్డ్) వుండటం రాజకీయంగా ఇరాన్‌కు నమ్మకం కలిగించటంతో పాటు భారత్ విధానం కూడా చెప్పకనే చెప్పినట్లయింది! ఇరాన్‌తో ఇజ్రాయిల్ సంఘర్షణలు ఈ మధ్య యుద్ధ స్థాయికి రాకమునుపు, ఇండియా ఇజ్రాయిల్ స్నేహ సంబంధాలు బాగానే వుండేవి! ఇరాన్, అమెరికా, ఇజ్రాయిల్ దేశాల మధ్య ఏర్పడిన పరిస్థితుల దృష్ట్యా ఇజ్రాయిల్ తోనూ ఇరాన్ తోనూ సంబంధాలు చాలా దగ్గరగానూ చాలా దూరంగాను వుండకుండా న్యూట్రల్గా వుండే విధంగా విదేశాంగ విధాన అమలులో చిన్నపాటి మార్పులు చేసుకోక తప్పలేదు! నిజానికి ఇజ్రాయిల్ దేశం మిలటరీ టెక్నాలజీ, ఇంటలిజెన్స్ ఎక్స్పర్టైజ్ ఇండియాకు అందజేసినట్లు, అంతేగాకుండా కౌంటర్ ఇన్‌సర్జెన్సీ, సాంకేతిక నైపుణ్యాన్ని మన దేశ నిపుణులకు తర్ఫీదు లాంటిది ఇచ్చినట్లు మీడియా వార్తలు వున్నాయి! ఈ సంఘర్షణల నేపథ్యంలో అలాంటివి సంబంధాలు బహిర్గతపర్చటం, ఇండియాకు మంచిది కాదు. సమదూరం పాటిస్తున్న వైఖరిని ప్రదర్శించటమే విదేశాంగ విధానంలో అవలంబించాల్సిన పద్ధతి! ఒక విధంగా ఇజ్రాయిల్‌ను కొంచెం దూరంగా పెట్టటం నష్టమైనా తప్పని పరిస్థితి! ఆర్థిక ప్రగతి ఈ యుద్ధాల వల్ల ముఖ్యంగా చమురు దిగుమతుల విషయంలో ఇతర దేశాలలోనే కాదు మన దేశంలో కూడా కుంటుపడిన విషయం అందరికీ తెలిసినదే! మన దేశంతో ఇరాన్‌కు వున్న సంబంధాలు ప్రాచీన నాగరికతకు సంబంధించినవి! ఈ రెండు దేశాలకే ఆ పేరు వుంది. ఈమధ్యకాలంలో దక్షిణ ఆసియా రాజకీయాలలో భారతదేశం ఆచితూచి అడుగు వేస్తుంది



కాబట్టి ఇరాన్‌కు మరింత దగ్గరగా వుండలేక పోయిన వాస్తవాన్ని దాయాల్సిన పనిలేదు! అంతమాత్రాన ఇరాన్‌తో అనేక కారణాల వల్ల అంటీముట్టనట్లుగా వుండాల్సిన అగత్యమూ లేదు! ముఖ్యంగా జలసంధి (హార్ముజ్)లో మన చమురు నౌకల రాకపోకలన్నీ సుహృద్భావ వాతావరణంలో బలపడినవే! అందువల్లే చమురు కొరత సంభవించినా మన దేశం ఆ విషయంలో చాలా తక్కువగానే నష్టపడింది! ఇతర దేశాలతో పోల్చుకోవటం అనవసరం. ఎంతగా పాకిస్థాన్‌మధ్యవర్తిత్వం నెరిపి ఇరాన్ తనకు అత్యంత సన్నిహిత దేశంగా బయటి ప్రపంచానికి తెలియజేసేందుకు ఆదుర్దా పడుతున్నా ఇరాన్, ఇండియా సంబంధాలకు పాకిస్థాన్ అడ్డుతగలలేక పోయింది! ఇండియా స్నేహ సంబంధాలను పాకిస్థాన్ వల్ల ఇరాన్ వొదులుకునే పరిస్థితి లేదు! ఎంతవరకు నిజమో కానీ భారత్‌లో ఇరాన్‌లో వున్న షియా మతస్థుల సంబంధాల నేపథ్యంలో శతృత్వం లేనిమాట నిజం! ప్రతిక్షణం పరిస్థితులు మారేది ప్రపంచ దేశాల మిత్రత్వం వల్లనో శతృత్వం వల్లనో అన్న సత్యం చరిత్ర ప్రతిసారీ జ్ఞాపకం చేస్తూనే వుంటుంది! ఇజ్రాయిల్‌తో అమెరికా సంబంధాలలో తేడాలు వుండకపోవటం వల్లే, ఇరు దేశాల నాయకులు ఇరాన్ దేశాన్ని ఒక పట్టుపట్టాలని చూసారు. సంఘటితంగానే అప్రకటిత యుద్ధం ఘర్షణల రూపంలో మొదలుపెట్టారు! నిజానికి అమెరికా పాలసీ ఈ విషయంలో మారుతుందని ఎవరూ ఊహించలేదు! యుద్ధం మధ్యలో వాషింగ్టను టెల్ ఎవివ్‌కు పొరపొచ్చాలు లెబనాన్ విషయంలో, డోనాల్డ్ ట్రంప్ ఇంటా బయటా యుద్ధం విషయంలో ఎదుర్కొన్న విమర్శల వల్లనో, ఇరాన్ అప్రతిహతంగా ప్రతిఘటించటం వల్లనో ఇప్పుడు సంబంధాలు బెడిసికొట్టాయి! ట్రంప్ ఇరాన్‌ను తేలిగ్గా తీసుకొని, ఇజ్రాయిల్ పి.యం మాటలు నమ్మి అకారణంగా ఇరాన్‌తో వైరాన్ని తెచ్చుకొని, మింగలేని, కక్కలేని పరిస్థితులు ఎదుర్కోవటంతో నెతన్యాహూ (ఇజ్రాయిల్ ప్రైమ్ మినిష్టర్)ను బాహాటంగానే విమర్శించసాగాడు. చివరకు అనేక దేశాల ఆర్థికనష్టాలు హార్ముజ్ జలసంధిపై విధించిన నిబంధనల వల్ల పెరిగిపోయి చమురు, ఇతరఉత్పత్తుల కరవుతో పెక్కుదేశాల్లో యు.యస్.ఏ ఆధిపత్యం బలహీనపడింది! ఇలాంటి పరిస్థితులలో భారత్‌కు వేరే దారిలేదు! కేవలం దౌత్యపరంగా, వ్యూహాలను మార్చుకుంటూ సమన్వయంతో కాలగమనాన్ని వీక్షించటం తప్ప! ఇండియా ఒక విధంగా మెరుగైన స్థితిలో వుండటానికి కారణం అరబ్‌గల్ఫ్ దేశాలకు వెళ్ళినవారు అక్కడ సంపాదించిన డబ్బును మన దేశానికి పంపటం వల్ల సంబంధాలు రోజురోజుకూ ఈ యుద్ధపు నీడలు పడేంతవరకూ చాలా బాగా వుండేవి! ఒక్క సౌదీ అరేబియా మాత్రం పాకిస్థాన్‌తో ఈ మధ్య దగ్గరవుతున్న మాటనిజం! అయినా యునైటెడ్ అరబ్ ఇమరేట్స్‌తో మన దేశ సంబంధాలు ఇంకా దృఢంగానే వున్నాయి! ఇప్పుడు భారత్, యూరప్ దేశాలతో పాటు చైనా, జపాన్లతో దగ్గర కాకతప్పదు! చైనాతో ఈమధ్య ఆర్థిక సంబంధాలు పవర్ గ్రిడ్ డీల్స్‌తో పాటు ఎగుమతి దిగుమతులవాణిజ్యం మెరుగుపర్చుకుంటున్నట్లు మీడియాలో వార్తలువస్తున్నాయి. ప్రధాని జపాన్, ఫ్రాన్స్, స్కాండనేవియన్ దేశాలతో సంబంధాలు మరింతగా పెంచుకొనే దిశలో వున్నట్లు వార్తలు వస్తున్నాయి! అమెరికాను మన దేశం అన్నివేళలా నమ్మే పరిస్థితి చాలా తక్కువ. రష్యా, ఉక్రెయిన్ సమస్యతో తీరికలేకుండా వున్నది. పాకిస్థాన్ మాత్రం రష్యా, అమెరికా మాదిరి దగ్గరకు తీసే పరిస్థితి లేదు. రష్యా ఎప్పటికీ భారత్ స్నేహాన్ని వదులుకోదు! ఇరాన్, ఇజ్రాయిల్ దేశాల్లో ఎవరికి దగ్గర కావాలన్నది భారత్ ఆలోచించే ప్రసక్తే లేదు!భారత్ వ్యూహాత్మకంగా సమదూరం పాటించటమే కాకుండా చైనా లాంటిదేశాన్ని న్యూట్రల్గా కొన్నాళ్ళయినా చేయగలుగుతే పాకిస్థాన్ కవ్వింపులు, ఉగ్రవాదాల దాడులను తేలిగ్గా అధిగమించ గలదు! పాకిస్థాన్ బెలూచిస్థాన్ తలనొప్పిని ఎదుర్కొంటూనే పాక్ ఆక్రమిత కాశ్మీర్ తిరుగుబాటుతో అతలాకుతలమవుతున్నది! అందుకనే అంతర్జాతీయంగా దృష్టిమరల్చటానికి మన దేశం మీద ఏదైనా పన్నాగం పన్నే అవకాశం వుంది! మొన్నటి ఇజ్రాయిల్, ఇరాన్ యుద్ధంలో ప్రధానమంత్రి జాగ్రత్తగా వ్యవహరించి దౌత్యపరంగా మెరుగైన విధానాలతో భారత్‌కు గౌరవస్థానాన్ని, ఇతర దేశాలు మెచ్చుకొనే విధంగా కల్పించ గలగటంలో కృతకృత్యులయ్యారు! అదే విధంగా ఇప్పుడున్న అనిశ్చిత శాంతి పరిస్థితులలో తప్పటడుగులు మన దేశం వేయదనే నమ్మకం క్రమేపీ బలపడుతున్నది!. ●

# డిజిటల్ మౌలిక వసతుల భద్రతకు జాతీయ కార్యాచరణ


సి.హెచ్.ప్రతాప్

భారత్ వేగంగా డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందుతోంది. బ్యాంకింగ్, విద్యుత్ పంపిణీ, రైల్వేలు, విమానయానం, ఆరోగ్య సేవలు, ప్రభుత్వ పరిపాలన, డిజిటల్ చెల్లింపులు, ఇ-వాణిజ్యం వంటి రంగాలు సమాచార సాంకేతికతపై అధికంగా ఆధారపడుతున్నాయి. ఈ మార్పు ప్రజలకు సౌలభ్యం, పారదర్శకత, వేగవంతమైన సేవలను అందిస్తున్నప్పటికీ, సైబర్ ముప్పులు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయి. అందువల్ల డిజిటల్ మౌలిక వసతుల భద్రత ఇప్పుడు కేవలం సాంకేతిక అంశం మాత్రమే కాదు, జాతీయ భద్రత, ఆర్థిక స్థిరత్వం, ప్రజా విశ్వాసంతో ముడిపడిన అత్యంత కీలక అంశంగా మారింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ గ్రిడ్‌లు, విమానాశ్రయాలు, రైల్వే నియంత్రణ వ్యవస్థలు, బ్యాంకింగ్ నెట్‌వర్క్‌లు, ఆరోగ్య సమాచార వ్యవస్థలపై సైబర్ దాడులు పెరుగుతున్నాయి. ఇలాంటి దాడులు సేవలకు అంతరాయం కలిగించడమే కాకుండా కోట్లాది ప్రజల వ్యక్తిగత సమాచారం, ఆర్థిక లావాదేవీలు, ప్రభుత్వ సమాచారాన్ని ప్రమాదంలో పడేస్తాయి. డిజిటల్ సేవలపై ప్రజల విశ్వాసం నిలవాలంటే భద్రతా ప్రమాణాలు కాలానుగుణంగా బలోపేతం కావాలి. దేశంలోని కీలక మౌలిక వసతులకు బహుళస్థాయి సైబర్ రక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయడం అత్యవసరం. విద్యుత్ పంపిణీ కేంద్రాలు, చమురు, వాయువు నెట్‌వర్క్‌లు, రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థలు, విమానయాన నియంత్రణ కేంద్రాలు, ఆసుపత్రుల డిజిటల్ వేదికలు వంటి వ్యవస్థల్లో క్రమం తప్పకుండా భద్రతా తనిఖీలు నిర్వహించాలి. సైబర్ ముప్పులను ముందుగానే గుర్తించేందుకు నిరంతర పర్యవేక్షణ వ్యవస్థలు, అత్యవసర స్పందన కేంద్రాలు, భద్రతా ప్రమాణాల నవీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలి. సాంకేతిక లోపాలను వేగంగా గుర్తించి సరిదిద్దే విధానాలు ప్రతి సంస్థలో తప్పనిసరి కావాలి. ఈ దిశగా క్రమానుగతసైబర్ భద్రతా ఆడిట్‌లు, అత్యవసర పరిస్థితులపై మాక్‌డ్రిల్లులు, ప్రమాద మదింపు కార్యక్రమాలు నిర్వహించడం అవసరం. కీలక మౌలిక వసతులను నిర్వహించే ప్రతిసంస్థకు స్పష్టమైన సైబర్ అత్యవసర స్పందన ప్రణాళిక ఉండాలి. దాడి జరిగిన సందర్భంలో సేవలు ఎంతవేగంగా పునరుద్ధరించగలమనే సామర్థ్యాన్ని కూడా తరచూ పరీక్షించాలి. డేటా బ్యాకప్ వ్యవస్థలు, ప్రత్యామ్నాయ నియంత్రణ కేంద్రాలు, సురక్షిత క్లౌడ్ మౌలిక వసతులు కూడా ఈ వ్యూహంలో భాగం కావాలి. స్వదేశీ సైబర్ భద్రతా సాంకేతికత అభివృద్ధి కూడా కాలానుగుణ అవసరంగా మారింది. విదేశీ సాఫ్ట్‌వేర్‌పై పూర్తిగా ఆధారపడకుండా స్వదేశీ భద్రతా పరిష్కారాలు, గుప్తీకరణ విధానాలు, భద్రతా పరికరాల అభివృద్ధికి పరిశోధనను ప్రోత్సహించాలి. విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, సాంకేతిక సంస్థలు, పరిశ్రమలు కలిసి నూతన భద్రతా పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం ద్వారా దేశ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయవచ్చు. ఈదిశగా నైపుణ్యం కలిగిన సైబర్ భద్రతా నిపుణులను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు, ఉన్నత విద్యాకోర్సులు విస్తరించాల్సిన అవసరం ఉంది. కృత్రిమ మేధస్సు ఆధారిత భద్రతా వ్యవస్థలు సైబర్‌రక్షణలో కొత్త అవకాశాలను తెరుస్తున్నాయి. అసాధారణ కార్యకలాపాలను క్షణాల్లో గుర్తించడం, అనుమానాస్పద లావాదేవీలను విశ్లేషించడం, దాడుల నమూనాలను ముందుగానే అంచనా వేయడం వంటి అంశాల్లో కృత్రిమ మేధస్సు సమర్థవంతంగా ఉపయోగపడుతోంది. అదే సమయంలో సైబర్ నేరగాళ్లుకూడా ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నందున భద్రతావ్యవస్థలు నిరంతరం నవీకరించబడుతూ ఉండాలి. డిజిటల్ భద్రత ప్రభుత్వ బాధ్యతతో మాత్రమే పరిమితం కాదు. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం, సమాచార మార్పిడి, సంయుక్త భద్రతా విన్యాసాలు, అంతర్జాతీయ సహకారం, బలమైన చట్టపరమైన వ్యవస్థ మరింత బలోపేతం కావాలి. ప్రజల్లో కూడా సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించడం అత్యంత ముఖ్యం. బలమైన పాస్‌వర్డ్‌లు వినియోగించడం, అనుమానాస్పద లింకులను నివారించడం, డిజిటల్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండడం వంటి అలవాట్లు వ్యక్తిగత భద్రతకు తొలి రక్షణగా నిలుస్తాయి. సాంకేతిక పురోగతికి సమానంగా భద్రతా ప్రమాణాలను పెంపొందించినప్పుడే డిజిటల్ భారత్ మరింత విశ్వసనీయంగా, సురక్షితంగా, ప్రపంచ స్థాయిలో పోటీపడగల ఆర్థిక శక్తిగా ఎదుగుతుంది. ●

# 'వెయిటేజీ'తో ప్రమాణాలకు 'పరీక్ష'!

తిప్పర్తి శ్రీనివాస్

దేశ విద్యా వ్యవస్థలో ప్రవేశ పరీక్షల చుట్టూ చర్చ కొత్తది కాదు. అయితే ఇటీవల నీట్, జేఈఈ వంటి జాతీయ ప్రవేశ పరీక్షలకు 50 శాతం, ఇంటర్మీడియట్ లేదా బోర్డు పరీక్షల మార్కులకు 50 శాతం వెయిటేజీ ఇవ్వాలనే ప్రతిపాదన మళ్లీ విద్యా రంగంలో చర్చకు దారి తీసింది. ఇది కేవలం ప్రవేశాల విధానానికి సంబంధించిన అంశంమాత్రమే కాదు. దేశంలో పాఠశాల విద్య భవిష్యత్తు, కోచింగ్ సంస్కృతి, విద్యార్థుల మానసిక ఆరోగ్యం, సామాజిక న్యాయం, ప్రభుత్వ విద్యావ్యవస్థ వంటి అనేక అంశాలను తాకే కీలకమైన సంస్కరణ. గత పదేళ్లుగా దేశంలో ప్రవేశ పరీక్షలే విద్యార్థుల జీవితాన్ని శాసిస్తున్నాయి. వైద్య విద్య కావాలంటే నీట్, ఇంజినీరింగ్‌లో ప్రతిష్ఠాత్మక సంస్థల్లో చేరాలంటే జేఈఈ. ఈ రెండు పరీక్షల్లో వచ్చిన ర్యాంకులే విద్యార్థి భవిష్యత్తును నిర్ణయిస్తున్నాయి. ఫలితంగా పాఠశాలలు, కళాశాలల్లో జరిగే బోధన కంటే కోచింగ్ సెంటర్లే ప్రధాన విద్యా కేంద్రాలుగా మారిపోయాయి. 'చదువు' అనే పదానికి అర్థమే మారిపోయింది. పుస్తకాలను అర్థం చేసుకోవడం కాదు, ప్రశ్నలను గుర్తించడం. విజ్ఞానం కాదు, వేగం. అవగాహన కాదు, మార్కులు ఇదే నేటి పరిస్థితి. ఇంటర్మీడియేట్ చదివే విద్యార్థి కళాశాలకు వెళ్లేది హాజరుకోసంమాత్రమే. అసలు చదువు కోచింగ్ కేంద్రాల్లోనే జరుగుతోంది. కొందరు విద్యార్థులు రెండు సంవత్సరాల పాటు కుటుంబానికి దూరంగా హాస్టళ్లలో ఉంటూ రోజుకు 14 నుంచి 16 గంటల వరకు కోచింగ్ తీసుకుంటున్నారు. ఇది విద్యకాదు, యాంత్రిక శిక్షణ. విద్యార్థుల బాల్యం, సృజనాత్మకత, ఆలోచనా శక్తి, సామాజిక జీవితం అన్నీ ఈ పోటీలో కనుమరుగైపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో బోర్డు పరీక్షలకు 50 శాతం వెయిటేజీ ఇవ్వాలనే ప్రతిపాదనలో సహజంగానే ఆకర్షణ కనిపిస్తుంది. ఎందుకంటే అలా చేస్తే విద్యార్థి ఏడాది పొడవునా చదవాల్సి ఉంటుంది. తరగతి గదిలో బోధనకువిలువ పెరుగుతుంది. ఉపాధ్యాయుల పాత్ర బలపడుతుంది. పాఠశాల విద్య మళ్లీ కేంద్ర బిందువుగా మారుతుంది. కేవలం ఒక రోజు నిర్వహించే పరీక్షతోనే భవిష్యత్తు నిర్ణయమవుతుందనే అన్యాయం కొంతవరకు తగ్గుతుంది. ఒక్కరోజు పరీక్షలో అనారోగ్యం, ఒత్తిడి లేదా ఇతర కారణాల వల్ల విద్యార్థి ఆశించిన ఫలితం సాధించకపోవచ్చు. అంత మాత్రాన అతని రెండేళ్ల శ్రమను కొట్టిపారేయడం సమంజసం కాదు. బోర్డు పరీక్షల మార్కులకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల విద్యార్థి నిరంతర అధ్యయనానికి ప్రోత్సాహం లభిస్తుంది. ఇది విద్యా తత్వశాస్త్రం పరంగా కూడా సముచితమైన ఆలోచనే. అయితే ఈ ప్రతిపాదనకు మరో కోణం కూడా ఉంది. దేశంలో ఒకే విధమైన విద్యా ప్రమాణాలు లేవు. ఒక రాష్ట్ర




బోర్డులో 98 శాతం మార్కులు సాధించడం సాధారణమైతే, మరొక బోర్డులో 90శాతం కూడా సాధించడం కష్టమవుతుంది. కొన్ని బోర్డులు మార్కులను ఉదారంగా ఇస్తుంటే, మరికొన్ని కఠినంగా మూల్యాంకనం చేస్తాయి. ఈ అసమాన పరిస్థితుల్లో బోర్డు మార్కులకు 50 శాతం వెయిటేజీ ఇవ్వడం కొత్త అన్యాయాలకు తావివ్వవచ్చు. అదే విధంగా మార్కుల ద్రవ్యోల్బణం మరింత పెరిగే ప్రమాదం కూడా ఉంది. ఇప్పటికే 95 శాతానికి పైగా మార్కులు సాధించే విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతోంది. వెయిటేజీ పెరిగితే ఈ పోటీ మరింత తీవ్రరూపం దాల్చుతుంది. విద్యాప్రమాణాలు మెరుగుపడకపోయినా మార్కులు మాత్రం పెరిగే పరిస్థితి ఏర్పడే ప్రమాదాన్ని విస్మరించలేం. ఈ సందర్భంగా కోచింగ్ పరిశ్రమ గురించి కూడా మాట్లాడాల్సిందే. నేడు వేల కోట్ల రూపాయల వ్యాపారంగా మారిన కోచింగ్ రంగం దేశవిద్యా విధానాన్నే ప్రభావితం చేసే స్థాయికి చేరుకుంది. తల్లిదండ్రుల ఆర్థిక స్థోమతే కొన్నిసార్లు విద్యార్థి అవకాశాలను నిర్ణయిస్తోంది. లక్షల రూపాయలు ఖర్చు చేయగలిగిన కుటుంబాలకు మెరుగైన కోచింగ్ లభిస్తే, గ్రామీణ ప్రాంతాల్లోని సాధారణ కుటుంబాల పిల్లలు వెనుకబడుతున్నారు. ఇది రాజ్యాంగం కల్పించిన సమాన అవకాశాల స్ఫూర్తికివిరుద్ధం. బోర్డు పరీక్షలకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తే ఈ అసమానత కొంతవరకు తగ్గేఅవకాశం ఉంది. ప్రభుత్వ కళాశాలల్లో చదివే ప్రతిభావంతులైన విద్యార్థులకుకూడా అవకాశం పెరుగుతుంది. కానీ దీనికి ముందు దేశవ్యాప్తంగా బోర్డు పరీక్షల్లో ఒకే ప్రమాణాలను అమలు చేయాలి. లేకపోతే ఒక రాష్ట్ర విద్యార్థికి లభించేప్రయోజనం మరో రాష్ట్రవిద్యార్థికిఅందదు. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని కూడా ఈ చర్చలో విస్మరించరాదు. ప్రవేశ పరీక్షల ఒత్తిడి కారణంగా ప్రతి సంవత్సరం అనేక మంది విద్యార్థులు తీవ్రమైన ఆందోళన, నిరాశ, మానసిక సమస్యలను ఎదుర్కొంటున్నారు. విద్య అనేది వ్యక్తిత్వ వికాసానికి దోహదపడాలి తప్ప, జీవితాన్ని భారంగా మార్చకూడదు. దేశవ్యాప్తంగా ఒకేస్థాయి మూల్యాంకన విధానం, మార్కుల సాధారణీకరణ, పారదర్శక పరీక్షా వ్యవస్థ అమలు చేయడం అత్యవసరం. విద్యా విధానం ఎవరినీ శిక్షించే విధంగా ఉండకూడదు. ప్రతిభను వెలికితీసే విధంగా ఉండాలి. కోచింగ్ కేంద్రాల విజయాన్ని కాదు, పాఠశాల విద్య విజయాన్ని కొలిచే వ్యవస్థను నిర్మించాలి. తరగతి గదిలో బోధించే ఉపాధ్యాయుడికి విలువ లేకుండా, కోచింగ్ సెంటర్‌లో బోధించే అధ్యాపకుడే భవిష్యత్తును నిర్ణయించే పరిస్థితి కొనసాగితే ప్రభుత్వ విద్యా వ్యవస్థ క్రమంగా బలహీనపడుతుంది. నీట్, జేఈఈలకు 50 శాతం వెయిటేజీ ఇవ్వాలా వద్దా అన్నది కంటే, దేశానికి ఎలాంటి విద్యా వ్యవస్థ అవసరమన్నదే అసలు ప్రశ్న. విద్యను మార్కుల పోటీ నుంచి జ్ఞాన సాధన దిశగా మళ్లించగలిగితేనే దేశ భవిష్యత్తు బలపడుతుంది. అదే నిజమైన విద్యా సంస్కరణకు తొలి అడుగు. ●

కేరళలో కొండచరియలు విరిగిపడి ఐదుగురు మృతి

## కేరళ నుంచి కాశ్మీర్ దాకా

# పలు రాష్ట్రాల్లో వర్ష బీభత్సం

జమ్ముకాశ్మీర్‌లోని కిస్త్‌వార్ జిల్లాలో వరదలతో అతలాకుతలం

మూడురోజులుగా మహారాష్ట్రలో జనజీవనం అస్తవ్యస్తం

**ముంబయి,శ్రీనగర్,వాయనాడ్, జులై 7:** దేశంలోని ఉత్తరాది రాష్ట్రాలతోపాటు దక్షిణాది ప్రాంతాల్లో కూడా భారీ వర్షాలు వరద విలయాన్ని సృష్టిస్తున్నాయి. మహారాష్ట్ర, జమ్ముకాశ్మీర్, కేరళల్లో మూడురోజుల నుంచి కురుస్తున్న ఎడతెగని వర్షాలతో జనజీవనం అతలాకుతలం అయింది. ప్రత్యేకించి మహారాష్ట్ర రాజధాని లోతట్టుప్రాంతాలన్నీ జలమయం అయి ఇతర నగర ప్రాంతంతో సంబంధాలు తెగిపోవడంతో ద్వీపంలా మారింది. ముంబైపుణె, ముంబైఅహ్మదాబాద్, ముంబైకొంకణ్‌రహదారులు పూర్తిగా మూసుకుపోయాయి. రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇక ముంబైపుణె ఎక్స్‌ప్రెస్ వేపై కొండచరియలు విరగపడ్డాయి. దాంతో ఆ మార్గంలో ట్రాఫిక్ నిలిచిపోయింది. ముంబైపుణె ఎక్స్‌ప్రెస్ వేలో ట్రాఫిక్ అంతరాయాలను తొలగించేందుకు మిస్సింగ్ లింక్ పేరుతో 13.3 కిలోమీటర్ల బైపాస్‌ను రూ.6,695 కోట్లతో నిర్మించారు. ఇందులో రెండు సొరంగాలు (1.6 కి.మీ., 8.9 కి.మీ.) ఉన్నాయి. ఈ సొరంగ మార్గాన్ని 9 వారాల కిందట ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రారంభించారు. సొరంగం సమీపంలో కొండ చరియలు విరిగిపడ్డాయి. విపత్తు నిర్వహణ సిబ్బంది ఏకంగా 18 గంటల పాటు శ్రమించి ఈ మార్గాన్ని పునరుద్ధరించారు. రుతుపవనాల ప్రభావంతో సోమవారం పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిశాయి. గడిచిన రెండు రోజులుగా కురుస్తున్న కుండపోత వానలు, బలమైన ఈదురుగాలుల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 13 మంది మరణించగా, మరో 10 మంది గాయపడ్డారు. వందకు పైగా ఇళ్లు దెబ్బతినడంతో వందలాది మంది నిరాశ్రయులయ్యారని రాష్ట్ర విపత్తు నిర్వహణ కేంద్రం తెలిపింది. గడిచిన 48 గంటల్లో రాష్ట్రంలోని తీరప్రాంత, పశ్చిమ ప్రాంతాల్లో వర్షాల తీవ్రత అత్యధికంగా ఉంది. పర్యాటక ప్రాంతమైన లోనావాలాలో గత 48 గంటల్లో ఏకంగా 625 మిల్లీమీటర్ల రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. రాయ్‌గఢ్‌లో 236 మి.మీ., థాణేలో 161 మి.మీ., రత్నగిరిలో 152 మి.మీ., ముంబైలో 100 నుంచి 161 మి.మీ.



భారీ వర్షాలకు జమ్ముకాశ్మీర్‌లో కొండచరియలు విరిగిపడిన దృశ్యం

వరకు వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ వర్షాల ధాటికి రాష్ట్రంలోని జలాశయాలు వేగంగా నిండిపోతున్నాయి. అంబా, సావిత్రి, కుండలిక, పాతాళగంగ, ఉల్హాస్ సహా పలు నదులు ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. దీంతో బద్లాపూర్, మోహనే, జాంభూల్‌పాడ ప్రాంతాల్లో వరద హెచ్చరికలు జారీ చేశారు. వర్షాల కారణంగా పలుచోట్ల విషాద సంఘటనలు చోటుచేసుకున్నాయి. ముంబైలోని మాన్‌ఖుర్ద్ ప్రాంతంలో ఓ భవనం మురికివాడపై కూలిపోవడంతో ఆరుగురు మరణించగా, మరొకరు గాయపడ్డారు. చెట్టు కూలి ఒకరు, నీట మునిగి పాల్ఘర్, సింధుదుర్గ్‌లలో చెరొకరు ప్రాణాలు కోల్పోయారు. సతారాలో కొండచరియలు విరిగిపడటంతో ఒకరు మృతి చెందగా, నలుగురు గాయపడ్డారు. భారీ వర్షాల నేపథ్యంలో మాథేరన్, లోనావాలా, ఖోపోలి వంటి హిల్ స్టేషన్లలో కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉండటంతో రెడ్ అలర్ట్ ప్రకటించారు. సహాయక చర్యల కోసం రెండు జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్) బృందాలను మోహరించారు. తలేగావ్‌దాభాడే సమీపంలో వరద నీటిలో చిక్కుకున్న 25 మంది ప్రయాణికులతో ఉన్న బస్సును ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. రాయ్‌గఢ్ జిల్లాలో ఇంటి పైకప్పుపై చిక్కుకుపోయిన ఆరుగురు కుటుంబ సభ్యులను పడవల సాయంతో రక్షించారు. ముంబైగోవా, ముంబైపుణె ఎక్స్‌ప్రెస్‌వేలపై కొండచరియలు విరిగిపడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మహారాష్ట్రలోని ఒక భాగం ఇలా జలవిలయంతో అల్లాడుతుండగా, మరోవైపు విదర్భ ప్రాంతం మాత్రం వర్షాల కోసం ఎదురు చూస్తోంది. వార్ధా, అకోలా, అమరావతి, యవత్ మాల్, చంద్రపూర్ జిల్లాల్లో ఇప్పటివరకు వర్షాలు కురవకపోవడం గమనార్హం. ముంబై మహానగరాన్ని భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వానలతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. ముఖ్యంగా తూర్పు శివారు ప్రాంతాల్లో గత 48 గంటల్లో ఏకంగా 380 మిల్లీమీటర్ల రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. ఈ పరిణామాల నేపథ్యంలో బృహన్ ముంబైమున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం అప్రమత్తమై హై అలర్ట్ ప్రకటించింది. ముంబయి నగరంలో 300మి.మీ.,పశ్చిమ శివార్లలో 345 మి.మీ.వర్షపాతం నమోదైంది. గంటకు 70నుంచి 80 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తున్నాయి. భారత వాతావరణశాఖ జులై 4నుంచి 6వరకు గతంలో జారీ చేసిన రెడ్ అలర్ట్‌ను మంగళవారం నాటికి ఆరెంజ్ అలర్ట్‌గాసవరించింది. నగరంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేసింది. బీఎంసీ యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టింది. విపత్తు నిర్వహణ బృందాలు క్షేత్రస్థాయిలో పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తు న్నాయి. లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీటిని తొలగించేందుకు హై కెపాసిటీ పంపులను ఏర్పాటు చేశారు.

**కేరళలో టన్నెల్‌వద్ద కొండచరియలు పడి ఐదుగురు మృతి :** కేరళలోని వయనాడ్ జిల్లాలో దారుణ ప్రమాదం జరిగింది. టన్నెల్ వద్ద కొండ చరియలు విరిగిపడిన ఘటనలో ఐదుగురు మరణించారు. మట్టిదిబ్బల కింద మరికొందరు చిక్కుకున్నారు. ఈ ఘటన కేరళలోని వయనాడ్ జిల్లా, మెప్పాడి సమీపంలోని కల్లాడి వద్ద మంగళవారం జరిగింది. స్థానిక మీనాక్షి బ్రిడ్జి వద్ద ఒక టన్నెల్ కోసం తవ్వాలు, నిర్మాణం జరుగుతున్న ప్రదేశంలో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో ఆ మట్టిదిబ్బలు, రాళ్ల కింద పలువురు చిక్కుకు పోయారు. వీరిలో ముగ్గురు మరణించారు. ఘటనపై సమాచారం అందుకున్న ఫైర్, రెస్క్యూ బృందాలు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు ప్రారంభించాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ ఘటనపై కేరళ సీఎం వీడీ సతీషన్ కూడా స్పందించారు. వయనాడ్ జిల్లా అధికారులతో మాట్లాడారు. తక్షణమే సహాయక చర్యలు ప్రారంభించి బాధితుల్ని కాపాడాలని, వ్యవస్థల్ని సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. సహాయక చర్యల్ని పర్యవేక్షించాల్సిందిగా మంత్రులు ఏపీ అనిల్ కుమార్, టీ సిద్దిఖ్‌లను ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా ఇక్కడ టన్నెల్ నిర్మాణ పనుల్ని సోమవారం నుంచే నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలో గడిచిన 24 గంటల్లో 265 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

**జమ్ముకాశ్మీర్‌ను కుదిపేస్తున్న భారీ వర్షాలు వరదలు**

జమ్మూ కాశ్మీర్‌లోకూడా ఈ భారీ వర్షాలు వరద భీభత్సం సృష్టిస్తున్నాయి. దోడా జిల్లాలో భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు జనజీవనాన్ని కకావికలంచేసాయి. రోడ్లు జలమయ మయ్యాయి. థాత్రి, గండోహ్, బలేస్సా ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

కొండచరియలు విరిగిపడటం, వరద నీరు ఇళ్లల్లోకి చేరడం వల్ల రోడ్లు ధ్వంసమై సాధారణ జనజీవనం స్తంభించింది. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా ఆకస్మిక వరదలు సంభవించి వాగులు పొంగిపొర్లడంతో బండరాళ్లు, శిథిలాలు కొట్టుకుపోయి అనేక ఇళ్లు, వాహనాలు దెబ్బతిన్నాయి. వరదల కారణంగా థాత్రి వద్ద దోడాకిష్త్వార్ జాతీయ రహదారి కూడా మూసివేశారు. దీంతో ఆ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.






# టిక్‌టాక్ వల్లే గెలిచా..

అత్యధిక ఫాలోవర్లు ఉన్న వాడిని నేనే: ట్రంప్

**వాషింగ్టన్,జులై 7:** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో తన ఘనవిజయానికి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ టిక్‌టాక్ ఎంతగానో దోహదపడిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. చైనా యాజమాన్యంలోని ఈ యాప్ వల్ల జాతీయ భద్రతకు ముప్పు ఉందంటూ వాషింగ్టన్ రాజకీయ వర్గాల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నప్పటికీ, ఈ ప్లాట్‌ఫామ్‌లో తనకు ఉన్న ఆదరణే దాని ప్రభావానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. వైట్‌హౌస్‌లో సోమవారం పిల్లల కోసం ట్రంప్ అకౌంట్స్ పథకాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడిన ట్రంప్ టిక్‌టాక్‌లో అత్యధిక ఫాలోవర్లు ఉన్న ఏకైక రాజకీయ నాయకుడిని తానేనని చెప్పుకొచ్చారు. టిక్‌టాక్‌లో నేనే అందరికంటే చాలా ముందున్నాను. నిజం చెప్పాలంటే ఈ యాప్ వల్లే నేను ఎన్నికల్లో ఏకపక్షంగా ఘనవిజయం సాధించానని భావిస్తున్నానని ట్రంప్ వ్యాఖ్యానించారు. చైనా యాజమాన్యం కారణంగా ఈ యాప్ వల్ల గూఢచర్య ముప్పు పొంచి ఉందంటూ ఒక టీవీ షోలో చర్చించడాన్ని తాను చూశానని చెప్పారు. పాలసీ మేకర్లు దీనిపై ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయాన్ని ఆయన అంగీకరించారు. అయితే, ఆ వాదనను తోసిపుచ్చుతూ ఒకవేళ ఈ యాప్ అంతగా ప్రభావితం చేయగలిగితే నేను దేశాన్ని ప్రేమిస్తున్నానని, దేశం కోసం ఎన్నో పనులు చేయబోతున్నానని ఇందులో చెబుతున్నాను కదాఅని ట్రంప్ పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన ఆడియన్స్ ర్యాంకింగ్స్‌లో ప్రముఖ సెలబ్రిటీల కంటే తానే ముందున్నానని ట్రంప్ ఈ సందర్భంగా వెల్లడించారు. తాజా గణాంకాల ప్రకారం ప్రముఖ సింగర్ టేలర్ స్విఫ్ట్ 11వ స్థానంలో ఉంటే, నేనే నంబర్ వన్ స్థానంలో ఉన్నానని చెప్పారు. ఇదే సమయంలో టిక్‌టాక్ వ్యవహారంపై తాను చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో మాట్లాడినట్లు ట్రంప్ బహిర్గతం చేశారు.





## ఇండొనేసియాలో బెంగళూరు ఐఐఎం క్యాంపస్

**జకార్తా,జులై 7:** ఇండోనేసియాలో ఐఐఎం బెంగళూరు క్యాంపస్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోడీమంగళవారం వెల్లడించారు. ప్రస్తుతం మోడీఇండోనేసియాలో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఇండోనేసియా ప్రెసిడెంట్ ప్రబోవో సుబియాంటోతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. మోడీ మాట్లాడుతూ ఇరు దేశాల మధ్య ఏఐ, టెలికమ్యూనికేషన్స్, డిజిటల్ వంటి టెక్నాలజీలో యువతకు సహకారానికి ఈ రోజు ఇండోనేసియా, ఇండియా మధ్య ఒప్పందం కుదిరింది. రెండు దేశాల మధ్య స్టార్టప్‌ల సహకారాన్ని కూడా ప్రారంభించబోతున్నాం. ఇండియాలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థ ఐఐఎం బెంగళూరు క్యాంపస్‌ను ఇండియాలో ప్రారంభించబోతున్నామని అన్నారు. ఐఐఎంలకు సంబంధించి విదేశాల్లో ప్రారంభించబోతున్న రెండో క్యాంపస్ ఇది. గతంలో ఐఐఎం అహ్మదాబాద్ క్యాంపస్‌ను దుబాయ్‌లో ఏర్పాటు చేశారు. ఐఐఎంలతోపాటు ఐఐటీ క్యాంపస్‌లు కూడా కొన్ని విదేశాల్లో ఉన్నాయి. ఐఐటీ మద్రాస్ క్యాంపస్‌లు టాంజానియాలోని జాంజిబర్‌లో ఉండగా, ఐఐటీ ఢిల్లీ క్యాంపస్ అబుదాబిలో 2024లో ప్రారంభమైంది. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ ప్రకారం ఐఐఎంలలో ఐఐఎం అహ్మదాబాద్ మొదటి స్థానంలో ఉండగా, ఐఐఎం బెంగళూరు రెండో స్థానంలో ఉంది. క్యాట్ స్కోర్ ఆధారంగా ఐఐఎంలలో ప్రవేశపరీక్ష నిర్వహిస్తారు. సాధారణంగా క్యాట్ పరీక్ష నవంబర్ చివరి వారంలో జరుగుతుంది. క్యాట్ నోటిఫికేషన్ జూలైలో విడుదలై, ఆగస్టులో ముగుస్తుంది. బ్యాచిలర్ డిగ్రీ పొంది, కనీసం 50 శాతం మార్కులున్న వారు ఐఐఎంలలో ప్రవేశానికి అర్హులు. రిజర్వేషన్ కేటగిరీల వారికి 45 శాతం మార్కులు వస్తే చాలు. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ విభాగాలకు చెందిన విద్యార్థులకు ఫీజు రూ.1,300 కాగా, ఇతరులకు రూ.2,600.



టిసిఎస్ మతమార్పిడి కేసులో

## నిందితురాలు నిదాఖాన్‌కు బెయిల్

**నాసిక్,జులై 7:** టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ అనుబంధ బీపీవో యూనిట్‌లో జరిగిన మతమార్పిడి, లైంగిక వేధింపుల కేసులో ప్రధాన నిందితురాలైన నిదాఖాన్‌కు నాసిక్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అరెస్ట్ అయిన దాదాపు రెండు నెలల తర్వాత ఆమెకు ఈ చట్టపరమైన ఊరట లభించింది. నాసిక్ రోడ్ కోర్టు అదనపు సెషన్స్ జడ్జి కె.జి.జోషి ఈ ఉత్తర్వులు జారీ చేశారు. నిదా ఖాన్‌తో పాటు ఈ కేసులో సహ నిందితుడిగా ఉన్న తౌసిఫ్ అత్తార్‌కు కూడా కోర్టు బెయిల్ ఇచ్చింది. అయితే, ఇదే కేసులో ఉన్న మరో కీలక నిందితుడు డానిష్ షేక్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను మాత్రం న్యాయస్థానం తీవ్రంగా తిరస్కరించింది. టీసీఎస్ నాసిక్ బీపీవో యూనిట్‌లో టెలికాలర్‌గా పని చేసిన నిదాఖాన్, ఈ కేసు వెలుగులోకి వచ్చిన తర్వాత దాదాపు 42 రోజుల పాటు పోలీసులకు దొరకకుండా పరారయ్యారు. అనంతరం మే నెలలో ఛత్రపతి శంభాజీనగర్‌లో పోలీసులు ఆమెను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. తాను ప్రస్తుతం గర్భవతిగా ఉన్నానని, జైలులోఇబ్బందులు పడుతున్నానని పేర్కొంటూ వైద్యకారణాల రీత్యా ఆమెబెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. బాధితురాలికి నిదాఖాన్ బురఖా, ఇస్లామిక్ మతపరమైన పుస్తకాలను ఇవ్వడంతోపాటు, ఫోన్‌లో మతపరమైన యాప్స్ ఇన్‌స్టాల్‌చేసి మతమార్పిడికి ప్రేరేపించిందని, వాట్సాప్ గ్రూపులద్వారా ఒత్తిడి తెచ్చిందని పోలీసులుఆరోపించారు. చార్జ్‌షీట్ దాఖలు కావడం, ఆమె గర్భందాల్చిన విషయాన్ని పరిగణనలోకి తీసుకుని కోర్టుబెయిల్ మంజూరు చేసింది.

## ట్రస్టు అధీనంలో 30 కిలోల బంగారు ఆభరణాలు

1518 కిలోల వెండి వస్తువులు: కోశాధికారి గోవింద్‌దేవ్ గిరి వెల్లడి

**అయోధ్య,జులై 7:** శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఇవాళ కీలక ప్రకటన చేసింది. తమ ట్రస్టు ఆధీనంలో సుమారు 30 కిలోల బంగారు వస్తువులు ఉన్నట్లు తెలిపింది. సుమారు 1518 కేజీల వెండి వస్తువులు ఉన్నట్లు ఆ ట్రస్టు ట్రెజరర్ స్వామి గోవింద దేవ్ గిరి తెలిపారు. అయోధ్య రామాలయంలో విరాళాలను చోరీ చేసిన ఘటనలో 8 మంది అరెస్టు అయిన విషయం తెలిసిందే. ఆ కేసులో ఇంకా దర్యాప్తు జరుగుతున్నది. భక్తులు సమర్పించిన విరాళాలను చోరీ చేసినట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో రామజన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఇవాళ స్పందించింది. దేవాలయానికి ఇప్పటి వరకు 2926 విలువైన వస్తువులను కానుకలుగా సమర్పించారని, అవన్నీ సురక్షితంగా ఉన్నాయని, వాటికి సంబంధించిన రికార్డులను కూడా మెయిన్‌టేన్ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. బంగారంతో తయారు చేసిన రామచరితమానస్, డైమండ్ నెక్లెస్ కూడా అదృశ్యమైనట్లు వచ్చిన వార్తలను ట్రస్టు



కొట్టిపారేసింది. ఆ కానుకలను మీడియా ముందు ప్రదర్శించింది. స్వామివారికి చెందిన వెండి చరణ పాదుకలు, కాకభుషుండి కళాకృతి మిస్సైనట్లు సోషల్ మీడియాలో వ్యాపిస్తున్న వార్తలను ట్రస్టు కొట్టిపారేసింది. ఆ కానుకలను కూడా మీడియా ముందు ట్రస్టు ప్రదర్శించింది. ప్రతి వస్తువు వివరాలను ఇన్వెంటరీలో పొందుపరిచామని, ఆ వస్తువును విరాళం ఇచ్చిన దాత పేరు కూడా తమ వద్ద ఉన్నట్లు గిరి తెలిపారు. వెండి కాకభుషుండి వస్తువు ఆలయ ఆధీనంలో ఉన్నట్లు గిరి చెప్పారు. 2024 మార్చి 31వ తేదీ వరకు రామమందిరానికి సుమారు 16.765 కిలోల బంగారు వస్తువులు కానుకలుగా వచ్చినట్లు ఆయన తెలిపారు.

ఇక 2024-25లో 10.445 కిలోల బంగారం, 2025-26లో 5.050 కిలోల బంగారం కానుకల రూపంలో వచ్చిందన్నారు. 2026 మార్చి 31వ తేదీ వరకు ఆలయానికి మొత్తం 32.259 కిలోల బంగారం అందినట్లు గిరి వెల్లడించారు. వెండి వస్తువులను కరిగించిన తర్వాత ఆలయం వద్ద మొత్తం 849 కేజీల రిఫైన్డ్ సిల్వర్ ఉన్నట్లు ఆయన చెప్పారు. ఇక ఈ ఏడాది మార్చి 31 వరకు మొత్తం 1518 కిలోల వెండి ఆలయం వద్ద ఉన్నట్లు ఆయన తెలిపారు. ప్రతి ఏడాది చార్టెడ్ అకౌంట్‌తో ఆ వస్తువులను వెరిఫై చేయిస్తున్నట్లు గిరి తెలిపారు.

## ఈ25 ఇథనాల్ పెట్రోల్‌పై అపోహలు నమ్మొద్దు

ప్రచారంపై స్పష్టత ఇచ్చిన కేంద్రం

**న్యూఢిల్లీ,జులై 7:** దేశవ్యాప్తంగా 25 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ (ఈ25)ను త్వరలో ప్రవేశపెట్టనున్నట్లు వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. అటువంటి ప్రతిపాదన ఏదీ ప్రస్తుతం తమ పరిశీలనలో లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ వదంతుల నేపథ్యంలో వాహనదారుల్లో నెలకొన్న ఆందోళనలను నివృత్తి చేసే ప్రయత్నం చేసింది. ఈ25 ఇంధనాన్ని తక్షణమే అందుబాటులోకి తీసుకువస్తున్నారన్న ప్రచారంలో వాస్తవం లేదని కేంద్రం ఉద్ఘాటించింది. వివిధ వాహన మోడళ్లపై ఈ25 మిశ్రమం యొక్క అనుకూలతపై ప్రస్తుతం పరీక్షలు కొనసాగుతున్నాయని, పూర్తిస్థాయి నివేదికలు అందిన తర్వాతే దీనిపై విధానపరమైన నిర్ణయం తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అందుబాటులో ఉన్న ఈ20 (20 శాతం ఇథనాల్) పెట్రోల్ సురక్షితమైనదని, అది సమర్థవంతంగా పనిచేస్తోందని వారు తెలిపారు.

ముడి చమురు దిగుమతులు తగ్గించడం, పర్యావరణ పరిరక్షణ, మరి యు చెరకు రైతులను ఆదుకోవడం వంటి లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే నిర్ణీత గడువు కంటే ముందే భారత్ ఈ20 లక్ష్యాన్ని చేరుకుంది. ఈ20 పెట్రోల్ వాడకం వల్ల మైలేజీ తగ్గడం, పాత వాహనాల ఇంజిన్ల పనితీరు దెబ్బ తినడం వంటి ఆందోళనలు సామాజిక మాధ్యమాల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమం లోనే ఈ25 వస్తుందనే వార్తలు వాహనదారుల్లో మరింత ఆందోళన రేకెత్తించాయి. ఇటీవల ప్రభుత్వం ఈ22 నుంచి ఈ30 వరకు ఇథనాల్ మిశ్రమాలపై ఎక్సైజ్ సుంకం మినహాయింపు ఇవ్వడంతో ఈ25 త్వరలోనే వస్తుందనే ఊహాగానాలు పెరిగాయి.

ఈ20 తర్వాత ఏ నిర్ణయం తీసుకున్నా అది దశలవారీగా ఉంటుందని, వాహన తయారీ సంస్థల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది నిర్ణయం ఉంటుందని ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. ధృవీకరించని సమాచారాన్ని నమ్మి ఆందోళన చెందవద్దని కేంద్రం ప్రభుత్వం ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

## సియా,చేతన్‌ల రహస్య వివాహం

కేతన్ హత్యకేసులో రోజుకో ట్విస్ట్

**పూణె,జులై 7:**దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పుణె బిజినెస్‌మ్యాన్ కేతన్ అగర్వాల్ హత్య కేసులో మరో ట్విస్ట్ బయటపడింది. ఈ కేసులో నిందితురాలు సియా, ఆమె ప్రియుడు చేతన్‌ను రహస్యంగా పెళ్లి చేసుకున్నట్లు తెలిసింది. దాంతో ఈ కేసు కొత్త మలుపు తిరిగింది. కేతన్‌తో నిశ్చితార్థం జరిగిన తర్వాతే వీరు వివాహం చేసుకున్నట్లు దర్యాప్తులో తేలిందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. కేతన్ అగర్వాల్‌తో సియాకు ఈ ఏడాది ఫిబ్రవరిలో నిశ్చితార్థం జరిగింది. నవంబరులో వివాహం జరిపించేందుకు ఇరు కుటుంబాలు నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ పెళ్లి ఇష్టంలేని సియా ఇంట్లో వాళ్లకు చెప్పకుండా నాలుగు నెలల కిందటే పుణెలోని స్థానిక రిజిస్ట్రార్ ఆఫీసులో ప్రియుడు చేతన్‌ను పెళ్లి చేసుకుందట. దీనికి ఇద్దరు స్నేహితులు సాక్షి సంతకాలు చేసినట్లు సమాచారం. కేసు దర్యాప్తులో భాగంగా సియా, చేతన్ ఫోన్లలోని వాట్సప్ సంభాషణలను



పరిశీలించడంతో ఈ విషయం బయటపడినట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. దాంతో పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. ప్రత్యేక వివాహ చట్టం కింద వీరికి వివాహ ధ్రువీకరణ పత్రం జారీ అయ్యిందా అనేది వెరిఫై చేస్తున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఈ పెళ్లి ఫొటోలను సియా తన ప్రైవేట్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిందట. ఆ తర్వాత వాటిని డిలీట్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. సాంకేతిక బృందాల సాయంతో ఆ ఫొటోలను రిట్రీవ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. జూన్ 18న కేతన్ అగర్వాల్ లోయలోపడి ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

## సిఎంను నియంత్రించడమేంటి?

డిఎంకె పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం

**న్యూఢిల్లీ, జులై 7:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ను తాము నియంత్రించాలని కోరడమేంటని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కరూర్ తొక్కిసలాట కేసు నేపథ్యంలో డిఎంకె పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి పర్యటనలు, ప్రసంగాలపై ఆంక్షలు విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం, రాజకీయ విభేదాలను పరిష్కరించుకోవడానికి సుప్రీంకోర్టును వేదికగా మార్చొద్దని స్పష్టం చేసింది. ఈ వ్యాఖ్యలతో డిఎంకె వెనక్కి తగ్గి తన పిటిషన్‌ను ఉపసంహరించుకుంది. కరూర్ తొక్కిసలాట కేసులో సిబిఐ దర్యాప్తు కొనసాగుతున్న సమ యంలో ముఖ్యమంత్రి విజయ్ జులై 10న అక్కడ పర్యటించనున్నారని డిఎంకె కోర్టు దృష్టికి తీసుకొచ్చింది. మృతుల కుటుంబాలకు ఉద్యోగ నియామక పత్రాలు, ఆర్థిక సాయం అందించే కార్యక్రమం దర్యాప్తులో ఉన్న సాక్షులపై ప్రభావం చూపే



అవకాశం ఉందని వాదించింది. అంతేకాదు టివికె నేత ఆదవ్ అర్జున చేసిన వ్యాఖ్యలపైనా అభ్యంతరం వ్యక్తంచేసింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ప్రసంగాలు, పర్యటనలపై ఆదేశాలు ఇవ్వాలని కోరింది.అయితే ఈవాదనలను సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. 'ముఖ్యమంత్రి ఏం చేయాలో కూడా సుప్రీంకోర్టే చెప్పాలా? ఆయన ఈ కేసులో నిందితుడు కాదు. స్వేచ్ఛగా మాట్లాడే హక్కుపైనా ఆంక్షలు కోరుతున్నారా?రాజకీయ ప్రత్యర్థుల వ్యాఖ్యలపై ఈ కోర్టు ఎలాఆదేశాలు ఇస్తుంది? అంటూ ధర్మాసనం ప్రశ్నించింది. దీంతో డిఎంకె తన పిటిషన్‌ను వెనక్కి తీసు కునేందుకు అనుమతి కోరగా కోర్టు అంగీకరించింది.

# సంక్షిప్త వార్తలు

## సింధూ జలాల్లో వాటా కోసం గట్టి చర్యలు: పాక్ ఆర్మీ



**ఇస్లామాబాద్, జులై 7:** సింధూ జలాల ఒప్పందాన్ని (ఐడబ్ల్యుటి) భారత్ పక్కనబెట్టడంతో పాకిస్థాన్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఈ ఒప్పందం ప్రకారం తమ దేశానికి రావాల్సిన సింధూ జలాల వాటాను పొందేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని 276వ కోర్ కమాండర్ల సమావేశంలో పాక్ తన నిర్ణయాన్ని వెల్లడించింది. ఆ దేశ రక్షణ దళాల అధిపతి అసిమ్ మునీర్ అధ్యక్షతన జరి గిన ఈ సమావేశంలో ప్రభుత్వ ఆదేశాలు, దేశ ప్రజల ఆకాంక్షల మేరకు సింధూ జలాల కోసం పోరాడుతామని సైన్యం తెలిపింది. 2025 ఏప్రిల్ 24 నాటి జాతీయ భద్రతా కమిటీ (ఎన్ఎస్‌సి) ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం సింధూ జలాలను ఆపే ఎటువంటి ప్రక్రియనైనా యుద్ధ చర్యగా పరిగణిస్తామని తెలిపింది.

## సిఎం విజయ్‌కి హైకోర్టు నోటీసులు

**చెన్నై, జులై 7:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఎన్నికను సవాల్ చేస్తూ డిఎంకె అభ్యర్థి ఇనిగో ఇరుదయరాజ్ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, మంగళవారం విచారణకు వచ్చింది. విజయ్‌తోపాటు మంత్రి ఆదవ్ అర్జున గెలుపుపై వచ్చిన పిటిషన్లను కూడా జస్టిస్ వి.లక్ష్మీనారాయణన్ ధర్మాసనం విచారణకు స్వీకరించింది. పిటిషన్లలో ఉన్న కొన్ని సాంకేతిక లోపాలను వారం రోజుల్లోగా సరిదిద్దాలని కోర్టు ఆదేశించింది. ఆ ప్రాసెస్ పూర్తి కాగానే విజయ్‌తో పాటు మంత్రికి మూడువారాల గడువిస్తూ రిజిస్ట్రీ నోటీసులు జారీ చేయనుంది. అయితే, ఈ వ్యవహారంలో హైకోర్టు జడ్జి ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. సాధారణంగా యేళ్ల తరబడి సాగే ఈ ఎన్నికల పిటిషన్ల విచారణను అత్యంత వేగంగా, కేవలం ఆరు నెలల లోపే పూర్తి చేయాలని స్పష్టం చేశారు.


## కాక్రోచ్ పార్టీ 'ఎక్స్' ఖాతాను పునరుద్ధరించండి: ఢిల్లీ హైకోర్టు

**న్యూఢిల్లీ, జులై 7:** 'కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) 'ఎక్స్' ఖాతాను పునరుద్ధరించాలని ఢిల్లీ హైకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దేశంలో తమ ఖాతాను నిలిపివేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం విచారిస్తూ జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఈ ఆదేశాలు జారీ చేశారు. కేంద్రం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, జూన్ 21న జరిగిన నీట్ రీఎగ్జామ్‌కు ముందు ముందస్తు జాగ్రత్త చర్యగా ఆ ఖాతాను నిలిపివేసినట్లు కోర్టుకు తెలిపారు. ఆ ప్లాట్‌ఫారమ్‌లోని కొన్ని పోస్టులు లక్షలాది మంది అభ్యర్థులు, వారి తల్లిదండ్రులలో గందరగోళం, ఆందోళనను కలిగించే అవకాశం ఉందని ఆయన వాదించారు. పరీక్ష పూర్తయినందున, ఆ 'ఎక్స్' ఖాతాపై ఆంక్షలు తొలగించడానికి ప్రభుత్వానికి ఎటువంటి అభ్యంతరం లేదు అని మెహతా పేర్కొన్నారు.

## లోక్‌సభ ముందుకు జస్టిస్ యశ్వంత్ వర్మ కేసు నివేదిక

**న్యూఢిల్లీ, జులై 7:** అవినీతి ఆరోపణల నేపథ్యంలో దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన అలహాబాద్ హైకోర్టు మాజీన్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు కమిటీ రూపొందించిన నివేదికను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు లోక్‌సభ స్పీకర్ ఓంప్రకాష్ బిర్లా నిర్ణయించారు. అయితే, అప్పటికే రాజీనామా చేసిన న్యాయమూర్తిపై పార్లమెంట్ ఎలాంటి చర్యలు తీసుకోగలదనే అంశంపై ఇప్పుడు సరికొత్త రాజ్యాంగపరమైన చర్చ తెరపైకి వచ్చింది. గతంలో జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో లెక్కల్లో చూపని నగదు కట్టలు దహనమైన వ్యవహారం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. దీంతో ఒత్తిడికి గురైన ఆయన, ఏప్రిల్ 9వ తేదీన తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.

## అవినీతికేసులో చైనా మాజీ అధికారికి మరణశిక్ష





**బీజింగ్,జులై 7:** చైనాలో భారీ అవినీతి కేసులో మాజీ ఆర్థికాభివృద్ధి అధికారి యాంగ్ యూలిన్‌కు కోర్టు మరణశిక్ష విధించింది. మూడు దశాబ్దాల పాటు అధికారాన్ని అడ్డం పెట్టుకుని రూ.2,800 కోట్లు లంచాల రూపంలో స్వీకరించినట్లు కోర్టు తేల్చింది. ఇటీవలి కాలంలో చైనాలో వెలుగుచూసిన అతిపెద్ద అవినీతి కేసుల్లో ఇదొకటిగా నిలిచింది.యాంగ్ యూలిన్ 1993 నుంచి 2023 వరకు పలు ప్రాజెక్టులు, వ్యాపార అనుమతులు, భూముల కేటాయింపులు, వర్కింగ్ క్యాపిటల్‌కు సంబంధించిన అంశాల్లో సాయం చేస్తూ భారీగా లంచాలు తీసుకున్నట్లు చాంగ్‌జౌ ఇంటర్మీడియట్ పీపుల్స్ కోర్టు వెల్లడించింది.

# మామిడి రైతును నట్టేట ముంచుతున్న ర్యాంపులు

• కేజీ తోతాపురికి రూ.3 మాత్రమే చెల్లింపు • ర్యాంపు నిర్వాహకుల జేబుల్లోకి రూ.4.50 కోట్లు

**చిత్తూరు, జులై 7 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లాలో తోతాపురి మామిడి రైతును ర్యాంపులు నట్టేట ముంచుతున్నాయి. జిల్లాలోని తోతాపురి మామిడి రైతులకు పల్ప్ ఫ్యాక్టరీలు కేజీ మామిడికి రూ.5 కచ్చితంగా చెల్లించాలని, ర్యాంపుల నిర్వాహకులు కేజీ తోతాపురి మామిడిపై రైతుకు రూ.4 చెల్లించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయితే జిల్లాలోని మామిడి రైతులకు ర్యాంపులు కలెక్టర్ నిర్ణయించిన ధరను సైతం చెల్లించకుండా భారీగా కోతలు విధించడంతో మామిడి పంట కోత కోయడానికి అప్పులు చేసిన రైతుకు చేతిలో చిల్లిగవ్వ మిగలని పరిస్థితి ఏర్పడింది. ఈ మామిడి సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 52 ర్యాంపులు ఏర్పాటు అయ్యాయి. ఈ ర్యాంపుల వద్దకు మామిడి రైతులు తాము పండించిన తోతాపురి మామిడికి తీసుకువస్తే వాటిని ర్యాంపు యాజమానులు కొనుగోలు చేసి ఆపై ర్యాంపుల నుండి తాము ఒప్పందం చేసుకున్న పల్ప్ ఫ్యాక్టరీలకు మామిడిని తరలిస్తుంటాయి. అత్యధిక మామిడి రైతులు సైతం నేరుగా తమ మామిడి పండ్లను పల్ప్ ఫ్యాక్టరీల వద్దకు తీసుకెళ్తే రోజుల తరబడి క్యూలో వుండాల్సిన పరిస్థితి వుంటుందని,



ర్యాంపులకు వెళితే అక్కడ కేజీకి ఒక రూపాయి తక్కువ లభించినా అప్పటికప్పుడు కాయలు అన్‌లోడ్ అవుతాయని భావించి ర్యాంపులకు వెళ్ళి మామిడి కాయలను రైతులు అన్‌లోడ్ చేస్తున్నారు. ఈ పరిస్థితిని అసరాగా చేసుకున్న ర్యాంపు యాజమానులు రైతులను నట్టేట ముంచడం ప్రారంభించారు. తాము కేజీ తోతాపురి మామిడికి రూ.3 కంటే ఎక్కువ చెల్లించడం సాధ్యం కాదని, దీనికంటే ఎక్కువ డబ్బులు కావాలంటే మీరు పల్ప్ ఫ్యాక్టరీలకు తీసుకెళ్ళాలని స్పష్టం చేస్తున్నారు.

జిల్లా అధికార యంత్రాంగం కేజీకి రూ.4 చెల్లించాలని పేర్కొంటుండటంతో ఆ మేరకు తమ కాయలు కొనుగోలు చేయాలని మామిడి రైతులు కొంతమంది ర్యాంపు నిర్వాహకులను ప్రాథేయపడినప్పటికీ ఫలితం వుండటం లేదు. జిల్లా వ్యాప్తంగా 51 వేల హెక్టార్ల విస్తీర్ణంలో తోతాపురి మామిడి పంట సాగు అయితే ఈ సీజన్‌లో 5 లక్షల మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడి ఉత్పత్తి అయ్యింది. జిల్లాలోని మామడి పల్ప్ ఫ్యాక్టరీలు, ర్యాంపులు, మండీలు ఇప్పటి వరకు 2.03 లక్షల మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడికి కొనుగోలు చేశాయి. ఇందులో జిల్లాలోని 31 పల్ప్ ఫ్యాక్టరీలు 1,60 లక్షల మెట్రిక్ టన్నుల మామిడిని రైతుల నుండి కొనుగోలు చేస్తే, మండీలు, ర్యాంపులు కలిసి తోతాపురి రైతుల నుండి 45 వేల మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడికి కొనుగోలు చేశాయి.

ర్యాంపు నిర్వాహకులు మామిడి రైతుల నుండి 45 వేల మెట్రిక్ టన్నుల మామిడిని కేజీ రూ.3తో కొనుగోలు చేయడంతో ర్యాంపు నిర్వహకులు ఇప్పటికే అధికారికంగా రూ.4.45 కోట్ల అదనపు ఆదాయం గడించినట్లైంది. ర్యాంపు యాజమానులకు సాధారణ ఆదాయంతో పాటు అదనపు ఆదాయం లభిస్తే ఇప్పటికే ర్యాంపు నిర్వాహకులు సుమారు రూ.15 కోట్ల మేరకు ఆదాయం ఆర్జించినట్లు తెలుస్తోంది. ర్యాంపుల్లో మామిడి రైతులకు జరుగుతున్న అన్యాయంను గుర్తించి జిల్లా అధికార యంత్రాంగం మామిడి రైతుకు న్యాయం చేయడానికి సత్వరం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## 15 నుండి సామాజిక శంఖారావం

**తిరుపతి, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** దళితుల ఆత్మగౌరవం కోసం, కులవివక్ష లేని సమాజం కోసం ఈనెల 15 నుండి చేపట్టనున్న సామాజిక శంఖారావాన్ని జయప్రదం చేయాలని దళిత సోషల్ ముక్తి మంచ్ జాతీయ నాయకుడు వి.శ్రీనివాసరావు, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంఢ్ర మాల్యాద్రి పిలుపునిచ్చారు. ఆగస్టు 15న దళితుల స్వాతంత్రానికి చిహ్నంగా జాతీయ సమైక్యతా దినోత్సవంగా ప్రతి గుడి ముందు జాతీయ జెండా ఎగురవేసి ఆలయ ప్రవేశం చేయాలన్నారు. టిటిడి ఛైర్మన్‌గా, ఇఒగా, ఆలయ పూజారులుగా దళితులకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధ్యయన యాత్రలు, ఆందోళనలు, ప్రత్యక్ష కార్యాచరణ రూపాల్లో సామాజిక శంఖారావాన్ని పూరించాలన్నారు. కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతి యశోదానగర్లోని వేమన విజ్ఞాన కేంద్రంలో జిల్లా సామాజిక శంఖారావం సదస్సు నిర్వహించారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటేష్ అధ్యక్షత వహించగా, వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్ సామాజిక శంఖారావం కార్యాచరణను వివరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజు ఆలయాల ముందు జాతీయ జెండాలను ఎగురవేసి, ఆలయ ప్రవేశం చేసి జాతీయ సమైక్యతను చాటాలన్నారు. వివక్షకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీయాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులను, యువతను ఎక్కువగా భాగస్వాములను చేయాలన్నారు. కుల వివక్షత పోరాట సమితి (కెవిపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంఢ్ర మాల్యాద్రి, గొర్రెల మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర నాయకుడు వెంకట్రావు, వ్యకాసం జిల్లా ఉపాధ్యక్షుడు వందవాసి నాగరాజు, కందారపు మురళి, అంగేరి పుల్లయ్య, హేమలత, సాయిలక్ష్మి, టి.సుబ్రమణ్యం, జయచంద్ర, పవిత్ర, బాలకృష్ణ, చెంగయ్య, లక్ష్మయ్య, హరినాథ్, ఎన్ డి శ్రీను పాల్గొన్నారు.

## కొండపర్వ వద్ద రోడ్డు ప్రమాదం.. ఒకరు మృతి

**విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం కొండపర్వ వద్ద రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరి పరిస్దితి ఆందోళనకరంగా ఉంది. మైలవరం సమీపం నుంచి కొండ పర్వకు ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న దంపతులను వేగంగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో చర్లపల్లి శృతి(28) మృతి చెందారు. ఆమె భర్తకు తీవ్రగాయాలయ్యాయి. ఆయన పరిస్దితి ఆందోళనకరంగా ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 15 నుంచి ఇంజనీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్

**విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం ఈ నెల 15 నుంచి కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉన్నత విద్యాశాఖ ప్రాథమికంగా నిర్ణయం తీసుకుంది. కాలేజీల అనుబంధ గుర్తింపును త్వరగా పూర్తిచేసి, కౌన్సెలింగ్ చేపట్టాలని భావిస్తోంది. ఇంజినీరింగ్ కళాశాలలకు కనీస ఫీజును రూ.40,000ల నుంచి రూ.47,000లకు పెంచింది. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వ హయాంలో కనీస ఫీజును రూ.45,000లకు పెంచింది. ఆ తర్వాత వైసిపి సర్కార్ దీన్ని రూ.35,000లకు తగ్గించింది. తాజాగా రూ.47,000లుగా నిర్ణయించారు. ఎపిలో ప్రస్తుతం 140 ఇంజినీరింగ్ కాలేజీల కనీస ఫీజు రూ.40,000లుగా ఉంది. తాజా పెంపుతో ఆయా విద్యాసంస్థలకు ప్రయోజనం చేకూరనుంది. మిగతా కళాశాలలకు గత సంవత్సరం ఫీజులే అమల్లో ఉంటాయి. ఆంధ్రప్రదేశ్ ఫీజుల నియంత్రణ, పర్యవేక్షణ కమిటీ (ఎపిఎఫ్ఆర్ఎంసి) కళాశాలల ఆదాయ, వ్యయాలను గణించి రెండు, మూడు నెలల్లో కొత్త ఫీజులను ఖరారు చేస్తుంది. ఈ ఫీజులే 2026-27 విద్యా సంవత్సరం నుంచి మూడు సంవత్సరాల పాటు అమల్లో ఉంటాయి. మరోవైపు ఇంజినీరింగ్ సీట్ల పెంపుపై సర్కార్ పరిమితి విధించింది. గత సంవత్సరంలో ఉన్న సీట్ల సంఖ్యకే ఈ ఏడాదీ ఆమోదం తెలపనుంది. దీనికి కళాశాల యాజమాన్యాలు సమ్మతించాయి. ఈ ఏడాది 6000లకు పైగా సీట్లు పెంచేందుకు ఎఐసిటిఇ అనుమతించినా, ప్రభుత్వం మాత్రం పరిమితి విధించింది.

# పొగాకుకు లభించని గిట్టుబాటు ధర

• అధికారులు వస్తేనే ధరలు పెంచుతారు • మండిపడుతున్న రైతులు • కంపెనీల తీరుపై మండిపాటు



**ఒంగోలు (కలెక్టరేట్), జులై 7 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి ఆదేశాలు, మంత్రులు, ఎమ్మెల్యేల సూచనలు, జిల్లా కలెక్టర్ హెచ్చరికలు ఉన్నప్పటికీ ప్రకాశం జిల్లాలో పొగాకు రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలం కేంద్రాలను అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించిన సమయంలో మాత్రమే కొనుగోలు కంపెనీలు ధరలు పెంచుతున్నాయని, వారు వెళ్లిన వెంటనే మళ్లీ ధరలు తగ్గిస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఏడాది పొడవునా కష్టపడి పండించిన పొగాకుకు సరైన ధర రాకపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ప్రభుత్వం పలుమార్లు కొనుగోలు కంపెనీలకు హెచ్చరికలు చేసినప్పటికీ పరిస్థితిలో మార్పు కనిపించడం లేదని రైతులు పేర్కొంటున్నారు. అధికారులు వేలం కేంద్రాల్లో ఉన్న సమయంలో మాత్రమే ధరలు పెరగడం, అనంతరం మళ్లీ తగ్గిపోవడం వెనుక అసలు కారణాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు. ఇది యాదృచ్ఛికమా, లేక రైతులను నష్టపరిచే విధంగా జరుగుతున్న వ్యవహారమా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ స్వయంగా ఆదేశాలు ఇచ్చినా కొనుగోలు సంస్థల వైఖరిలో మార్పు లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రభుత్వ ఆదేశాలు అమలవుతున్నాయా లేదా అనే అంశంపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. వేలం కేంద్రాల్లో అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి ధరల విషయంలో పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రైతుల నుంచి నాణ్యమైన పొగాకును కొనుగోలు చేసే విషయంలో కూడా పారదర్శక విధానం పాటించాలని విజ్ఞప్తి చేశారు. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ధరలు నిర్ణయించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. పెరుగుతున్న సాగు ఖర్చులు, ఎరువులు, కూలీల వ్యయం, అప్పుల భారంతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు గిట్టుబాటు ధర లేకపోవడం మరింత భారంగా మారిందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని వేలం కేంద్రాల్లో ధరల నిర్ణయ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, కొనుగోలు కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. గిట్టుబాటు ధర కల్పించకపోతే పొగాకు సాగుపై రైతులు ఆసక్తి కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం అందేలా కొనుగోలు విధానంలో సంస్కరణలు తీసుకురావాలని వారు కోరుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసి పొగాకు రైతుల ప్రయోజనాలను కాపాడే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రైతుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని కనీస గిట్టుబాటు ధరకు హామీ కల్పించాలని కోరారు. జిల్లా యంత్రాంగం నిరంతర పర్యవేక్షణతో పాటు ప్రతి వేలం కేంద్రంలో ధరలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించే కొనుగోలు కంపెనీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. దీంతోనే పొగాకు రైతులకు న్యాయం జరిగి వారి కష్టం ఫలిస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు.

## తిరుపతిలో వైసిపి నేతలపై కేసు

**తిరుపతి, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద వైసిపీ నేతల నిరసనలో భాగంగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిపై ఫిర్యాదు చేసేందుకు వైసిపి నాయకులు యత్నించారు. ఈ సందర్భంగా పోలీసులు, వైసిపి కార్యకర్తలకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. వైసిపి చంద్రగిరి ఇన్‌ఛార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సహా పలువురిపై మంగళవారం ఎస్వీయూ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించారనే నెపంతో తిరుపతి ఎస్పీ కార్యాలయం వద్ద నిరసన చేపట్టిన వైసిపినాయకులు, కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సహా చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, చంద్రమౌలి రెడ్డి, చెవిరెడ్డి రఘుతో పాటు మరో 30 మందికి పైగా వ్యక్తులపై పోలీస్ విధులకు ఆటంకం కల్గించారన్న అభియోగంపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## జయలలితకో నాయం? జగన్‌కో న్యాయమా?

**విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** అక్రమాస్తుల కేసులో జగన్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ డిమాండ్ చేసారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసిపి అధినేత జగన్ పై ఉన్న అక్రమాస్తుల కేసుల విచారణ యేళ్ల తరబడి సాగుతుండటంపై ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. గతంలో ఇటువంటి ఆరోపణలు ఎదుర్కొన్న తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత కేసులో ఒకలా, ఎపిలో జగన్ కేసులో మరోలా న్యాయం జరుగుతోందా? అని ప్రశ్నించారు. ఈ కేసుల విచారణలో జరుగుతున్న సుదీర్ఘ జాప్యం చూస్తుంటే న్యాయవ్యవస్థ రాజకీయ ఒత్తిళ్లకు లొంగుతోందా? అనే అనుమానం సామాన్య ప్రజల్లో కూడా బలంగా కలుగుతోందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇదే సమయంలో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న అయోధ్య రామాలయ నిర్మాణ అంశంపై కూడా ఆయన స్పందించారు. అయోధ్యలో జరిగిన రామాలయ నిర్మాణం, ఇతర అభివృద్ధి పనుల పేరిట వేలాది కోట్ల రూపాయలు వసూలు చేసి భారీ అవినీతికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. ఈ కుంభకోణం వెనుక ఉన్న అసలు నిజాలు బయటకు రావాలంటే తక్షణమే కేంద్ర ప్రభుత్వం సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## తిరుమల సమాచారం



### ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.11 లక్షలు విరాళం

**తిరుమల, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పలు పథకాల్లో ఎస్వీ ప్రాణదానం కూడా కీలకమైంది. ఈ పథకానికి దాతలు తమవంతుగా విరాళాలందిస్తున్నారు. మంగళవారం సాయంత్రం తెలంగాణ హైదరాబాద్‌కు చెందిన ఎస్‌కె ఎంటర్‌ప్రైజెస్ సంస్థ ప్రతినిధులు టిటిడి ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు ఈ విరాళాల డిడిని టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరికి అందజేశారు.

# 14న టిటిడి పాలక మండలి భేటీ

• పలు కీలక అంశాలపై చర్చించే అవకాశం



**తిరుమల, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సమావేశం ఈనెల 14వ తేదీ మంగళవారం తిరుమల అన్నమయ్య భవనంలో జరగనుంది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి తగిన నిర్ణయం తీసుకునే దిశగా కార్యాచరణ సిద్దం చేస్తున్నారు. రానున్న సెప్టెంబర్ నెలలో శ్రీవారి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు ఆరంభం కానుండటం, ఆ తరువాత అక్టోబర్‌లో నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, తిరుమలలో ఏర్పాట్లు, మాఢవీదుల్లో విస్తృత సౌకర్యాలు కల్పించే అంశాలపై కూలంకుషంగా చర్చించే అవకాశం ఉంది. టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశం టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్రకు రెండవది. అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరితో కలసి బోర్డు పలు విషయాలపై అజెండా రూపొందించింది. ముఖ్యంగా తిరుమలలో ఎదరవుతున్న 'పార్కింగ్' ఇబ్బందులు ప్రత్యామ్నాయంగా 'మల్టీలెవల్' కార్ పార్కింగ్ సౌకర్యంపై చర్చించనున్నారు. వేంకటేశ్వరస్వామి దర్శనానికి రోజుకు లక్షమంది వరకు భక్తులు, ఐదారువేలకు పైగా యాత్రికుల వాహనాలు, ట్యాక్సీలు ఇలా తిరుమలకు వస్తుండటంతో పార్కింగ్ సమస్య ఎదురవుతోంది. ఇక మినీసచివాలయంగా అలరారుతున్న టిటిడిలో ఉద్యోగాల ఖాళీల భర్తీ విషయంగా కూడా చర్చించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే ఏటేటా పదవీవిరమణ చేస్తున్న శాశ్వత ఉద్యోగుల సంఖ్య క్రమేపీ తగ్గిపోతోంది. గతనెలలో ఏకంగా 130 మంది వరకు అన్ని కేడర్‌లలో ఉద్యోగులు, అధికారులు పదవీవిరమణ చేయడం విశేషం. ఈనెలలో కూడా భారీసంఖ్యలోనే ఉద్యోగులు పదవీవిరమణ ఉందని టిటిడి వర్గాల్లో చర్చ మొదలైంది. కొన్ని కీలకంగా ఉన్న ముఖ్యమైన విభాగాల్లో పోస్టుల నియామకాలకు సంబంధించి చర్చ చేయనున్నారు. తిరుమల శ్రీవారి ఆలయంతో బాటు తిరుపతి స్థానిక ఆలయాల్లోనూ అర్చకుల కొరత వెంటాడుతోంది. దీనిపై చర్చించి ఆమోదం తెలపనున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఇలానే ఎదుర్కోవాల్సి వస్తే ప్రత్యామ్నాయ చర్యలు, వరుణ యాగాలు, పారాయణాలు చేపట్టాల్సిన విషయంగా కూడా చర్చకు రానుంది.

## అమెరికాలో రోడ్డు ప్రమాదం ఎన్టీఆర్ జిల్లా యువతి మృతి



**విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మూలపాడుకు చెందిన తెలుగు విద్యార్థిని మృతి చెందింది. మూలపాడు గ్రామానికి చెందిన అట్లూరి ప్రసన్న న్యూయార్క్‌లో జరిగిన కారు ప్రమాదంలో మృతి చెందింది. ఆమె ఇటీవల న్యూయార్క్‌లో పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తుంది. ప్రసన్న తన స్నేహితులతో కలిసి కారులో సమీపంలోని ఆలయానికి వెళుతోంది. మార్గమధ్యంలో ట్రాఫిక్ సిగ్నల్ వద్ద వారి వాహనం ఆగి ఉండగా, వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన మరో కారు బలంగా ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ప్రసన్నతో పాటు మరో యువతి కూడా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. కారులో ఉన్న మూడో వ్యక్తి తీవ్రంగా గాయపడగా, అతడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రసన్న ఇటీవలే న్యూయార్క్‌లోని పేస్ యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. మంచి ఉద్యోగం సంపాదించి కుటుంబాన్ని ఆదుకోవాలనే లక్ష్యంతో ఆమె ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే విధి వక్రించి ప్రమాదం రూపంలో ఆమెను మృత్యువు కబళించింది. ప్రసన్న మరణవార్త తెలియడంతో ఆమె స్వగ్రామం మూలపాడులో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీర వుతున్నారు. ఈ ఘటన శనివారం చోటు చేసుకుంది. అయితే సమాచారం ఆలస్యంగా అందింది. మృతదేహం తరలింపుపై ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

## 15 చిత్రాల్లో నటిస్తున్నా..!



**తిరుమల, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రస్తుతం 15 చిత్రాల్లో నటిస్తున్నానని, అన్నీ మంచి పాత్రలేనని సీనియర్ నటుడు బాబుమోహన్ తెలిపారు. ఇప్పుడు డ్యాన్స్‌లు వేస్తున్నానని ఆనందంగా చెప్పారు. ఎస్వీ కృష్ణారెడ్డి తెరకెక్కిస్తున్న చిత్రంలో స్టెప్పులు కూడా వేశానన్నారు. తన చివరి శ్వాస వరకూ నటిస్తూనే ఉంటానని బాబూమోహన్ పేర్కొన్నారు. శ్రీవేంకటేశ్వర స్వామి దయతో 41 సంవత్సరాలుగా నటుడిగా కొనసాగు తున్నానని వెల్లడించారు. బాబూమోహన్ ఆలయంలో అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. తీర్థప్రసాదాలు అందజేశారు. తెలుగు ప్రజలందరికీ శుభాలు కలగాలని, శ్రీవారి ఆశీస్సులుండాలని ఆకాంక్షించారు.

# బ్రహ్మోత్సవాలకు పూర్తిస్థాయిలో విద్యుత్ బస్సులు

• రిలయన్స్ బృందంతో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి

**తిరుమల, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** రిలయన్స్ సంస్థ విరాళంగా అందిస్తున్న విద్యుత్ బస్సులను భక్తులకు పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అన్నారు. రానున్న బ్రహ్మోత్సవాల నాటికి పూర్తిస్థాయిలో తిరుమలలో విద్యుత్ బస్సులు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం టిటిడి నడుపుతున్న 15 బస్సులతో పాటు అదనంగా మరో పది బస్సుల కోసం మొత్తం 50 బస్సుల సామర్థంతో ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేసి ఒకేసారి 20 బస్సులు ఛార్జింగ్ అయ్యేలా 10 ఛార్జింగ్ పాయింట్లను అందుబాటులో ఉంచాలని రిలయన్స్ బృందాన్ని కోరారు. రిలయన్స్ సంస్థ టిటిడికి 25 విద్యుత్ బస్సులను విరాళంగా ఇస్తుండటంతో ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు, పవర్ సప్లయ్, డ్రైవర్ల నిర్వహణ, వివిధ మౌలిక సదుపాయాల ఏర్పాటుపై రిలయన్స్ సంస్థ ప్రతినిధులతో తిరుమలలో పద్మావతి అతిథి గృహంలోని ఇఒ సి.హెచ్. వెంకయ్య చౌదరి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1,030 చదరపు అడుగుల వైశాల్యం కలిగిన ఒక్కో బస్సులో 50 మంది సురక్షితంగా ప్రయాణించేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

బస్సులు త్వరగా ఛార్జింగ్ అయ్యేందుకు వీలుగా 2 మెగా వాట్ల సామర్థం కలిగిన ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలన్నారు. బస్సులను నడిపేందుకు 50 మంది నిపుణులైన డ్రైవర్లను సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. బస్సులో అధునాతన ప్రయాణికుల సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసి రాబోయే బస్టాప్‌ల వివరాలు భక్తులకు తెలిసేలా చర్యలు చేపట్టాలని చేపట్టాలని చెప్పారు. ఈ సమావేశంలో టిటిడి ఎస్టేట్ అధికారి వేంకటేశ్వర్లు, ఐటీ జిఎం వేంకటేష్ నాయుడు, ఎలక్ట్రికల్ డిఇచంద్ర శేఖర్, రవాణా డిఎం లక్ష్మీ ప్రసన్న, రిలయన్స్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ కార్తీక్ గణేసన్, సీనియర్ జనరల్ మేనేజర్లు రాఘవేంద్ర, వినోద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## ప్రశ్న రావణ్ పై ఉపా చట్టం

### సిపిఐ ఆధ్వర్యంలో 10న విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం

**విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రశ్న రావణ్‌పై ఉపా చట్టాన్ని మోపటాన్ని వ్యతిరేకిస్తూ సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల, ప్రజాసంఘాల నేతలు, మేధావులు, జర్నలిస్టులు తదితరులు పాల్గొననున్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేంద్రంలోని మోడీ ప్రభుత్వ విధానాలనే అనుసరిస్తూ ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తున్నదన్నారు. ప్రశ్న రావణ్ పై ఇప్పటికే పలు కేసులు నమోదు చేసిన రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రమాదకరమైన దేశద్రోహు లపై ప్రయోగించే ఉపా చట్టం మోపటం దుర్మార్గం గుజ్జుల ఈశ్వరయ్య వ్యాఖ్యానించారు.



# తిరుపతిలో కొత్తరకం నేరాలు

- ద్విచక్రవాహనంపై పడిపోతున్నట్లు నటన
- సాయంచేసే వారి సెల్‌ఫోన్‌ల అపహరణ

**తిరుపతి, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** స్మార్ట్‌సిటీ ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో కొత్తరకం నేరాలకు పాల్పడేలా కొందరు ముఠా తయారయ్యారు. ఇదివరకు ద్విచక్ర వాహనాల్లో వెళ్ళే వారిని వెంబడించడం, వారి మెడల్లోని బంగారు గొలుసులు లాక్కెడం వంటి ఘటనలు జరిగేవి.

నగరంలో పలుచోట్ల ఇళ్ళ ముందు ఉండే మహిళలను చిరునామాలు అడగడం, ఆ తరువాత మత్తుమందుచల్లి బంగారు నగలు దోచుకోవడం జరిగేది. ఇప్పుడు సులభంగా సెల్‌ఫోన్‌లను కొట్టేసే ఘటనలకు పాల్పడుతున్నారు. ఈ కొత్త తరహాలో చోరీలకు పాల్పడుతున్న ముఠా తిరుపతి నగరంలోకి దిగింది. రోడ్లపై వెళుతూ ద్విచక్ర వాహనాన్ని అదుపు తప్పినట్లు చేసి సాయం కోరినట్లు నటిస్తూ చేసిన సహాయానికి వచ్చిన వ్యక్తి నుండి జేబుల్లోంచి సెల్‌ఫోన్‌లు అపహరిస్తున్న సంఘటనలు జరుగుతున్నాయి. ఇటీవల నగరంలోని తూర్పు పోలీస్ స్టేషన్ పరిధిలోని బైరాగిపట్టెడలో ఆదివారం మధ్యాహ్నం పట్ట పగలే రూ.1.50 లక్షలు విలువచేసే ఫోన్ అపహరించుకెళ్ళారు.

ఆ ప్రాంతంలోని సిసికెమెరా ఫుటేజ్‌లో రికార్డ్ అయిన దృశ్యాలను పోలీసులు గమనించారు. ఇక సోమవారం సాయంత్రం తిరుపతి- మంగళం రోడ్డులోని బొంతాలమ్మ గుడి వద్ద అదే తరహాలో ఇద్దరు యువకులు ద్విచక్రవాహనాన్ని కిందపడిపోతున్నట్లు నటిస్తూ సాయంగా వచ్చిన వ్యక్తి జేబులోని రూ.25వేల విలువైన ఫోన్ చోరీ చేసుకెళ్ళారు. మంగళవారం ఉదయం తిరుపతి అన్నారావు సర్కిల్ వద్ద అదే తరహాలో మరో రెండు ఫోన్లు చోరీ చేసుకెళ్ళారు.

నగరంలో ఇదో కొత్త తరహాలో చోరీలకు పాల్పడుతూ నేరస్తులు పోలీసులకు సవాల్ చేస్తున్నారు. ఇలా నగరంలో ఎంతమంది గ్యాంగ్‌లు వచ్చారనేది ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి తరహాల నేరాలకు ఇంకా ఎంతమంది గురికావలసి వస్తుందోనని ఆందోళన వ్యక్తమవుతోంది.

# పోలీసు స్టేషన్ ముందే ఆత్మహత్యాయత్నం

- సిఐ వేధింపులే కారణమని బంధువుల ఆరోపణలు
- మహిళలతో దురుసుగా ప్రవర్తించారంటూ ఆగ్రహం



**ఆస్పరి, జులై 7 ప్రభాతవార్త:** కర్నూలు జిల్లా ఆస్పరి పోలీసు స్టేషన్‌లో మంగళవారం చోటుచేసుకున్న ఘటన తీవ్ర కలకలం రేపింది. బిల్లేకల్లు గ్రామానికి చెందిన హానుమంతురెడ్డి అనే వ్యక్తి కేసు విచారణ పేరుతో సి.ఐ. శ్రీనివాస్ నాయక్ తనను తీవ్రంగా వేధిస్తున్నాడని ఆరోపిస్తూ పోలీసు స్టేషన్‌లోనే పురుగుల మందు త్రాగి అత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో పోలీసు స్టేషన్ వద్ద ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. భాధితుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం నెల రోజుల క్రితం గ్రామంలో వాల్మీకి, ఈడిగ సామాజిక వర్గాలకు చెందిన రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ కేసులో హానుమంతరెడ్డి ప్రమేయం ఉందనే అనుమానంతో పోలీసులు పలుమార్లు విచారణకు పిలిపించారని తెలిపారు. ఆస్పరిలోని పోలీసు క్వార్టర్స్‌లో మూడు రోజుల పాటు నిర్భంధించి చిత్ర హింసలకు గురి చేయడంతో పాటుడబ్బులు కూడా డిమాండ్ చేశారని వారు ఆరోపించారు. ప్రస్తుతం ఆస్పరి సొసైటిలో జరిగిన అవినీతి అక్రమాలపై సింగిల్ విండో సీఈఓ నరసింహులు ఇచ్చిన కేసు విచారణ పేరుతో మూడు రోజుల క్రితం కూడా స్టేషన్‌కు రప్పించి తీవ్రంగా కొట్టారని వారు పేర్కొన్నారు. మంగళవారం మరోసారి స్టేషన్‌కు రావాలని సమాచారం అందడంతో మళ్ళీ వేధింపులకు గురిఅవుతాననే భయంతో తీవ్ర మనస్తాపానికి గురై హానుమంతురెడ్డి పోలీసు స్టేషన్‌లోనే పురుగుల మందు తాగినట్లు బంధువులు తెలిపారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు అతన్ని అతనిని స్తానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం 108 అంబులెన్స్‌లో ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. జరిగిన ఘటనపై ఆరా తీసేందుకు పోలీసు స్టేషన్‌కు వెళ్ళిన మహిళలతో సి.ఐ. దురుసుగా ప్రవర్తించాడని భాధితుడి సభ్యులు ఆరోపించారు. మహిళల చీరలను లాఠీతో లాగుతూ అసభ్య పదజాలంతో దూషించాడని వారు వాపోయారు. ఈ ఘటనతో భాధితుడి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు స్తానిక పోలీసు స్టేషన్ ఎదుట ఆంధోళనకు దిగారు. విచారణ పేరుతో పోలీసుల వేధింపులే ఈ ఘటనకు కారణమరని ఆరోపిస్తు ఘటనపై న్యాయ విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా బాధిత కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలపై పోలీసుశాఖ నుంచి అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించేందుకు పోలీసులు నిరాకరిస్తున్నట్లు సమాచారం.

# ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల మరమ్మతులు

- 117 కొత్త గేట్ల ఏర్పాటుకు రూ.150 కోట్లు
- వచ్చే వారం సిఎం చేతుల మీదుగా పనుల ప్రారంభం
- జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 7 ప్రభాతవార్త:** ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల మరమ్మతులు,117 కొత్త గేట్ల ఏర్పాటుకు రూ.150 కోట్లతో పనులను ప్రారంభిస్తున్నా మని, వచ్చే వారం ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు జల వనరుల శాఖ మంత్రి డా. నిమ్మల రామానాయుడు తెలిపారు. మంగళవారం ధవళేశ్వరం బ్యారేజ్‌పై ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ, రాష్ట్రానికి జలవనరుల శాఖ అత్యంత కీలకమని అన్నారు. గత ప్రభుత్వం ఇరిగేషన్ రంగాన్ని నిరక్ష్యం చేయడంతో రూ.18 వేల కోట్ల బిల్లులు బకాయిలుగా మిగిలాయని ఆరోపించారు. అయినప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయించి ఇరిగేషన్ రంగాన్ని గాడిలో పెడుతోంద న్నారు. తుంగభద్ర ప్రాజెక్టు గేట్ల పరిస్థితిపై నిపుణులు హెచ్చరించినా గత ప్రభుత్వం పట్టించుకోలేదని, ఫలితంగా 2024లో 19వ గేటు కొట్టుకుపోయి 105 టీఎంసీల నీరు వృథా అయిందన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం వేగంగా స్పందించి గేటును పునర్నిర్మించి 80 టీఎంసీల నీటిని కాపాడిందని వివరించారు. అలాగే శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతులకు రూ.250 కోట్లు కేటాయించి పనులు చేపట్టగా, గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్ల పనులను కూడా పూర్తి చేసినట్లు తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ గోదావరి జిల్లాల జీవనాడి అని, దీని ద్వారా తాగునీటితో పాటు సుమారు 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోందన్నారు. బ్యారేజీ గేట్లు ప్రమాదకర స్థితిలో ఉన్నాయని నిపుణులు హెచ్చరించినా గత ప్రభుత్వం నిరక్ష్యం చేసిందన్నారు. 2015లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హయాంలో 175 గేట్లలో 58 గేట్లను రూ.32 కోట్లతో మార్చిన విషయాన్ని గుర్తుచేసిన మంత్రి, ఇప్పుడు మిగిలిన117 గేట్లను రూ.150 కోట్లతో పూర్తిగా పునర్నిర్మిస్తున్నట్లు తెలిపారు. వచ్చే సాగు సీజన్ నాటికి ఈ పనులను పూర్తి చేయడమే లక్ష్యమన్నారు.

గోదావరి జిల్లాల రైతులకు భద్రత, భరోసా కల్పించేం దుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ముఖ్యమంత్రి విడుదల చేసిన 36 ప్రాజెక్టుల ఇరిగేషన్ క్యాలెండర్‌లో గోదావరి డెల్టా ఆధునికీకరణ కూడా ఉందన్నారు. ఉమ్మడి ఐదు గోదావరి జిల్లాల్లో డ్రెయిన్లు, కాలువల వ్యవస్థను రూ.14 కోట్లతో శాశ్వత ప్రాతిపదికన మెరుగుపరుస్తామని మంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టితో, ఎల్‌నినో ప్రభావం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా 'జలధార–జలహారతి' కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిపాదించి అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. నీటి వనరుల సమర్థ నిర్వహణ, సాగునీటి భద్రత, తాగునీటి లభ్యతను నిరంతరం మెరుగుపరచాలనే ప్రభుత్వ నిబద్ధతకు ఈ కార్యక్రమం నిదర్శనమన్నారు. మంత్రి వెంట ఇరిగేషన్ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# గీత కార్మికుల ఆర్థికాభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

- మద్యం దుకాణాలు, బార్లలో 10 శాతం రిజర్వేషన్
- లైసెన్స్ ఫీజులో 50 శాతం రాయితీ: మంత్రి కొల్లు రవీంద్ర



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 7 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అన్ని వర్గాల సామాజిక, ఆర్థిక అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యంగా గీత కార్మికులు, వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం పలు కీలక నిర్ణయాలను అమలు చేస్తున్నట్లు రాష్ట్ర గనులు, భూగర్భశాఖ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని మంజీరా హోటల్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఇతర కూటమి నాయకులతో కలిసి మంత్రి మాట్లాడారు. ప్రజలకు సుపరిపాలన అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ క్రమంలో గీత కులాలైన శెట్టిబలిజ, గౌడ, యాత, శ్రీశయన వర్గాల ఆర్థికాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని నూతన మద్యం విధానంలో మద్యం దుకాణాల కేటాయింపులో 10 శాతం రిజర్వేషన్ కల్పించడంతో పాటు లైసెన్స్ ఫీజులో 50 శాతం రాయితీ అందిస్తున్నట్లు చెప్పారు. బార్ల కేటాయింపు లోనూ 10 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. గీత కార్మికుల సామాజిక భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొంటూ, చెట్లపై నుంచి పడి ప్రమాదవశాత్తు మరణించిన గీత కార్మికుల కుటుంబాలకు కార్మిక శాఖ నుంచి రూ.5 లక్షలు, ఎక్సైజ్ శాఖ నుంచి రూ.5 లక్షలు కలిపి మొత్తం రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న 33 కేసులకు త్వరలోనే పరిహారం అందించే చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అలాగే 50 సంవత్సరాలు దాటిన గీత కార్మికులకు పెన్షన్ అందించడం తమ ప్రభుత్వ విశిష్ట కార్యక్రమ మని పేర్కొన్నారు. పోలవరం జిల్లాలోని పందిరిమామిడి ఉద్యాన పరిశోధన కేంద్రాన్ని అధికారులతో కలిసి సందర్శించినట్లు మంత్రి తెలిపారు. అక్కడ సుమారు 200 రకాల తాటి జాతులపై పరిశోధనలు కొనసాగు తున్నాయని, నీరా పానీయం ఉత్పత్తి, నిల్వ, కోల్డ్‌చైన్ ఏర్పాటుతో పాటు బెల్లం, పౌడర్, స్పిరిట్, స్వీట్నర్ వంటి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై పరిశోధనలు జరుగుతు న్నాయని చెప్పారు. వీటిని అంతర్జాతీయ మార్కెట్‌కు అనుసంధానం చేసి గీత కార్మికులకు మెరుగైన ఆదాయం అందేలా కార్యాచరణ రూపొందిస్తు న్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి గోవా, కేరళ తరహాలో విశాఖపట్నం, సూర్యలంక తీర ప్రాంతాల్లో బీచ్ షాక్స్ విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి తెలి పారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా స్టార్ హోటళ్లతో అనుసంధానించి, పర్యా టకాభివృద్ధికి తోడ్పడేలా ఈ విధానాన్ని అమలు చేస్తామని చెప్పారు. అలాగే రాష్ట్రం ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధాన ప్రయోజ నాలు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా ప్రజలకు చేరవేసేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను కోరారు.

## ప్రతి ఆనకట్ట తనిఖీకి సర్కార్ నిర్ణయం

**విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపిలోని ప్రతి ఆనకట్టను తనిఖీ చేయాలని జలవనరుల శాఖ నిర్ణయం తీసుకుంది. 151 ఆనకట్టల భద్రత మదింపుకు కమిటీ ఛైర్మన్లుగా జలవనరుల నిపుణులను నియమించింది. ఈ కమిటీ ఛైర్మన్లుగా అక్షయ్‌కుమార్ దాస్, పి.రామచంద్రరావు, ఎం.కె.శ్రీనివాస్, ఎ.కె.గంజు నియమించారు. కమిటీ ఛైర్మన్లుగా ఎ.కె.బజాజ్, అల్వాల్ పరమేశం, జె.చంద్రశేఖర్ అయ్యర్, ఎస్.కె.శ్రీవాత్సవ నియమితులయ్యారు.

## 9న బనగానపల్లెకు సిఎం చంద్రబాబు

### 'మీ భూమి మీ హక్కు' కార్యక్రమానికి హాజరు

**విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** మీ భూమి మీహక్కు కార్యక్రమంలో భాగంగా పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 9 తేదీన నంద్యాల జిల్లాలో పర్యటించనున్నారు. రీ సర్వే ప్రక్రియ పూర్తైన గ్రామాల్లోని రైతులు, భూ యజమానులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ చేసేందుకు ముఖ్యమంత్రి బనగానపల్లె నియోజకవర్గంలో పర్యటించనున్నారు. 9న రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేసే పట్టాదారు పాస్ పుస్తకాలతో కలిపి ఇప్పటి వరకూ ప్రభుత్వం 29 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేసినట్టు అవుతుంది. ఇప్పటివరకు 6,887 గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియ పూర్తి చేసి 29.04 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రభుత్వం ముద్రించి పంపిణీ చేసింది. ఈ నెల రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 428 గ్రామాల్లో 2.48 లక్షల పట్టాదార్ పాస్ పుస్తకాల పరిశీలనను రెవెన్యూ శాఖ పూర్తి చేసింది. నంద్యాల జిల్లాలో 8,412 ఖాతా పుస్తకాలు, బనగానపల్లె నియోజకవర్గంలోని 1,125 పాస్ పుస్తకాలను రెవెన్యూ శాఖ సిద్ధం చేసింది. వచ్చే ఏడాది మార్చి నాటికి మిగిలిన 9,929 గ్రామాల్లోనూ సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇంకా 64.53 లక్షల రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేయాల్సి ఉంది. మీ భూమి మీ హక్కు సమావేశం అనంతరం బనగానపల్లె పార్టీ కార్యకర్తలతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. ఈ నెల 9 తేదీన ఉదయం 10 గంటలకు అమరావతి నుంచి బనగానపల్లెకు ముఖ్యమంత్రి బయల్దేరి వెళ్లనున్నారు. 11.20కి బనగానపల్లె చేరుకుని స్థానిక తహసిల్దారు కార్యాలయానికి వెళ్లనున్న ముఖ్యమంత్రి అక్కడ ప్రజలకు అందుతున్న సేవలను నేరుగా పరిశీలించనున్నారు. అలాగే పలువురు రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు మీ భూమి మీ హక్కు పేరిట పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, బహిరంగ సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.35 గంటలకు బనగానపల్లె నియోజకవర్గ టిడిపి కార్యకర్తలతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. సాయంత్రం 4 గంటల తర్వాత ఆయన అమరావతికి బయల్దేరనున్నారు.

## దుర్గమ్మ గుడిలో శాకంబరి ఉత్సవాలు

- 27 నుండి 29 వరకు వేడుకలు



**ఇంద్రకీలాద్రి, జులై 7 ప్రభాతవార్త:** దుర్గమ్మ శాకంబరి మాతగా ఈనెల 27 నుండి 29 వరకు మూడు రోజుల పాటు భక్తులను అనుగ్రహించనున్నారు. సకలలోకాలు క్షామంతో పీడితగ్రస్తమై బాధపడుతుండగా వారిని అనుగ్రహించడానికి శ్రీ అమ్మవారు శాకంబరిగా అవతరించి వారి క్షుద్బాధను తీర్చినందున భక్తులు శ్రీ అమ్మవారిని శాకంబరి మాతగా కొలుస్తుంటారు. శాకంబరి మాతను దర్శించుకుంటే కరువు కాటకాలు తొలగి, సుఖసంతోషాలు కలుగుతాయని వేదపురాణాల వచనం ప్రకారం ఈ ఉత్సవాలను దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఓ వికె శీనా నాయక్, పాలకమండలి, అధికారులు ఉత్సవ పత్రికను ఆవిష్కరించారు. అలాగే ఈనెల 15 నుండి ఆగస్టు 12 వరకు దుర్గమ్మ ఆలయంలో ఆషాఢమాస ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు.

**పలు తీర్మానాల ఆమోదం:** పాలక మండలి సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదించినట్లు ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. దుర్గమ్మ ఆలయంలో 2లక్షల లీటర్ల సామర్ధ్యంతో వాటర్‌ట్యాంక్ నిర్మాణం, పైపు లైన్ ఏర్పాటుకోసం తీర్మానం ఆమోదించారు. ఆలయంలో వినియోగిస్తున్న మారుతి అంబులెన్స్ వేలంలో హెచ్చుపాటపాడిన తాడేపల్లికి చెందిన గౌరిశంకర్ మోహన్‌రావుకు పాట ఆమోదించారు. దేవస్థానంలో పలు ఆదాయ వ్యయాల వివరాలను పాలకమండలి సమావేశంలో ఆమోదించారు. రు.3,25,000 అంచనాలతో పోరంకి వేదపాఠశాలలో బోరు వేయుటకు ఆమోదం తెలిపారు. దేవస్థానంకు కొత్త సెక్యూరిటీ ఏజెన్సీ టటెండరు పిలుచుటకు ఆమోదం తెలిపారు. రు.3,75,000ల అంచనాతో సింగ్‌నగర్‌లో వున్న 1.98సెంట్ల దేవస్థాన భూమిలో బోరు వేయుటకు ఆమోదం, సివిరెడ్డి గెస్ట్‌హౌస్, మాడపాటి గెస్ట్‌హౌస్‌లో సమగ్ర వర్షపునీటి సంరక్షణకు రు.40లక్షలతో వ్యవస్థ ఏఆర్పాటుకు ఆమోదం, కొత్త క్యూలైన్ల ఫ్రేమ్‌ల టెండర్ ఆమోదం, కేశఖండనశాల నిర్వహణకు టెండరు ఆమోదం, మహామండపం లిఫ్టులు, నిత్యాన్నదాన భవనం వద్ద ఆర్‌సిసి డ్రైన్ ఏర్పాటుకు టెండర్లు ఆమోదం, శ్రీ అమ్మవారికి భక్తులందించిన వడిబియ్యం, దసరా, భవానీ దీక్షలకు వచ్చు ఇరుముడి బియ్యం కొనుగోలుకు లైసెన్సు టెండర్ ఆమోదం, రు.40లక్షలతో కొండపై షామియానాలు, కార్పెట్లు సప్లయ్ చేయడానికి టెండర్ ఆమోదం తెలిపారు.

**భక్తుల విరాళాలు:** దుర్గమ్మ భక్తులు మంగళవారం మొత్తం నలుగురు విరాళాలు అందించారు. నిత్యాన్నదాన పథకానికి మంగళవారం విజయవాడకు చెందిన పోతిన బెసి కంటేశ్వరుడు, నిర్మలాదేవి దంపతులు మరియు కుమారులు పోతిన దుర్గ వెంకటేష్ పోతిన బాల వర్ధన్‌లు రు.1,00,016ల విరాళం ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణకు అందించారు. విజయవాడకు చెందిన జగదీశ్వరి, కూతురు ప్రత్యూష వారి అల్లుడు రవీంద్ర పేరున అమ్మవారి నిత్య అన్నదాన విభాగమునకు రూ.2లక్షల విరాళము అందించారు. శ్రీఅమ్మవారి ప్రతిరోజు ఉచిత ప్రసాదం విభాగమునకు గుంటూరు జిల్లా గోరంట్లకు చెందిన సానా శ్రీనివాసరావు రు.1లక్ష విరాళం అందించారు. నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన పి రవిచంద్ర, వారి కుటుంబ సభ్యులు రు.1లక్ష విరాళం అందించారు. దాతలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు అనంతరం వారికి దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

## జనసేన పార్టీలో చేరిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు గుడిపాటి సీతారాం, భార్య, యువ గాయని శ్రీలలిత




**విజయవాడ, జులై 7 ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు గుడిపాటి సీతారాం జనసేన పార్టీలో చేరారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సీతారాం భార్య, యువ గాయని శ్రీలలిత కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుడిపాటి సీతారాం మాట్లాడుతూ, పవన్ కల్యాణ్ ఖిదేశమే ప్రథమంఖి అనే దృక్పథంతో పనిచేస్తున్నారని, ఆయన నాయకత్వ స్ఫూర్తితోనే తాను జనసేనలో చేరాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు, పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. గుడిపాటి ఫౌండేషన్ ఛైర్మన్‌గా సీతారాం క్రీడలు, యువజన అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారు.

రాష్ట్రస్థాయిలో బ్యాడ్మింటన్ టోర్నమెంట్లు నిర్వహిస్తూ క్రీడా రంగంలో తనదైన గుర్తింపు పొందారు. ఆయన చేరికతో కృష్ణా జిల్లాలో జనసేన పార్టీకి క్రీడా, వ్యాపార వర్గాల నుంచి మరింత మద్దతు లభిస్తుందని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. సీతారాం పార్టీలో చేరడం పట్ల జనసేన శ్రేణులు, సోషల్ మీడియా వేదికగా అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## తిరుపతిలో శరభయ్య విగ్రహం ప్రతిష్టిస్తాం

- టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గొల్ల నరసింహ యాదవ్



**తిరుపతి (హెల్త్), జులై 7 ప్రభాతవార్త:** తిరుపతిలో సన్నిధి గొల్ల శరభయ్య యాదవ్ విగ్రహం తిరుమలలో ఏర్పాటు చేయాలనే నినాదంతో యాదవు లంతా మీటింగులు, ర్యాలీలు నిర్వహించడం జరిగిందని, యాదవులంతా ఒకతాటిపై రావడం గర్వకారణమని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ అన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ భారతదేశ వ్యాప్తంగా ఉన్న యాదవుల మనోభావాలకు సంబంధించి యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ అయిన 17.4.2025 విజయవాడలో జరిగిన మొదటి సమావేశంలోనే తిరుమలలో శరభయ్య యాదవ్ విగ్రహం పెట్టాలని, శరభయ్య యాదవ్ పేరుపైన మఠం ఏర్పాటు చేయాలని, తిరుమలలో బోర్డు మీటింగ్ ఏర్పాటు చేసి తిరుమలలో ఒక్క వీధికి శరభయ్య యాదవ్ పేరు నామకరణం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. తిరుపతిలో నిర్మిస్తున్న యాదవ్ భవన్ నిర్మాణానికి యువతకు అందరూ సహాయ సహకారాలు అందించాలన్నారు. తిరుపతి ప్రశాంతతను దెబ్బ తీసే విధంగా వైసీపీ నాయకులు కుట్రలు చేస్తుందన్నారని ఆరోపించారు.

## ప్రభుత్వం వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే

# రావణ్ అరెస్ట్ డ్రామా



**నెల్లూరు(వైద్యం), జులై 7 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే రావణ్ అరెస్ట్ డ్రామా ఆడుతున్నారని, ఉపా చట్టం ప్రయోగంపై దేశవ్యాప్తంగా భారీ వ్యతిరేకతను చూపుస్తున్నారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం నెల్లూరులోని వైయస్సార్సీపీ కార్యా లయంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్‌కు పరాకాష్ట రావణ్ అరెస్ట్ చేసారని శాంతిభద్రతల వైఫల్యాలు, కస్టో డియల్ డెత్స్ నుంచి డైవర్షన్ పాలిటిక్స్ కూటమి ప్రభుత్వం కొత్త డ్రామాలకు తెరలేపారన్నారు. రావణ్ వ్యాఖ్యలతో మా పార్టీకి ఎలాంటి సంబంధం లేదు కానీ ఉపా చట్టం ప్రయోగించడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి శాంతిభద్రతలు పూర్తిగా కుప్పకూలిపోయాయని, పోలీస్ స్టేషన్లలో లాకప్ డెత్‌లు, శవాల మాయం వంటి అరాచకాలు రాజ్యమేలుతున్నాయని గోవర్ధన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సాయికృష్ణ, క్రాంతి కుమార్ వంటి బాధితుల కస్టోడియల్ మరణాలపై తాము చట్టాన్ని, పోలీసు వ్యవస్థను ప్రశ్నిస్తుంటే, ఆ పరిపాలనా వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకు చంద్రబాబు నాయుడు అత్యంత చాకచక్యంగా డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని గోవర్ధన్ రెడ్డి మండిపడ్డారు.

## కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టే వ్యక్తులను ప్రోత్సహిస్తారా జగన్

**నెల్లూరు, జులై 7 ప్రభాతవార్త:** హిందూ ధర్మానికి, దేవుళ్ళకు అవమానం జరిగితే స్పందించాల్సిన బాధ్యత సాటి భారతీయుడిగా తనకు ఉందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. ఈరోజు హిందువులపై మాట్లాడాడు, రేపు క్రిస్టియన్, ముస్లింలపై మాట్లాడడని మీరు గ్యారెంటీ ఇస్తారా జగన్ రెడ్డి? హిందూ దేవుళ్లపై, సనాతన ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తులను మీరు ఎలా సమర్థిస్తారు? అని ప్రశ్నించారు. ప్రజా జీవితంలో జగన్ రెడ్డి కొనసాగాలంటే కోట్లాదిమంది భారతీయులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తాను ఎమ్మెల్యేగా కాకుండా ఓ సామాన్య భారతీయుడుగా మాట్లాడు తున్నా, తాను భారతీయుడిని, హిందువుని. పరామతా లతో కలిసి నడిచే ధర్మం హిందూ ధర్మం నేర్పింది. అన్ని కులాలు, మతాలను గౌరవించే వ్యక్తిని నేను. మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసినప్పుడు మాట్లాడా. క్రిస్టియన్‌లకి అండగా ఉన్నా. హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వ్యక్తులకు జగన్ మద్దతు ఇస్తుంటే మాట్లాడాల్సి వస్తున్నదని పేర్కొన్నారు. హిందూ మత విశ్వాసలపై మాటల దాడులు చేస్తున్న జోసఫ్ ప్రశ్న రావణ్‌ని ఎలా సమర్థిస్తారు జగన్ రెడ్డి అని నిలదీశారు. దేవుళ్ళని నమ్మడం, నమ్మకపోవడం వారి ఇష్టం. దేవుళ్ళని తిట్టే అధికారం మీకు ఎవరు ఇచ్చారు. జోసఫ్ ప్రశ్న రావణ్ మాట్లాడిన మాటలు విన్నారా. రాముడిని, రామా యణాన్ని, మహా భారతాన్ని జోసఫ్ రావన్ మాట్లాడిన మాటలు విని జగన్ రెడ్డి ఎలా సమర్థిస్తారు. కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి నిలదీశారు.

## కొడుకును హత్య చేసి.. తండ్రి ఆత్మహత్య

**కంభం (అర్ధవీడు), జులై 7 ప్రభాతవార్త:** ఇంట్లో మంచంపై నిద్రిస్తున్న కొడుకును మద్యం మత్తులో ఉన్న తండ్రి హత్య చేసి, అనంతరం తాను ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మార్కాపురం జిల్లా అర్ధవీడు మండలం మిట్టమీదపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు మిట్టమీదిపల్లె గ్రామానికి చెందిన పఠాన్ శిలార్ (55)కు గ్రామంలో చిన్న, చిన్న పనులు చేసుకుంటూ మద్యానికి బానిస అయ్యాడు. పెద్ద కుమారుడు ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తూ చేస్తుండగా, తల్లి రోజు కూలికి వెళ్లి వచ్చిన సొమ్ముతో కుటుంబాన్ని పోషిస్తున్నారు. చిన్న కుమారుడు పఠాన్ జావేద్ (25) ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రయత్నం చేసి వయస్సు మీరడంతో ఏ పని చేయక ఖాళీగా ఉంటుండగా ఈ విషయంలో తండ్రి, కొడుకుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. మూడు రోజుల క్రితం తండ్రీ, కొడుకుల మధ్య వివాదం జరిగినట్లు తెలిసింది. కాగా మంగళవారం పఠాన్ జావిద్ ఇంట్లో మంచంపై నిద్రిస్తుండగా మద్యం సేవించి ఇంటికి వచ్చిన తండ్రి పటాన్ శిలార్ కోపంతో ఇంట్లో ఉన్న క్రికెట్ బ్యాట్‌తో కుమారుడు జావీద్ తలపై బలంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడిన జావేదును కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు దృవీకరించారు. ఈ విషయం తెలిసిన తండ్రి పఠాన్ శిలార్ ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగింది. విషయం తెలుసుకున్న కంభం సీఐ మల్లికార్జున, అర్ధవీడు ఎస్ఐ నాంచారయ్యలు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## జగన్ మా నాయకుడు.. అసత్య ప్రచారం నమ్మొద్దు: మాజీ ఎంపి మేకపాటి



**నెల్లూరు(వైద్యం), జులై 7 ప్రభాతవార్త:** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆశయ సాధనకు కట్టుబడి ఉన్నామని, ఆయన వారసత్వాన్ని పునికిపుచ్చుకున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డితోనే మా పయనం.. ఎన్ని అపోహలు సృష్టించిన.. మా నాయకుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి అని మాజీ పార్లమెంట్ సభ్యుడు మేకపాటి రాజమోహన్ రెడ్డి పేర్కొన్నారు. తాను అనారోగ్యం కారణంగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనలేకపోతున్న అంతే తప్ప ఎలాంటి అపోహలకు తావు లేదని ఆయన స్పష్టం చేశారు. తాము పార్టీ మారుతున్నామని వస్తున్న వార్తల్లో నిజం లేదని మంగళవారం రాజమోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇలాంటి సత్యదూర ప్రచారాన్ని ప్రజలు, తమ అభిమానులు నమ్మవద్దని సూచించారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి పట్ల ప్రజల్లో సంపూర్ణ నమ్మకం, విశ్వాసం ఉందని, రాష్ట్ర భవిష్యత్తు ఆయనతోనేనని.. జగన్ వెంట నడవడం తాము అదృష్టంగా భావిస్తున్నామని.. త్వరలోనే ప్రజా పోరాటానికి శ్రీకారం చుడతామని రాజమోహన్ రెడ్డి వెల్లడించారు. తమను సంప్రదించకుండా నిరాధార ప్రచారం చేయడం పట్ల ఆయన తీవ్రంగా ఖండించారు. మేకపాటి కుటుంబం ఇప్పటికీ ఎప్పటికీ.. జగన్ వెంటే నడుస్తుందని తెలిపారు.

# రొనాల్డో కల చెదిరె.. పోర్చుగల్ కథ ముగిసె

## అమెరికా ఖేల్ ఖతమ్ * క్వార్టర్ ఫైనల్లో స్పెయిన్, బెల్జియం



పోర్చుగల్ జీరో
క్రిస్టియానో రొనాల్డో

**డల్లాస్, జులై 7:** సాకర్ ప్రపంచకప్‌లో మరో సంచలనం నమోదైంది. యూరోపియన్ ఛాంపియన్ స్పెయిన్ ఏకైక గోల్‌తో హాట్ ఫేవరెట్ పోర్చుగల్‌ను ఓడించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. చివరి నిమిషాల్లో సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన మికేల్ మెరినో అద్భుత గోల్‌తో పోర్చుగల్ కథ ముగిసింది. దీంతో కప్పు కల నెరవేరకుండా ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో ప్రపంచకప్ వీడాడు. తన కెరీర్‌లో చివరి ప్రపంచకప్‌కు కన్నీటితో వీడ్కోలు పలికాడు. ఆరు ప్రపంచకప్ ఎడిషన్ల పాటు సాగిన రొనాల్డో సుదీర్ఘ ప్రస్థానానికి తెరపడింది.

మ్యాచ్ ఆరంభం నుంచే పోర్చుగల్, స్పెయిన్ మధ్య మైండ్ గేమ్ ప్రారంభమైంది. 4వ నిమిషంలోనే స్పెయిన్ ఫార్వర్డ్ అమికేల్ ఓయర్జబాల్ గోల్ ప్రయత్నాన్ని పోర్చుగల్ గోల్ కీపర్ డియోగో కోస్టా అడ్డుకున్నాడు. కాసేపటికే పెడ్రో నెటో రైట్ వింగ్ నుంచి ఇచ్చిన అద్భుతమైన క్రాస్‌ను ఫెలిక్స్ అడ్డుకుని రొనాల్డో వైపు మళ్లించాడు. రొనాల్డో గాల్లోనే బంతిని హుక్ చేస్తూ గోల్ వైపు కొట్టగా స్పెయిన్ గోల్ కీపర్ అద్భుతంగా అడ్డుకున్నాడు. తొలి అర్ధభాగం ముగిసేసరికి ఇరు జట్లు 0–0తో సమంగా నిలిచాయి.

### పోర్చుగల్ బ్యాడ్‌లక్

రెండో అర్ధభాగంలో స్పెయిన్ ఆటగాడు దాని ఓల్మో ఫౌల్ చేయడంతో పోర్చుగల్‌కు ఫ్రీకిక్ లభించింది. అయితే బ్రూనో ఫెర్నాండెజ్ కొట్టిన షాట్ నేరుగా కీపర్ సిమోన్ చేతుల్లోకి వెళ్ళింది. 59వ నిమిషంలో రొనాల్డోకు మరో సువర్ణావకాశం లభించింది. జోవా ఫెలిక్స్ డిఫెండర్లను దాటుకుంటూ బంతిని బ్యాక్ పోస్ట్ వైపు చిప్ చేశాడు. రొనాల్డో అక్కడ షాట్ కొట్టడానికి ప్రయత్నించాడు, కానీ బంతి అతని కాలికి సరిగ్గా కనెక్ట్ కాకపోవడంతో వైడ్‌గా వెళ్లింది.

### ఇంజ్యూరీ టైమ్‌లో సబ్‌స్టిట్యూట్ల మ్యాజిక్

ఇక ఇంజ్యూరీ టైమ్ ప్రారంభమైన కొన్ని సెకన్లలోనే స్పెయిన్ మేనేజర్ వ్యూహాత్మకంగా మైదానంలోకి పంపిన సబ్‌స్టిట్యూట్ ఆటగాళ్లు అద్భుతం చేశారు. స్పెయిన్ ఆటగాడు ఫాబియన్ రూయిజ్ బంతిని సబ్‌స్టిట్యూట్ ఆటగాడు ఫెర్రాన్ టోరెస్ వైపు పంపాడు. టోరెస్ చాలా తెలివిగా బంతిని బాక్స్‌లో ఉన్న మరో సబ్‌స్టిట్యూట్ మికేల్ మెరినోకు పాస్ చేశాడు. మెరినో ఎలాంటి పొరపాటు చేయకుండా, బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపాడు. ఈ గోల్‌తో స్పెయిన్ 1–0 ఆధిక్యంలోకి దూసుకెళ్లడమే కాకుండా పోర్చుగల్ ఆశలపై నీళ్లు చల్లింది..

### ముగిసిన అతిథ్యదేశాల ఆట

ఫిఫా ప్రపంచకప్‌కు అతిథ్యమిస్తున్న దేశాల ఆట ముగిసింది. ప్రిక్వార్టర్ ఫైనల్ చేరిన కెనడా, మెక్సికో ఇప్పటికే ఓటములతో నిష్క్రమించగా, తాజాగా అమెరికా కూడా అదే దారి పట్టింది. సహ అతిథ్య దేశం అమెరికాపై బెల్జియం 4-1 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు చేరింది.

### ఆరంభం నుంచే బెల్జియం ఆధిక్యం

మ్యాచ్ ప్రారంభం నుంచే బెల్జియం ఆధిపత్యం చెలాయించింది. 9వ నిమిషంలో చార్లెస్ డి కెటెలారే గోల్ చేసి బెల్జియంకు తొలి ఆధిక్యం అందించాడు. 31వ నిమిషంలో మాలిక్ టిలమన్ ఫ్రీ కిక్ ద్వారా అద్భుత గోల్ చేసి అమెరికాను 1–1తో సమవుజ్జీగా నిలిపాడు. అయితే అమెరికా ఆనందం ఎంతో సేపు నిలవలేదు. కేవలం రెండు నిమిషాలకే బెల్జియం మరో గోల్ చేసి మళ్లీ ఆధిక్యంలోకి వెళ్లింది.

### కొనసాగిన అమెరికా తప్పిదాలు

రెండో అర్ధభాగంలో కూడా అమెరికా తప్పిదాలు కొనసాగాయి. 57వ నిమిషంలో గోల్‌కీపర్ మ్యాట్ ఫ్రీస్ పెనాల్టీ ప్రాంతం బయటకు వచ్చి లాంగ్ బాల్‌ను అందుకునే ప్రయత్నంలో బంతిని కోల్పోవడంతో హాన్స్ వానాకెన్ ఖాళీ గోల్‌లోకి సులభంగా బంతిని పంపించాడు. అదనపు సమయంలో లుకాకు మరో గోల్ చేయడంతో బెల్జియం 4-1తో మ్యాచ్‌ను ముగించింది. ప్రపంచకప్‌లో ముందంజ వేసింది. క్వార్టర్‌ఫైనల్లో స్పెయిన్‌తో తలపడనుంది.


స్పెయిన్ హీరో
మికెల్ మెరినో

# వింబుల్డన్ సెమీస్‌లో సినర్, కోకో గాఫ్

**లండన్, జులై 7:** వింబుల్డన్ పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ నెంబర్‌వన్ జానిక్ సినర్, మహిళల సింగిల్స్‌లో కోకో గాఫ్ సెమీఫైనల్స్ ప్రవేశించారు. జపాన్ డాల్ నయోమి ఓసాకా క్వార్టర్ ఫైనల్లోనే వెనుదిరిగింది. క్వార్టర్ ఫైనల్లో సినర్...జాన్‌లెన్నార్డ్ స్ట్రఫ్ యొక్క అద్భుతమైన ప్రయాణానికి ముగింపు పలికాడు. మూడు సెట్ల పోరులో 7-5, 7-6, 6-3తో గెలుపొందాడు. నాలుగుసార్లు గ్రాండ్ స్లామ్ ఛాంపియన్ సినర్ శక్తివంతమైన సర్వ్‌లతో విరుచుకుపడి స్ట్రఫ్‌ను కట్టడి చేశాడు. దీంతో అతను తన 10వ గ్రాండ్ స్లామ్ సెమీఫైనల్‌కు, వింబుల్డన్‌లో మూడో సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. మహిళల సింగిల్స్‌లో కోకో గాఫ్ 4-6, 6-3, 6-3తో తోటి అమెరికన్ జెస్సికా పెగులాపై గెలిచి మొదటిసారి వింబుల్డన్ సెమీఫైనల్‌కు చేరుకుంది. సెంటర్ కోర్టులో జరిగిన ఈ ఆల్‌అమెరికన్ పోరులో తొలి సెట్ ఓడినా ఆ తర్వాత పుంజుకుని వరుసగా రెండు సెట్లను కైవసం చేసుకుంది.

### క్వార్టర్ ఫైనల్లో అలెగ్జాండర్ జ్వెరెవ్

రెండు రోజుల పాటు సాగిన పురుషుల నాలుగో రౌండ్‌లో రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ 6-4. 7-5, 3-6, 7-6తో 14వ సీడ్ జిరి లెహెకాపై నెగ్గి తొలిసారిగా వింబుల్డన్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. జ్వెరెవ్ 6-4, 7-5, 3-3తో ఆధిక్యంలో ఉన్నపుడు చీకటి కారణంగా ఆటను నిలిపివేశారు. మంగళవారం తిరిగి ప్రారంభమైనప్పుడు లెహెకా పుంజుకున్నప్పటికీ, జ్వెరెవ్ దూకుడు చూపి నెగ్గాడు.







# మెస్సీ మ్యాజిక్: క్వార్టర్స్‌లో అర్జెంటీనా

**న్యూయార్క్, జులై 7:** డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా వరుసగా రెండో కప్ అందుకునే దిశగా క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఈజిప్ట్‌తో జరిగిన ప్రి క్వార్టర్ ఫైనల్లో మెస్సీ మ్యాజిక్ చేశాడు. ఓటమి ఖాయమనుకున్న దశ నుంచి అర్జెంటీనాను గెలుపు తీరాలపై నిలిపాడు. 3-2 గోల్స్ తేడాతో విజయాన్ని అందించాడు. మ్యాచ్ ఆరంభంలోనే ఈజిప్ట్ ఆధిక్యం చాటి ఝలక్ ఇచ్చింది. 15వ నిమిషంలో యాసర్ ఇబ్రహీం హెడర్‌తో గోల్ సాధించాడు. దీంతో తొలి అర్ధభాగం ముగిసేసరికి ఈజిప్ట్ 1-0 ఆధిక్యంతో నిలిచింది. రెండో అర్ధభాగంలో మరో గోల్ చేసింది. 67వ నిమిషంలో ముస్తాఫా జికో గోల్ చేసి ఈజిప్ట్ ఆధిక్యాన్ని 2-0కు చేర్చాడు. ఇక మ్యాచ్ చివరి దశకు చేరుకుంటున్న దశలో మెస్సీ మ్యాజిక్ చేశాడు. నాలుగు నిమిషాల్లో రెండు గోల్స్ సాధించడంలో కీ రోల్ పోషించాడు. 79వ నిమిషంలో మెస్సీ అందించిన పాస్‌ను రొమెరో గోల్‌గా మలచగా, 83వ నిమిషంలో స్వయంగా మెస్సీ గోల్ సాధించాడు. ఈ ప్రపంచకప్‌లో మెస్సీకి ఇది ఎనిమిదో గోల్. కాగా ఇంజ్యూరీ టైమ్ ఆరంభంలో ఎంజో ఫెర్నాండెజ్ చేసి గోల్‌తో అర్జెంటీనా విజయం ఖాయమైంది. తొలిసారి క్వార్టర్ ఫైనల్ చేరాలన్న ఈజిప్ట్ ఆశలపై నీళ్లు చల్లింది.

# కోహ్లీతో క్రికెట్ ఆడాలనుంది: జొకోవిచ్

**లండన్, జులై 7:** మిస్టర్ ఛేజర్ విరాట్ కోహ్లీపై సెర్బియా టెన్నిస్ దిగ్గజం నోవాక్ జొకోవిచ్ అభిమానాన్ని చాటుకున్నాడు. ప్రస్తుతం వింబుల్డన్ ఆడుతున్న జొకోవిచ్... గొప్ప బ్యాటింగ్ యోధుడు విరాట్ కోహ్లీతో కలిసి క్రికెట్, టెన్నిస్ ఆడాలని ఉందని జియో స్టార్‌తో మాట్లాడుతూ చెప్పాడు. త్వరలో భారత్‌ను సందర్శించేందుకు ప్లాన్ చేస్తున్నానని, ఇప్పటికే కోహ్లీతో మాట్లాడినట్లు చెప్పుకొచ్చాడు. విరాట్ ఓ గ్లోబల్ స్టార్, అతను భారత్‌లో అద్భుతమైన ఆటగాడు. కోహ్లీ తనకు అతిథ్యమిచ్చి, దేశమంతా తిప్పి చూపిస్తే బాగుంటుంది. అతనిపైనా, భారత్ క్రికెట్‌పైనా తనకు చాలా గౌరవం ఉందని జొకోవిచ్ పేర్కొన్నాడు. సెర్బియాలో క్రికెట్‌కు అంత ప్రాధాన్యం లేదని, అయితే ఇంగ్లాండ్ టెన్నిస్ ప్లేయర్ల నుంచి క్రికెట్ గురించి తెలుసుకున్నట్లు చెప్పాడు. గత వింబుల్డన్‌లో తన భార్య బాలీవుడ్ నటి అనుష్కశర్మతో కలిసి కోహ్లీ... జొకోవిచ్ మ్యాచ్‌ను వీక్షించాడు. ఎంత అద్భుతమైన మ్యాచ్. గ్లాడియేటర్ జొకోవిచ్‌కు ఇది మామూలు విషయమేనని కోహ్లీ పోస్ట్ చేశాడు.





# పసిడి తాకట్టు రుణాలు 3.29లక్షల కోట్లు

**న్యూఢిల్లీ, జులై 7:** ప్రైవేటు నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థల్లో బంగారు ఆభరణాల తాకట్టుపై మంజూరు చేసిన రుణాలు ఈ ఏడాది మే నెలలో దాదాపు 70శాతం పెరిగి అన్ని రుణ విభాగాల్లోనే అత్యంత భారీ వృద్ధిని నమోదు చేసినట్లు రిజర్వు బ్యాంకు మంగళవారం విడుదల చేసిన నివేదికలో ప్రస్తావించింది.




2026మే నెలాఖరు నాటికి బంగారు ఆభరణాల తాకట్టుపై ఎన్‌బీఎఫ్‌సీలు ఇచ్చిన రుణాలు రూ.3.29 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే సమయంలో ఇవి రూ.1.94 లక్షల కోట్లుగా ఉండగా, ఏడాది వ్యవధిలో 69.9 శాతం వృద్ధి నమోదైంది. రిటైల్ రుణాల విభాగంలో గృహ రుణాలు, వాహన రుణాలు, బంగారం తాకట్టు రుణాలు గణనీయమైన వృద్ధిని నమోదు చేశాయి. దీంతో మొత్తం రిటైల్ రుణాల వృద్ధి 2026 మేలో వార్షిక ప్రాతిపదికన 19.5 శాతానికి చేరుకుంది. గత ఏడాది ఇదే నెలలో ఈవృద్ధి 14.9 శాతంగా నమోదైంది. బంగారం రుణాల తర్వాత వాణిజ్య రంగానికి ఎన్‌బీఎఫ్‌సీలు అందించిన రుణాల బకాయిలు రెండో స్థానంలో నిలిచాయి. గత ఏడాది మేలో రూ.85,317 కోట్లుగా ఉండగా, 2026 మే నాటికి రూ.1.19 లక్షల కోట్లకు పెరిగి 40.2శాతం వార్షిక వృద్ధిని నమోదు చేశాయి. వ్యవసాయం, అనుబంధ రంగాలకు అందించిన రుణాల వృద్ధి కూడా బలంగానే కొనసాగింది. ఈ విభాగంలో రుణాలు 2026 మేలో వార్షిక ప్రాతిపదికన 17.9 శాతం పెరిగాయి. గత ఏడాది ఇదే నెలలో నమోదైన 5 శాతం వృద్ధితో పోలిస్తే ఇది గణనీయమైన పెరుగుదల. పారిశ్రామిక రంగానికి రుణాల వృద్ధి కొంత మందగించింది. 2025 మేలో 10 శాతంగా ఉన్న పారిశ్రామిక రుణాల వృద్ధి 2026 మేలో 7.3 శాతానికి తగ్గింది. ముఖ్యంగా మౌలిక వనరుల రంగానికి రుణాల వృద్ధి మందగించడం ఇందుకు ప్రధాన కారణమని ఆర్‌బీఐ తెలిపింది.

2025 మేలో 23.9 శాతంగా నమోదైన సేవల రంగ రుణాల వృద్ధి, 2026 మేలో 16.7 శాతానికి పరిమితమైంది.

# లాభాల స్వీకరణతో వరుస నాలుగు రోజుల ర్యాలీకి బ్రేక్

**ముంబయి, జులై 7:** దేశీయ ఈక్విటీ మార్కెట్లలో వరుసగా 4 రోజులుగా కొనసాగిన ర్యాలీకి మంగళవారం బ్రేక్ పడింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు రావడంతో పెట్టుబడిదారులు లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. విస్తృత స్థాయిలో అమ్మకాల ఒత్తిడి నెలకొని నిఫ్టీ 24,400 స్థాయి దిగువన ముగిసింది. మెటల్, రియాల్టీ రంగ షేర్లు భారీగా నష్టపోగా, ఐటీ, ఎఫ్ఎంసీజీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగాలకు చెందిన షేర్లు లాభాల్లో నిలిచాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 104.35 పాయింట్లు తగ్గి 78,180.72 వద్ద ముగిసింది. నిఫ్టీ50 సూచీ 31.65 పాయింటు క్షీణించి 24,398.70వద్ద స్థిరపడింది. నాలుగు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2.34 శాతం, నిఫ్టీ 2.35 శాతం చొప్పున లాభపడిన విషయం గమనార్హం. నిఫ్టీపై అత్యధిక ఒత్తిడి తీసుకొచ్చిన షేర్లలో ట్రెంట్ 12.64శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్1.23శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 1.04 శాతం చొప్పున క్షీణించాయి.

విస్తృత మార్కెట్ కూడా ప్రధాన సూచీల కంటే బలహీనంగా ప్రదర్శించింది. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.18 శాతం తగ్గగా, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.76శాతం పడిపోయింది. ఎన్ఎస్ఈలో మార్కెట్ వెడల్పు ప్రతికూలంగా నమోదైంది. మొత్తం 1,191 షేర్లు లాభపడగా, 2,084 షేర్లు నష్టపోయాయి. మరో 109 షేర్లు మార్పులేకుండా ముగిశాయి. సమీప కాలంలో మార్కెట్ అస్థిరతను సూచించే ఇండియా వీఐఎక్స్ సూచీ 1.43 శాతం తగ్గి 11.65 వద్దకు చేరింది. విదేశీ మారక మార్కెట్లో రూపాయి డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలపడింది. రూపాయి విలువ94.95 వద్ద ట్రేడవగా, గత ముగింపు 95.43గా నమోదైంది.




ఆగస్టు 5, 2026 డెలివరీకి సంబంధించిన ఎంసీఎక్స్ బంగారం ఫ్యూచర్స్ ధర 1.02 శాతం తగ్గి రూ.1,45,414కు చేరింది. కమోడిటీ మార్కెట్లో సెప్టెంబర్ 2026 డెలివరీ బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు 81 సెంట్లు (1.13 శాతం) పెరిగి 72.80 డాలర్లకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్లుఅమెరికా ఫెడరల్ రిజర్వ్ తాజా ద్రవ్య విధాన సమావేశ మినిట్స్‌తో పాటు కీలక ఆర్థిక గణాంకాల విడుదలకు ముందు జాగ్రత్త ధోరణి కొనసాగడంతో యూరప్ మార్కెట్లు స్వల్ప లాభాలతో ముగిశాయి. ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ సమావేశ మినిట్స్ కోసం వేచి చూసిన ఆసియా మార్కెట్లు మాత్రం నష్టాల్లో ముగిశాయి. ప్రధాన కార్పొరేట్ పరిణామాలుతొలి త్రైమాసిక ఆదాయ వృద్ధి మార్కెట్ అంచనాలకు తగ్గడంతో ట్రెంట్ షేరు 12.64 శాతం క్షీణించింది. టైటాన్ కంపెనీ తొలి త్రైమాసికంలో వినియోగదారుల వ్యాపారం 41 శాతం వృద్ధి నమోదు చేయడంతో షేరు 2.38 శాతం పెరిగింది. దేశీయ యాజమాన్యం 50 శాతాన్ని దాటినట్లు ప్రకటించడంతో స్విగ్గీ షేరు 7.17 శాతం ఎగిసింది.

తొలి త్రైమాసిక బిల్లింగ్స్ రూ.737 కోట్లకు చేరి 14.4 శాతం వృద్ధి నమోదు చేయడంతో ఇన్ఫో ఎడ్జ్ ఇండియా షేరు 12.95 శాతం లాభపడింది. ప్రీమియం హౌసింగ్ ప్రాజెక్టులకు బలమైన డిమాండ్ కారణంగా టీఏఆర్‌సీ షేరు 1.74 శాతం పెరిగింది. జూబిలెంట్ ఫుడ్‌వర్క్స్ షేరు 3.98 శాతం లాభపడింది. వరుణ్ బేవరేజెస్ షేరు 2.19 శాతం తగ్గింది. టెక్స్‌మాకో రైల్ అండ్ ఇంజినీరింగ్ షేరు 2.02 శాతం క్షీణించింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి రూ.166.82 కోట్ల బొగ్గు గ్యాస్ ఉత్పత్తి సేవల ఆర్డర్ పొందడంతో సౌత్ వెస్ట్ పిన్నాకిల్ ఎక్స్‌ప్లోరేషన్ షేరు 2.45 శాతం పెరిగింది. తొలి త్రైమాసికంలో ఆదాయం 41 శాతం పెరిగినప్పటికీ పి ఎన్ గాడ్గిల్ జ్యువెలర్స్ షేరు 2.20 శాతం తగ్గింది. రిటైల్ ఆదాయం 56 శాతం పెరిగి మొత్తం ఆదాయంలో 78 శాతం వాటాను అందుకుంది. ఫ్రాక్టల్ అనలిటిక్స్ షేరు 2.97 శాతం క్షీణించింది. వివిధ విభాగాల్లో కలిపి రూ.239.61 కోట్ల విలువైన కొత్త ఆర్డర్లు పొందినట్లు కేపీ గ్రీన్ ఇంజినీరింగ్ ప్రకటించింది. సోలార్ ప్రాజెక్టులు, క్రాష్ బ్యారియర్లు, ఆర్ఎస్‌జే పోల్స్, ప్రీఇంజినీర్డ్ భవనాలు, ట్రాన్స్‌మిషన్ టవర్ల ప్రాజెక్టులు పొందినా షేరు 2.12 శాతం తగ్గింది.

# ఐదేళ్లలో 1 లక్ష కోట్ల ఆదాయం
## 10వేల కోట్ల లాభం టార్గెట్: టాటా పవర్




**ముంబయి, జులై 7:** విద్యుత్ రంగంలోని ప్రముఖ సంస్థ టాటా పవర్ వచ్చే ఐదేళ్లలో లక్ష కోట్ల ఆదాయం, రూ.10వేల కోట్ల నికర లాభాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంగళవారం ప్రకటించింది. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, పునరుత్పాదక ఇంధనాలు, తయారీ విభాగాల్లో విస్తరణ ద్వారా ఈ లక్ష్యాలను చేరుకోవాలని సంస్థ భావిస్తోంది. కంపెనీ వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం)లో ప్రశ్నోత్తరాల సందర్భంగా టాటా పవర్ చైర్మన్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ, ఐదేళ్లలో రూ.10,000 కోట్ల లాభం, రూ.1 లక్ష కోట్ల ఆదాయాన్ని సాధించాలన్నది సంస్థ లక్ష్యమని, నివాస, వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులు పరిశుభ్రమైన, హరిత ఇంధన పరిష్కారాలకు మారేలా ఎనర్జీ యాజ్ ఎ సర్వీస్ విధానాన్ని టాటా పవర్ ముందుండి అమలు చేస్తుందని తెలిపారు. సౌర పరికరాల తయారీ సామర్థ్యాన్ని మరింత పెంచే దిశగా ఒడిశాలో కొత్తగా 10 గిగావాట్ల సామర్థ్యంతో సౌర తయారీ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నట్లు కూడా చంద్రశేఖరన్ వెల్లడించారు.

ప్రస్తుతం తమిళనాడులోని తిరునెల్వేలిలో టాటా పవర్‌కు 4.3 గిగావాట్ల సౌర సెల్స్, మాడ్యూల్ తయారీ సామర్థ్యం ఉంది. బెంగళూరు యూనిట్‌తో కలిపి సంస్థ మొత్తం తయారీ సామర్థ్యం 4.9 గిగావాట్లకు చేరుకుంది. సౌర తయారీతో పాటు ఇంగాట్లు, వేఫర్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని కూడా ఒడిశాలోని కొత్త 10 గిగావాట్ల ప్రాజెక్టు ద్వారా పెంచాలని కంపెనీ ప్రణాళిక రూపొందించింది. విద్యుత్ పంపిణీ రంగంలో ప్రైవేటీకరణ చేపట్టే రాష్ట్రాల్లో అవకాశాలు లభిస్తే తమ పంపిణీ కార్యకలాపాలను కూడా విస్తరించేందుకు టాటా పవర్ సిద్ధంగా ఉందని చంద్రశేఖరన్ తెలిపారు. ఇప్పటివరకు కంపెనీ 2.5 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను ప్రారంభించినట్లు వెల్లడించారు.

# గ్లోబల్ మార్కెట్లలో స్థిరంగా ముడిచమురు ధరలు

**న్యూఢిల్లీ, జులై 7:** అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు మంగళవారం స్థిరంగా కొనసాగాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 72 డాలర్లకు పైగా నిలిస్తే అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ ముడిచమురు ధర బ్యారెల్‌కు 69డాలర్ల సమీపంలో ట్రేడైంది. యుద్ధ ప్రభావం పూర్తిగా తగ్గిన చమురుధరలు అమెరికా, ఇరాన్ మధ్య తాత్కాలిక శాంతి ఒప్పందం కుదరడంతో మధ్యప్రాచ్య చమురు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్న భయాలు తగ్గాయి. దీంతో రెండో త్రైమాసికంలో అంతర్జాతీయ ముడి చమురు ధరలు సుమారు 30 శాతం మేర పడిపోయాయి. యుద్ధ భయాల కారణంగా చమురు ధరల్లో ఏర్పడిన అదనపు పెరుగుదల దాదాపు పూర్తిగా కరిగిపోయిందని మార్కెట్ నిపుణుల అంచనా. రాబోయే నెలల్లో ప్రపంచ మార్కెట్లో ముడి చమురు అధిక సరఫరా పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని గోల్డ్‌మన్ సాక్స్, మోర్గాన్ స్టాన్లీ వంటి ప్రముఖ అంతర్జాతీయ పెట్టుబడి బ్యాంకులు హెచ్చరిస్తున్నాయి.



ఈ ఆందోళనలకు మరింత బలం చేకూరుస్తూ సౌదీ అరాంకో ఆసియా కొనుగోలుదారుల కోసం ప్రధాన అరబ్‌లైట్ క్రూడ్ ధరను వచ్చే నెలకు బ్యారెల్‌కు 11 డాలర్లు తగ్గించింది. ప్రాంతీయ బెంచ్‌మార్క్‌తో పోలిస్తే బ్యారెల్‌కు 1.5డాలర్ల డిస్కౌంట్‌పై విక్రయించనున్నట్లు ప్రకటించింది. గతంలో 2020, 2015లో జరిగిన అంతర్జాతీయ చమురు ధరల యుద్ధాల సమయంలో మాత్రమే ఈ గ్రేడ్‌ను డిస్కౌంట్‌పై విక్రయించారు. సౌదీ అరేబియాతో పాటు ఒపెక్ ప్లస్ సభ్యదేశాలు వచ్చే నెలనుంచి ఉత్పత్తి కోటాలను పెంచాలని నిర్ణయించాయి. అదనపు ఉత్పత్తి వెంటనే మార్కెట్‌లోకి రాకపోయినా, పరిస్థితులు సాధారణ స్థితికి చేరుతున్న నేపథ్యంలో సరఫరాను పెంచే దిశగా అడుగులు వేస్తున్నట్లు ఈ నిర్ణయం సూచిస్తోంది. ఇదిలా ఉంటే అమెరికా ఇంధన మార్కెట్ సమాచార సంస్థ డేటా ప్రకారం 2027 నాటికి అమెరికా ముడి చమురు ఉత్పత్తి అంచనాను రోజుకు అదనంగా 2.20 లక్షల బ్యారెళ్ల మేర పెంచి 1.383 కోట్ల బ్యారెళ్లకు సవరించింది.

# ఆరు నెలల్లోనే ఐటి కంపెనీల్లో 1.19 లక్షల మందికి లేఆఫ్




**న్యూఢిల్లీ, జులై 7:** ప్రపంచవ్యాప్తంగా టెక్ రంగంలో ఉద్యోగాల కోతలుఏమాత్రం తగ్గడం లేదు. తమ వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగా టెక్ కంపెనీలు ఉద్యోగులను తొలగించడాన్ని తీవ్రం చేశాయి. తాజా గణాంకాల ప్రకారం 2026 సంవత్సరపు మొదటి ఆరు నెలల కాలంలోనే వివిధ టెక్ కంపెనీలలో దాదాపు 1.19లక్షలమందికి పైగా ఉద్యోగాలు కోల్పోయారు. ఈ లేఆఫ్స్ పర్వం ఐటీ పరిశ్రమలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళనను రేకెత్తిస్తోంది. గత కొన్ని సంవత్సరాలుగా సాగుతున్న ఉద్యోగాల తొలగింపు ప్రక్రియతో పోలిస్తే, 2026 మొదటి అర్ధ భాగంలో ఈ సంఖ్య మరింత పెరిగినట్లు మార్కెట్ డేటా స్పష్టం చేస్తోంది. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే లేఆఫ్స్ తీవ్రత ఈ ఏడాది గణనీయంగా పెరిగింది. పెద్ద పెద్ద టెక్ దిగ్గజాల నుండి చిన్న స్థాయి స్టార్టప్‌ల వరకు అనేక కంపెనీలు తమ వ్యాపార పునర్వ్యవస్థీకరణ, వ్యయాలను తగ్గించుకోవడం, మారుతున్న మార్కెట్ డిమాండ్లకు అనుగుణంగా మారే ప్రక్రియలో భాగంగా ఈ కఠిన నిర్ణయాలు తీసుకున్నాయి.

# కల్ట్.ఫిట్ ఐపీఓకు సెబీకి దరఖాస్తు
## నాలుగు వేల కోట్ల సమీకరణ లక్ష్యం




**ముంబయి, జులై 7:** ఫిట్‌నెస్ సేవలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రముఖ ఫిట్‌నెస్, వెల్‌నెస్ సంస్థ కల్ట్ ఫిట్ ఐపిఒకోసం సెబీకి డిఆర్‌హెచ్‌పి దాఖలుచేసింది. ఐపీఓ ద్వారా కంపెనీ ఈక్విటీ షేర్ల జారీచేసి సుమారు రూ.950 కోట్ల వరకు నిధులను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆఫర్ ఫర్ సేల్‌తో కలిపి మొత్తం ఐపీఓ పరిమాణం రూ.4,000 కోట్ల వరకు ఉండే అవకాశం ఉందని మార్కెట్ నిపుణుల అంచనా. ఐపీఓలో ప్రస్తుత పెట్టుబడిదారులైన టీమ్‌సెక్, ఫిట్‌నెస్ ఫస్ట్ లక్సెంబర్గ్, చిరాటే వెంచర్స్, టాటా డిజిటల్, యాక్సెల్ ఇండియా, కలారి క్యాపిటల్, ఫ్రోడర్స్ క్యాపిటల్ తదితర సంస్థలు కలిపి 17.86 కోట్ల షేర్ల వరకు విక్రయించనున్నాయి.

ఒక్కో ఈక్విటీ షేరు ముఖ విలువ రూ.1గా నిర్ణయించారు కంపెనీ సహ వ్యవస్థాపకుడు ముకేష్ బన్సాల్, ఏంజెల్ ఇన్వెస్టర్ బ్రూనో రాష్లే, ప్రముఖ సినీ నటుడు హృతిక్ రోషన్‌లు తమ వాటాలోని కొంత భాగాన్ని ఈ ఐపీఓలో విక్రయించనున్నారు. షేర్లు విక్రయించే ఇతర వాటాదారుల్లో ఏషియన్ పెయింట్స్ ప్రమోటర్ డోలీ ట్రేడింగ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్, సన్ ఎన్ సాండ్ హోటల్స్, ఎండియా పార్ట్‌నర్స్ వ్యవస్థాపకుడు సతీష్ ఆంధ్రా, మాజీ మింత్రా సీఈఓ అనంత్ నారాయణన్ కుటుంబ ట్రస్ట్, హృతిక్ రోషన్ పెట్టుబడి సంస్థ ఎక్స్‌ట్రీమ్ బ్రాండ్స్ ఉన్నాయి. కల్ట్.ఫిట్‌లో మాక్‌రిచీ ఇన్వెస్ట్‌మెంట్స్ అత్యధికంగా 20.3 శాతం వాటాను కలిగి ఉంది. తర్వాత యాక్సెల్‌కు 13.5 శాతం, సహ వ్యవస్థాపకుడు ముకేష్ బన్సాల్‌కు 8.4శాతం, కలారి క్యాపిటల్‌కు 7.8, ఎటర్నల్ వద్ద 4.9, టాటా డిజిటల్ వద్ద 3.6 శాతం వాటాలున్నాయి. ఐపీఓ ద్వారా సమీకరించే నిధులను కంపెనీ రుణాల చెల్లింపు, కల్ట్ ఎలైట్, కల్ట్ నియో ఫిట్‌నెస్ సెంటర్ల విస్తరణ, కొత్త కల్ట్‌స్పోర్ట్ రిటైల్ స్టోర్ల ఏర్పాటు, లీజ్ చెల్లింపులు, మార్కెటింగ్ కార్యక్రమాల కోసం వినియోగించనుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం | బుధవారం 08 జూలై 2026 | I

# చిన్నారి జ్ఞానేశ్వరి కేసులో దర్యాప్తు కొనసాగుతుంది



- బిడ్డను తల్లి వద్దకు చేర్చడమే పోలీసుల లక్ష్యం
- చిన్నారి ఆచూకీ తెలియజేసిన వారిపై ఎటువంటి కేసులు ఉండవు
- సోషల్ మీడియాలో వచ్చే వదంతులు నమ్మవద్దు
- పెద్దాపురం డీఎస్పీ తిలక్

తుని, జూలై 7,( ప్రభాతవార్త ) తుని మండలం దొండవాక పంచాయతీ పరిధిలోని సిహెచ్ అగ్రహారానికి చెందిన చిన్నారి జ్ఞానేశ్వరి మిస్సింగ్ కేసు పై పోలీసుల దర్యాప్తు కొనసాగుతుందని పెద్దాపురం డీఎస్పీ తిలక్ అన్నారు. తుని మండలం సిహెచ్ అగ్రహారంలో డీఎస్పీ తిలక్,తుని రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. చెన్నకేశవరావు, ఎస్సై కృష్ణమాచారి తో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారి జ్ఞానేశ్వరిని తల్లి వద్దకు చేర్చడమే లక్ష్యంగా పోలీసులు పని చేస్తున్నారన్నారు. చిన్నారి ఆచూకీ తెలిసినవారు పోలీసులకు సమాచారం అందిస్తే వారిపై ఎటువంటి కేసులు ఉండవని సంచలన ప్రకటన చేశారు. చిన్నారి జ్ఞానేశ్వరి కేసు పై పక్కా సమాచారంతో మీడియాలో వార్తలు ప్రచురించాలని, అసత్య కథనాల వలన కేసు పురోగతిపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. కేసులో పురోగతి సాధించేందుకు మీడియా సహకరించాలని కోరారు.

## ఉపాధి కూలీల ఆక్రందన : 'సౌకర్యాల్లేవు..

### సొంత పనులకేమో మా శ్రమ కావాలా?"



రౌతులపూడి. (ప్రభ త వార్త) రెక్కాడితే గాని డొక్కాడని పేదలకు అండగా ఉండాల్సిన ఉపాధి హామీ పథకం.. రౌతులపూడి మండలంలో కొందరు అధికారులు, మేట్ల అరాచకాలకు వేదికగా మారింది. ఒకవైపు భానుడి భగభగలకు కూలీలు అల్లాడిపోతుంటే, కనీసం మంచినీళ్లు, నీడ కల్పించాల్సిన బాధ్యతను అధికారులు పూర్తిగా గాలికి వదిలేశారు. దీనికి తోడు క్షేత్రస్థాయిలో జరుగుతున్న దొడ్డిదారి ఉపాధి కూలీలను మరింత కుంగదీస్తున్నాయి.ఎండ తీవ్రతకు అల్లాడుతున్న కూలీలు ప్రస్తుతం ఎండలు ముదురుతున్న తరుణంలో, ఉపాధి పనుల వద్ద కనీస రక్షణ కరువైంది. గతంలో ఎండల తీవ్రతను తట్టుకోవడానికి టెంట్లు లేదా పరదాలు (షేడ్స్) ఏర్పాటు చేసేవారు. దాహార్తిని తీర్చడానికి మజ్జిగ, చల్లటి మంచినీళ్లు ఇచ్చేవారు. పారపోటుల గాయాలైతే ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉండేవి. కానీ, నేడు రౌతులపూడి మండలంలో ఈ సదుపాయాలన్నీ మృగ్యమయ్యాయి.ఇంటి నుంచి తెచ్చుకున్న నీళ్లు గంటలో వేడెక్కిపోతున్నాయి. ఎండ దెబ్బకు సొమ్మసిల్లిపోతున్నా పట్టించుకునే నాథుడే లేడు. కనీసం గాయపడితే కట్టుకట్టడానికి ఒక్క పట్టీ కూడా పని స్థలంలో ఉండటం లేదు."

**'ఫీల్డ్ అసిస్టెంట్ల' సొంత కొలువులో కూలీలు**

రౌతులపూడి మండలంలో ఉపాధి హామీ చట్టం పక్కదారి పట్టించడానికి కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రయత్నే నిదర్శనం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెరువులు, కాలువల పనులు చేయించాల్సిన వీరు.. కూలీలను తమ సొంత పనులకు, వ్యక్తిగత పొలాల్లో పనులకు వాడుకుంటున్నారనే సంచలన నిజాలు బయటపడుతున్నాయి. ప్రభుత్వ జీతాలు తీసుకుంటూ, కూలీల శ్రమను తమ సొంత స్వార్థానికి వాడుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వినకపోతే మస్టర్ కట్..లేదా తమకు రావలసిన కనీస సదుపాయాల గురించి ప్రశ్నించినా కూలీలపై కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారు.మేము చెప్పినట్టు వింటేనే ఇక్కడ పని ఉంటుంది.ఎక్కువ మాట్లాడితే మస్టర్ (హాజరు) తీసేస్తాం. రేపటి నుంచి పనికి రావద్దు, అంటూ బెదిరింపులతో కూలీల నోళ్లు నొక్కేస్తున్నారని,బతుకుదెరువు భయంతో చాలామంది మౌనంగా భరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**నిధులు ఏమయ్యాయి?**

ప్రభుత్వం ఉపాధి హామీ సదుపాయాల కోసం కేటాయిస్తున్న నిధులు ఎవరి జేబుల్లోకి వెళు తున్నాయనే దానిపై సమగ్ర విచారణ జరగాలి.మండలంలో వెంటనే ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని ప్రజలు కోరారు.

## ఆరేళ్ల కాపురం తర్వాత మోసం చేశాడంటూ పాస్టర్‌పై మహిళ ఫిర్యాదు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూలై7,ప్రభాతవార్త. అంబేద్కర్ కోనసీమ జిల్లా ముక్కామలకు చెందిన చర్చి పాస్టర్ కుంచె సురేష్‌బాబు అలియాస్ మనోహర్ తనను ప్రేమించి వివాహం చేసుకుని ఆరు సంవత్సరాలు కాపురం చేసిన అనంతరం ఇప్పుడు వదిలించుకోవాలని ప్రయత్నిస్తున్నాడని బాధితురాలు ఆరోపించారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం, ముక్కామలలో చర్చి నిర్వహిస్తున్న సమయంలో తనతో పరిచయం పెంచుకుని, ప్రేమ పేరుతో గౌరీపట్నంలో వివాహం చేసుకున్నాడని పేర్కొన్నారు. అనంతరం తమ వివాహ విషయాన్ని రహస్యంగా ఉంచుతూ, ఎవరికైనా చెబితే తన ప్రతిష్ట భంగం కలుగుతుందని చెప్పి ఆరు సంవత్సరాలు కాపురం చేశాడని ఆరోపించారు. ఇప్పుడు మాత్రం తనను భార్యగా అంగీకరించడం లేదని, వేధింపులకు గురిచేస్తున్నాడని ఆమె వాపోయారు. అంతేకాకుండా, తన కుటుంబ సభ్యులతో కలిసి తన సంసారాన్ని పాడు చేశారని ఆరోపించారు. అలాగే పాస్టర్‌కు తన వదినతో అక్రమ సంబంధం ఉందని తనకు తెలిసిన తర్వాత తనపై కక్ష పెంచుకుని వేధింపులకు పాల్పడ్డాడని కూడా ఆమె ఆరోపించారు. ఈ వ్యవహారంపై బాధితురాలు అమలాపురం టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, తనకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు.


## జూలై 31న జిల్లా కలెక్టర్ కార్యాలయల వద్ద ఆందోళన

### ఆశా వర్కర్ ల సమస్య ల పరిష్కారమే లక్ష్యం.



చింతూరు జూలై 26 ప్రభాత వార్త. రాష్ట్రవ్యాప్తంగా పని చేస్తున్న ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 31వ తేదీన అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయల వద్ద ఆందోళన చేపట్టాలని సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. చింతూరు మండలంలోని మూడు పీహెచ్సి లు ఏడుగురాళ్లపల్లి. తులసిపాక. మోతుగూడెంల పరిధిలో పని చేస్తున్న ఆశ వర్కర్లతో మంగళవారం ఆశా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సిఐటియు పోలవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ. సిఐటియూ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈనెల 31 న జరిగే కలెక్టరేట్ ధర్నా కార్యక్రమానికి ఆశ వర్కర్లందరూ పాల్గొనాలని అన్నారు. 2026 మార్చి 5న ప్రభుత్వం ఇచ్చిన హామీలు సర్కులర్స్. జీవోలు విడుదల చేయాలని . ఆశ కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు కనీస వేతనం రూ 26000 చెల్లించాలని,పర్మినెంట్ చేయాలి అన్ని రకాల సెలవులు. మట్టి ఖర్చులు ఇవ్వాలని. పని భారాన్ని తగ్గించాలని,నియమాక లు ప్రభుత్వమే చేపట్టాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని . పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆశల సంఖ్యను పెంచాలని,ఏఎన్ఎం జీఎన్ఎమ్ శిక్షణ పొందిన ఆశలకు పర్మనెంట్ పోస్టులు భర్తీలో ప్రాధ్యాన్యత కల్పించాలని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని . ఆశ వర్కర్ సమస్యలపై చలో విజయవాడ సందర్భంగా ప్రభుత్వం యూనియన్ ప్రతినిధులతో చర్చలు జరిపి హామీలు ఇచ్చిందని . వేతనాలు పెంపు మరియు ఇతర డిమాండ్స్ త్వరలో పరిష్కారం చేస్తామని మినిట్స్ కాపీ అందజేశారని,నాలుగు నెలలు దాటినప్పటికీ నేటికీ సమస్యలు పరిష్కారం పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నదని,ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని తక్షణమే వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ. ఈ నెల 31న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్స్ వద్ద స్కీమ్ వర్కర్ ధర్నాల్లో ఆశ వర్కర్స్ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల కో కన్వీనర్ కారం సుబ్బారావు. గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్. సిఐటియూ మండల కమిటీ సభ్యులు. చింత రాంబాబు. ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షులు రవ్వ వీరమ్మ. మండల అధ్యక్షులు మడకం శ్రీదేవి. దుర్గ. ముత్తమ్మ. కాంతమ్మ. తదితరులు పాల్గొన్నారు.

## బాధితునికి వైసిపి నేత రమణారావు ఆర్థిక సాయం



ఉప్పలగుప్తం,జూలై7,ప్రభాతవార్త. ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి పంచాయతీ మట్లచెరువుకు చెందిన వజ్రపు నాగరాజు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు.నాగరాజును అతని ఇంటి వద్ద మంగళవారం అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు,గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచె రమణారావు పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను నాగరాజును రమణారావు అడిగి తెలుసుకుని చికిత్స నిమిత్తం ఆర్థిక సాయం అందజేసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో మాజీ సర్పంచ్ నక్కా సంపత్ కుమార్,వైసిపి మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజ్,వైసిపి నాయకులు బీర బాలరాజు, నేలపూడి సుగంధ కుమార్,పందిరి సుబ్బరాజు,నేరేడుమిల్లి శ్రీను,ముత్తాబత్తుల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ ముసుగు లో కుల మతాల మధ్య

# విధ్వంసాలు సృష్టిస్తే సహించేది లేదు

### పంతం నానాజీ హెచ్చరిక



కాకినాడ రూరల్, జూలై 7,(ప్రభాతవార్త): రాష్ట్రంలో కులమతాల మధ్య విధ్వంసాలు సృష్టిస్తే సహించేది లేదని, వైసిపి ముసుగులో కుట్రలు చేస్తే ఏరి పారేస్తాం అని కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ హెచ్చరించారు. కాకినాడ రూరల్ జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనసేన పార్టీ ఆశయాలు సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీ బలోపేతం కోసం మరింత బాధ్యతతో ఆంధ్రప్రదేశ్‌లో జనసేన పార్టీ రెండో అధ్యాయం మొదలైందని, పార్టీ బలోపేతానికి ఇప్పటికే 35 వేల మంది జనసేన పార్టీ నిర్మాణ సారధుల నుండి దరఖాస్తులు స్వీకరించామని కాకినాడ రూరల్ ఎమ్మెల్యేపంతం నానాజీ వెల్లడించారు. ప్రజల సంపూర్ణ ఆమోదంతోనే నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, దీనిని జీర్ణించుకోలేక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సరికొత్త కుట్రలకు తెరలేపుతోందని మండిపడ్డారు. జర్నలిజం ముసుగులో, సోషల్ మీడియా వేదికగా దేశంలో ఉగ్రవాదాన్ని రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్న శక్తుల వెనుక తాడేపల్లి హస్తం ఉందని , దేశద్రోహానికి పాల్పడిన రావణ్ ను అరెస్టు చేస్తే ఖైదీ నెంబర్ 6093 జగన్ రెడ్డి ఎందుకు మద్దతిస్తున్నారని నానాజీ ప్రశ్నించారు. గతంలో ఇతర రాష్ట్రాల్లో జరిగే కుట్ర రాజకీయాలను ఇప్పుడు జగన్ మోహన్ రెడ్డి ఆంధ్రాలో మొదలుపెట్టించారని నానాజీ ధ్వజమెత్తారు. "బచ్చలకూరి జోసఫ్ అనే వ్యక్తి 'రావణ్' అనే పేరు పెట్టుకుని జర్నలిజం ముసుగులో సమాజాన్ని, జర్నలిస్టులను అపహాస్యం చేస్తున్నాడని,దేశంలో కుట్రలు చేయడానికి ప్రయత్నిస్తున్న ఈ సైతాన్‌కు మద్దతుగా జగన్ మోహన్ రెడ్డి 'హే రామ్' అంటూ పోస్ట్ పెట్టడం అత్యంత విచిత్రం. హిందూ ధర్మాన్ని అవహేళన చేసిన వ్యక్తికి జగన్ ఎలా సపోర్ట్ చేస్తారు?" అని ప్రశ్నించారు. ఈ 'రావణ్' అనే వ్యక్తిని కేవలం నాలుగు పోలీస్ స్టేషన్లు తిప్పితే అతని వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరో బయటపడతారని, ఈ కుట్రల వెనుక తాడేపల్లి ప్యాలెస్ హస్తం స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు. జాడ శ్రావణ్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముసుగులో మాట్లాడుతున్నారని, అంతగా మోజు ఉంటే ముసుగు తీసినేరుగా ఆ పార్టీలోనే చేరిపోవాలని సవాల్ విసిరారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సీఎం ఎప్పుడు అవ్వాలనేది ప్రజలు నిర్ణయిస్తారని ఎమ్మెల్యే నానాజీ స్పష్టం చేశారు. ప్రజలు ఎప్పుడు ఏ బాధ్యత ఇస్తే అప్పుడు దాన్ని నిర్వర్తించడానికి ఆయన సిద్ధంగా ఉంటారని, దీనికి వైసీపీ నేతలు ఎందుకు కింద మీద పడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి అర్జీకి త్వరిత పరిష్కారం:మంత్రి సుభాష్



రామచంద్రపురం,జూలై 07 (ప్రభాతవార్త): ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామచంద్రపురంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో 36 వినతులను స్వీకరించి, సంబంధిత అధికారులకు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.పింఛన్లు,రేషన్ కార్డులు,రోడ్లు,డ్రైనేజీ తదితర సమస్యలపై ప్రజలు వినతులు అందజేశారు.ప్రతి అర్జీని పరిశీలించి త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,కూటమి నాయకులు,అధికారులు పాల్గొన్నారు.

## తాటి ఉత్పత్తుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ

**నీరా, తాటి బెల్లానికి ప్రోత్సాహం -- కల్లుగీత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం- మంత్రి కొల్లు రవీంద్ర**





పోలవరం జిల్లా ప్రతినిధి జులై 6 ప్రభాత వార్త. రాష్ట్రంలోని తాటి ఉత్పత్తుల అభివృద్ధికి ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ చేపడుతోందని రాష్ట్ర గనులు, భూగర్భశాఖ మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మంగళవారం రంపచోడవరం మండలం పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన నీరా ప్రోత్సాహం – – తాటి ఉత్పత్తుల అభివృద్ధి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్ సిహెచ్ . శ్రీధర్, రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ, పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, రంపచోడవరం శాసనసభ్యులు లెజిస్లేటివ్ చైర్మన్ మిరియాల శిరీష దేవి, ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ ధనుంజయ, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కె. సత్తిబాబు, గౌడ కార్పొరేషన్ చైర్మన్ కె. గురుమూర్తి, పెరికల సంఘం చైర్మన్ వి. వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలోని కల్లుగీత కార్మికుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. తాడి బోర్డు ఏర్పాటు కోసం ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. మడ అడవుల్లో తాడి చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించడంతో పాటు, తాటి కల్లును నీరాగా, తాటి బెల్లంగా విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చే కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అరకు కాఫీకి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వచ్చినట్లే, నీరాకు కూడా ప్రత్యేక బ్రాండ్ గుర్తింపు తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. నీరా ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే సహజ పానీయమని, ప్రజల్లో దీనిపై విస్తృత అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రాన్ని 1986లో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు ఏర్పాటు చేశారని మంత్రి గుర్తు చేశారు. నిడదవోలు ఉద్యాన పరిశోధన కేంద్రంలో సంప్రదాయ పద్ధతిలో తాటి బెల్లం తయారీ జరుగుతుండగా, పందిరిమామిడి కేంద్రంలో ఆధునిక సాంకేతికతతో తయారీ చేపడుతున్నట్లు తెలిపారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందని, కల్లుగీత కార్మికుల జీవనోపాధి మెరుగుపడేలా అన్ని విధాలా సహకరిస్తామని స్పష్టం చేశారు. పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ మాట్లాడుతూ పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం, ఉద్యాన పరిశోధన కేంద్రం జిల్లాకు ఎంతో విలువైన ఆస్తులని అన్నారు. ఆరోగ్యకరమైన జీవన విధానంలో భాగంగా ప్రజలు పంచదారకు బదులుగా తాటి బెల్లం వినియోగించాలని సూచించారు. కల్లు నుంచి నీరా ఉత్పత్తిని పైలట్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేయడానికి చర్యలు చేపడుతున్నామని, జిల్లాలోని ప్రతి మండలంలో ఉన్న తాడి చెట్లపై సమగ్ర సర్వే నిర్వహించి, తాడి రైతులకు తాటి ఉత్పత్తులపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.శాసనసభ్యులు లెజిస్లేటివ్ చైర్మన్ మిరియాల శిరీష దేవి మాట్లాడుతూ కల్లుగీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. తాటి బెల్లం, నీరా వంటి ఉత్పత్తుల ప్రయోజనాలను ప్రజలకు మరింత చేరువ చేయాల్సిన అవసరం ఉందన్నారు. పోలవరం జిల్లాలో తాడి రైతులతో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించాలని సూచించారు. ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ ధనుంజయ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 300కు పైగా తాడి జాతులు ఉన్నాయని, వాటి ద్వారా అనేక విలువైన ఉత్పత్తులు తయారవుతున్నాయని తెలిపారు. ఉద్యాన పంటల అభివృద్ధికి విశ్వవిద్యాలయం ద్వారా వేలాది మందికి శిక్షణలు అందించామని, శాస్త్రీయ పరిశోధనలతో నాణ్యమైన ఉత్పత్తుల తయారీకి కృషి చేస్తున్నామని వివరించారు. శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కె. సత్తిబాబు మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల మాదిరిగానే ఆంధ్రప్రదేశ్‌లో కూడా కల్లుగీత కార్మికుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గీత కార్మికులకు 10 శాతం వైన్ షాపుల కేటాయింపు ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. గౌడ కార్పొరేషన్ చైర్మన్ కె. గురుమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో తాటి ఉత్పత్తులకు మంచి మార్కెట్ అవకాశాలు ఉన్నాయని, గీత కార్మికుల సంక్షేమం కోసం మరిన్ని చర్యలు చేపడతామని తెలిపారు. అనంతరం మంత్రి తాటి బెల్లం, నీరా, తాటి తాండ్ర, తాటి ముంజలు, తాటి పూలు, తాటి ఆధారిత పానీయాలు, తాటి ఆకులతో తయారైన హస్తకళా ఉత్పత్తుల ప్రదర్శన స్టాళ్లను పరిశీలించి, మార్కెటింగ్ అవకాశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. నీరా, తాటి బెల్లం తయారీ యంత్రాలను పరిశీలించి, ప్రజల్లో వాటి పోషక విలువలపై అవగాహన పెంచాలని సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రంలోని తాడి ప్లాంటేషన్‌ను సందర్శించి, తాడి సాగు విస్తరణ, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ ద్వారా కల్లుగీత కార్మికులు, తాడి రైతుల ఆదాయం పెరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ చైతన్య మురళి, ఈఎస్ శ్రీలత, ఏఈఎస్ సుబ్రమణ్యం, అసిస్టెంట్ కమిషనర్ ఎం. వినయ్ బాబు, ఓఎస్డీ జవాలీ ఆల్ఫాన్స్, రంపచోడవరం ఆర్డీఓ కె. స్వాతి, డీఎస్పీ అశ్రఫ్ అలీ, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు, కేవీకే కోఆర్డినేటర్ గోవర్ధన్, డాక్టర్ మమత, ఏపీఐఐసీ డైరెక్టర్ పెద్దిరాజు, మైనార్టీ డైరెక్టర్ షేక్ సుభాని, గౌడ డైరెక్టర్ వై. నారాయణ గౌడ్, మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు, శాస్త్రవేత్తలు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కల్లుగీత కార్మికులు, తాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ధవళేశ్వరం బ్యారేజీ పరిరక్షణే

# కూటమి ప్రభుత్వం లక్ష్యం

### మంత్రి నిమ్మల రామానాయుడు



రాజమహేంద్రవరం అర్బన్,జూలై7(ప్రభాతవార్త) ధవళేశ్వరం బ్యారేజీ పరిరక్షణే కూటమి ప్రభుత్వం లక్ష్యం అని రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు మంగళవారం ఆయన ధవళేశ్వరం బ్యారేజీ ని సందర్శించారు అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా తీసుకుని కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తోందని అన్నారు గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్రంలోని కీలక ప్రాజెక్టుల భద్రత దెబ్బతిందని విమర్శించారు. తుంగభద్ర ప్రాజెక్టు 19వ గేటు ప్రమాదం ఇందుకు ఉదాహరణ అని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గేటును పునర్నిర్మించి 80 టీఎంసీల నీటిని కాపాడగలిగిందని చెప్పారు. శ్రీశైలం ప్రాజెక్టు భద్రత కోసం రూ.250 కోట్ల నిధులు కేటాయించామని వెల్లడించారు. పించా, అన్నమయ్య ప్రాజెక్టుల ఘటనలు కూడా గత ప్రభుత్వ వైఫల్యాలకు నిదర్శనమని ఆరోపించారు. ధవళేశ్వరం బ్యారేజ్ గోదావరి జిల్లాలకు జీవనాడి లాంటిదని మంత్రి అన్నారు. నిపుణులు పలుమార్లు హెచ్చరించినా గత ప్రభుత్వం బ్యారేజ్ గేట్ల మార్పిడిపై దృష్టి పెట్టలేదని విమర్శించారు. ప్రస్తుతం బ్యారేజ్ ద్వారా సుమారు 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోందని, రైతుల ప్రయోజనాల దృష్ట్యా గేట్ల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. ధవళేశ్వరం బ్యారేజ్ గేట్ల ఆధునికీకరణ కోసం రూ.150 కోట్లను కేటాయించినట్లు మంత్రి తెలిపారు. 2015లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రూ.32 కోట్లతో 58 గేట్లను మార్చామని, ఇప్పుడు మిగిలిన 117 గేట్లను కూడా కొత్తవిగా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు త్వరలోనే శ్రీకారం చుడతారని చెప్పారు. ప్రాజెక్టుల పరిరక్షణ, ఆధునికీకరణ ద్వారా రైతుల సాగు, తాగునీటి అవసరాలను దీర్ఘకాలికంగా భద్రపరచడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.

## గిరిజనేతర నిర్వాసితుల పునరావాస స్థలం విషయంలో

# మారిన స్వరం

### అధికారుల తీరుపై నిర్వాసితుల ఆగ్రహం





వి.ఆర్.పురం,జూలై 7,ప్రభాతవార్త పోలవరం ప్రాజక్ట్ గిరిజనేతర నిర్వాసితుల పునరావాస స్థలం కల్పించే విషయంలో ప్రభుత్వ యంత్రాంగం స్వరం మారింది. గత ఏడాది చూపించిన స్థలం కాలనీల నిర్మాణం కోసం ఇవ్వటం కుదరదంటు, వేరే ప్రాంతంలో కల్పిస్తాం చూసుకోండని, ఏడాది తరువాత అధికారులు మాటమార్చి చెప్పటంతో, నిర్వాసిత గిరిజనేతరులు కంటతడి పెట్టారు. ఇందుకు సంబంధించి మండలంలోని రామవరం గ్రామ పంచాయతీ పరిధిలోని నిర్వాసితులు ఆరోపిస్తున్న ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రామవరం గ్రామ పంచాయతీ పరిధిలోని శబరిరాయిగూడెం, రామవరం, రామవరంపాడు, కొప్పల్లి, సోములుగూడెం, అడవివెంకన్నగూడెం గ్రామాలకు చెందిన 149 గిరిజనేతర కుటుంబాలకు పునరావాస కాలని కట్టించేందుకు, గత ఏడాది పశ్చిమ గోదావరి జిల్లా, తరువాయి వద్ద సర్వే నెంబర్ 119 లో 12 ఎకరాల 13 సెంట్ల భూమి చూపించారు. అప్పుడు ప్రభుత్వ అధికారులు స్వయంగా 2 బస్సుల్లో బాధిత నిర్వాసితులను అట్టి స్థలం చూపించటానికి తీసుకొని వెళ్ళారు. నిర్వాసితులు అట్టి స్థలం తమకు ఆమోగ్యమే అని చెప్పటంతో, ఎక్కడికక్కడ నిర్వాసితుల నుండి తీర్మాన(అంగీకార) పత్రం సైతం రాయించుకున్నారు. ఇదిలా ఉండగా మంగళవారం స్థానిక తహసీల్దార్ సంభందిత గ్రామాల నిర్వాసిత గిరిజనేతరులను తమ కార్యాలయానికి పిలిపించి, గత ఏడాది పునరావాస కాలనీ కోసం తాడువాయి గ్రామంలో చూపించిన స్థలం ఇవ్వటం కుదరని, దాని స్థానంలో కొయ్యలగూడెం వద్ద పెరికపాడి గ్రామంలో స్థలం కల్పిస్తాం వెళ్ళి చూసిరాండని చెప్పారు. దీంతో బాధిత గిరిజనేతర కుటుంబాలకు కన్నీరే మిగిలినట్లైంది.

**వన్ టైం సెటిల్ మెంట్ కుట్రలో భాగమే మాట మార్పు : సిపిఎం నేత రమేష్........**

గిరిజనేతర నిర్వాసితులకు ఇంటి స్థలాలు కల్పించి, కాలనీలు నిర్మించి ఇవ్వకుండా, వన్ టైం సెటిల్ మెంట్ (నగదు చెల్లించి) చేతులు దులుపు కోవాలనే కుట్రలో భాగమే ఏడాది తరువాత తాడువాయి స్థలం విషయంలో మాట మార్పు అని, సిపిఎం నాయకులు, బాధిత నిర్వాసితులు వడ్లాది రమేష్ ఆరోపిస్తున్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పోలవరం ప్రాజెక్టు వల్ల నిర్వాసితులగుతున్న నిర్వాసిత కుటుంబాలకు 27 రకాల మౌలికసదుపాయాలు కల్పించాల్సి ఉందన్నారు. అందులో అత్యంత ముఖ్యమైనది కోరుకున్న ప్రాంతంలో పునరావాస కాలనీలు కట్టించాల్సి ఉందని, ఆయన అధికారులకు ఈ సందర్భంగా గుర్తు చేశారు. గత ఏడాది తాడువాయి వద్ద అధికారులు స్వయంగా తమను పిలుసుకొని వెళ్ళి, స్థలం చూపించిన పాత చిత్రాన్ని సైతం పత్రికలకు అందించారు. పునరావాస కాలనీ విషయంలో అధికారులు తొలుత ఇచ్చిన మాట నిలబెట్టుకోవాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు.

# వరి పంటకు నీటి ఎద్దడి

### రైతుల ఆందోళన




ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద నీటిమట్టం తగ్గిపోవడంతో తేలుతున్న ఇసుక దిబ్బలు

అయినవిల్లి జూలై 7 ప్రభాతవార్త రానున్న ఖరీఫ్ పశీటకు నారుమళ్ళకు వరి నాట్లు వేసేందుకు నీటి యద్దడి ఏర్పడి రైతులు ఆందోళన చెందుతున్నారు ఇంతవరకు వర్షాలు లేకపోవడంతో తొలకరి సాగు పై సందేహాలు వ్యక్తమవుతున్నాయి ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద గోదావరి నీటిమట్టం పూర్తిగా తగ్గిపోయింది ఇంతవరకు గోదావరికి కలకనీరు తగలకపోవడం విశేషం ప్రతి సంవత్సరం వరదలు వచ్చేవి జూలై నెల ప్రవేశించి వారం రోజులు గడిచినా గోదావరికి నీరు తగలకపోవడం రైతుల్లో ఆందోళన నెలకొంది ప్రస్తుతం అయినవిల్లి మండలంలో వెలవలపల్లి చింతలంక నీదునూరు తదితర గ్రామాల్లో నారుమల్లు పోసిన దమ్ము చేయటానికి నీరు లేదని రైతులు తెలిపారు ఈ సంవత్సరం జూన్ 1 కాలువలకు నీరు వదిలినప్పటికీ కాలువల్లో పనులు కారణంగా జూలై నెల వరకు పూర్తిస్థాయిలో చివరి భాగానికి నీరు అందలేదు ఇంకా కొన్నిచోట్ల నారుమడులు వేసే దశలో రైతులు ఉన్నారు రైతులు నీరు లేక వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు ఇంతవరకు కనీసం 10 సెంటీమీటర్ల వర్షం కూడా పడలేదని రైతులు తెలిపారు ఈ సంవత్సరం మెట్ట రైతుల పరిస్థితి మరీ దైనియంగా ఉంది వర్షాలు లేక దిక్కు తోచని పరిస్థితి ఏర్పడింది

# పచ్చదనం పెంపునకు సీడ్ బాల్స్ దోహదం

### అటవీ శాఖ అధికారి నాగేశ్వరరావు



శంకవరం జులై 7 ప్రభాతవార్త పచ్చదనం పెంపునకు సీడ్ బాల్స్ ఎంతగానో దోహదపడతాయని మండల అటవీశాఖ అధికారి జి నాగేశ్వరరావు పేర్కొన్నారు జిల్లా అటవీ శాఖ అధికారి ఏలేశ్వరం రేంజర్ ఆదేశాల మేరకు సెక్షన్ పరిధిలో భౌరువాక బీటు మాసంపల్లి గ్రామ అటవీ ప్రాంతంలో వి ఎస్ ఎస్ చైర్మన్ వైస్ చైర్మన్ ల చేతుల మీదుగా సీడ్ బాల్స్ జల్లారు ఈ సందర్భంగా అటవీశాఖ అధికారి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ అటవీ శాఖ ఆధ్వర్యంలో సీడ్ బాల్స్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని అడవుల విస్తరణతో పాటు ఖాళీ భూముల్లో సహజంగా మొక్కలు పెరిగేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టమన్నారు స్థానిక వృక్ష జాతుల విత్తనాలతో తయారు చేసిన సీడ్ బాల్స్‌ను వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వివిధ ప్రాంతాల్లో జల్లడం జరుగుతుందని పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో ప్రతి ఒక్కరి పాత్ర ముఖ్యమని విత్తనాలను నాటే సంప్రదాయ పద్ధతులతో పోలిస్తే సీడ్ బాల్స్ ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంచే అవకాశం ఉంటుందని వివరించారు. రాబోయే వర్షాకాలంలో ఈ విత్తనాలు మొలకెత్తి కొత్త మొక్కలుగా ఎదిగి అడవుల అభివృద్ధికి తోడ్పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రకృతి సంరక్షణలో ప్రజలు చురుకుగా పాల్గొని పచ్చని భవిష్యత్తు నిర్మాణానికి సహకరించాలని ఈ సందర్భంగా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. వివిధ జాతుల 3496 బాల్స్ ను విస్తరించడం జరిగింది పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో బీట్ అధికారులు పీ సి హెచ్ బుల్లెమ్మ పి లావణ్య పి వెంకటరమణ సిబ్బంది శేఖర్ సురా సాహెబ్ స్థానిక నేతలు పాకల ప్రసాద్ మహేష్ తదితరులు పాల్గొన్నారు

# దేవుడికి అపచారం



రాజమహేంద్రవరం అర్బన్,జూలై7(ప్రభాత వార్త) పురాణ ప్రాధాన్యం కలిగిన స్వయంభూ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన ధవళేశ్వరం శ్రీ లక్ష్మీ జనార్ధన స్వామి ఆలయంలో అభివృద్ధి పనుల నేపథ్యంలో దేవతా విగ్రహాల నిర్వహణపై వివాదం నెలకొంది. ఆలయ అభివృద్ధి పనుల సందర్భంగా ఆర్చి (ప్రవేశ ద్వారం)పై ఉన్న కొన్ని విగ్రహాలను తొలగించగా, వాటి నిర్వహణ తీరుపై భక్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రాబోయే గోదావరి పుష్కరాల దృష్ట్యా ప్రభుత్వం ఆలయ అభివృద్ధి పనులను చేపట్టగా, ప్రారంభంలో ఈ చర్యలను భక్తులు స్వాగతించారు. అయితే, ధ్వంసమైన విగ్రహాలను శాస్త్రోక్తంగా పవిత్ర గోదావరి నదిలో నిమజ్జనం చేయకుండా ఆలయ ప్రాంగణంలోనే గత నెల రోజులుగా ఉంచడం సరైంది కాదని పలువురు భక్తులు ఆరోపిస్తున్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి పర్యవేక్షణ లోపం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని, దీనివల్ల దేవాలయ సంప్రదాయాలకు విఘాతం కలిగిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయ ఈవో పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండడం లేదని కూడా వారు విమర్శిస్తున్నారు ధ్వంసమైన విగ్రహాలను ఆగమశాస్త్రం ప్రకారం వెంటనే నిమజ్జనం చేసి, భక్తుల మనోభావాలను గౌరవించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

## అడ్డతీగల సంత రోజే రోడ్డు దిగ్బంధం

### తీవ్ర ఇబ్బందులు పడ్డ ప్రజలు





**అడ్డతీగల,జూలై 07, (ప్రభాతవార్త)** మంగళవారం అడ్డతీగల వారపు సంత జరిగే రోజున, వేటమామిడి సమీపంలో ఉన్న పైడి పుట్ట వద్ద ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా దాదాపు 2 గంటల పాటు రోడ్డు బ్లాక్ చేయడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ?సాధారణంగా ప్రజలకు అంతరాయం కలగకుండా రాత్రి సమయాల్లో చేయవలసిన పనులను,వందలాది మంది సంతకు వచ్చే పగటి పూట చేపట్టడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ రోడ్డు దిగ్బంధం వల్ల ఇరువైపులా వాహనాలు నిలిచిపోయి, చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చిన వ్యాపారులు, మహిళలు, వృద్ధులు ఎండలో గంటల తరబడి తీవ్ర ఇబ్బందులు పడ్డారు.అత్యవసర వైద్యం కోసం వెళ్లే రోగులకు కూడా తీవ్ర ఇబ్బంది పడాల్సి వచ్చింది. ప్రజా రవాణాకు తీవ్ర విఘాతం కలిగించిన ఈ సందర్భాన్ని బట్టి, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి పనులను రాత్రి సమయాల్లో మాత్రమే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## మైనర్ల డ్రైవింగ్‌పై కఠినచర్యలు

### ఆన్‌లైన్ నేరాలపై అప్రమత్తత



**అడ్డతీగల, జూలై 07, ప్రభాతవార్త** స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలో మంగళవారం వారపు సంతను పురస్కరించుకుని పోలీసుల ఆధ్వర్యంలో ప్రజలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ గజేంద్రకుమార్,స్థానిక ఎస్సై బి. వినోద్ నేతృత్వంలో సంతకు వచ్చిన చుట్టుపక్కల గ్రామస్తులకు మహిళా చట్టాలు, గంజాయి నష్టాలపై సుదీర్ఘంగా వివరించారు.ఈ సందర్భంగా సీఐ గజేంద్ర కుమార్ మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన శక్తి యాప్ ను ప్రతి ఒక్కరూ మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మైనారిటీ తీరని పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇస్తే జరిగే ప్రమాదాలకు, చట్టపరమైన చర్యలకు తల్లిదండ్రులదే పూర్తి బాధ్యత అని స్పష్టం చేశారు.?గంజాయి సాగు, రవాణా లేదా విక్రయాలకు సహకరిస్తే కఠిన చర్యలు ఉంటాయని, కేసుల్లో చిక్కుకుంటే కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయని హెచ్చరించారు. గంజాయి సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. అలాగే, పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీలు చెప్పి మోసపోవద్దని సూచించారు.రాత్రి వేళల్లో పశువులను రోడ్లపై వదిలివేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని,యజమానులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితో పాటు పరిసర గ్రామాల ప్రజలు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## అంగన్వాడీ భవనానికి మోక్షమెప్పుడో



**కాట్రేనికోన జూలై 07 (ప్రభాతవార్త )**

కాట్రేనికోన మండలం చెయ్యేరు అగ్రహారంలో అంగన్వాడి భవనం లేక చిన్నారులు ఇబ్బంది పడుతున్న పరిస్థితి నెలకొంది. ఇక్కడ నూతన అంగనవాడి భవనం నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో సుమారు మూడేళ్ల క్రితం అంగన్వాడి కేంద్రం భవన నిర్మాణ పనులు మొదలుపెట్టారు . పునాది దశకు వచ్చాక వివిధ కారణాలతో నిర్మాణం నిలిచింది . నాటి నుంచి నేటికి నిర్మాణం అదే స్థితి లో ఉంది. దాంతో ఈ కేంద్రాన్ని స్థానికంగా ఒక పెంకుటింటిలో నెలకు రూ.2 వేల చొప్పున అద్దెకి నిర్వహిస్తున్నారు. అయితే పెంకుటిల్లు పెంకులు పాడయ్యి శిధిలస్థితికి చేరడంతో రంధ్రాలు పడి వర్షం కురుస్తుంది. పైన బరకం కపినప్పటికీ అది మొత్తం పాడైంది. దాంతో చిన్నారులు వర్షానికి ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడింది. పెంకుటిల్లు శిథిల స్థితికి చేరడంతో వర్షాలు, ఈదురు గాలులు వీచినప్పుడు పెంకులు పిల్లల మీద పడే అవకాశం ఉందని తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇక్కడ నిర్మాణంలో నిలిచిన అంగన్వాడి భవనాన్ని పూర్తి చేయాలని స్థానికులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

## వైద్య సేవలపై వచ్చే ఐ. వి. ఆర్. ఎస్ ఫోన్ కాల్స్‌పై అవగాహనను కల్పించండి.. : డా. పావని



**రాజవొమ్మంగి, జూలై 07, ప్రభాతవార్త** ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా అందిస్తున్న వైద్య సేవలపై ప్రభుత్వం నుండి ప్రజలకు వచ్చే ఐ. వి. ఆర్. ఎస్. ఫోన్ కాల్స్ పై అవగాహనను కల్పించాలని ఆశ వర్కర్స్ జడ్డంగి పి. హెచ్. సి డా. పావని సూచించారు. మంగళవారం జడ్డంగి పి. హెచ్. సి లో ఆశ డే కార్యక్రమం డా. నాగార్జున అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా డా. పావని మాట్లాడుతూ ప్రసవ నమోదు, జనన నమోదు చేయాలన్నారు. వాతావరణ మార్పులు వల్ల వచ్చే జ్వరాలపై ప్రజలకు వివరించి ఆరోగ్య జాగ్రత్తలపై తెలుపాలన్నారు. దోమలు నివారణలో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు తెలుపాలన్నారు. మలేరియా, డెంగ్యూ వ్యాధుల లక్షణాలు, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. ఈకార్యక్రమంలో డా. నాగార్జున, డా. పావని, ఎం. పి. హెచ్. ఇ. ఓ. గొడుగు నాగవాసు, హెచ్. వి. లు భూముల వెంకటరమణ, నీలాద్రి లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్స్ శ్యామ్యూల్, పద్ధరాజు, రాజబాబు, ఎం. ఎల్. హెచ్. పిలు, ఏ. ఎన్. ఎం లు, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

## యవసాయ క్షేత్రంలో అన్నదాత మృతి..



**అంబాజీపేట, జూలై 7, (ప్రభాతవార్త):** వరి చేనుకు నీరు పెట్టేందుకు వెళ్లిన రైతుకు చేనులోనే ఆకస్మికంగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చిరతపూడి గ్రామానికి చెందిన కొమ్ముల వీరరాఘవులు (70) వరి చేనుకు నీరు పెట్టి దమ్ము చేయించేందుకు పొలం వెళ్లి అక్కడే కుప్పకూలి పడిపోయారన్నారు. చుట్టు పక్కల పొలం పనులు చేసుకునే వారు అపస్మారక స్థితిలో పడి ఉన్న వీర రాఘవులను గుర్తించి స్థానిక వైద్యునికి చూపించగా అప్పటికే మృతి చెందాడని తెలిపారన్నారు. వీరరాఘవులు అరటి పళ్లు అమ్ముకుంటూ, వ్యవసాయం చేసుకుంటున్నాడని స్థానికులు తెలిపారు.మృతుడికి ఇరువురు కుమారులు, కుమార్తె ఉన్నారు.

## మన బడి.. మన భవిష్యత్ లో మౌళిక సౌకర్యాలకు ప్రతిపాదనలు



**రాజవొమ్మంగి, జూలై 07, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలంలో మన బడి.. మనభవిష్యత్ లో భాగంగా మండలంలో కొనసాగుతున్న 8 మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో కావాల్సిన మౌళిక సౌకర్యాలపై ప్రతి పాదనలను పంపాలని ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాలను జారీ చేశారని రాజవొమ్మంగి మండల విద్యాధికారి కె. వి. వి. సత్యనారాయణ దొర అన్నారు. మంగళవారం చెరుకుంపాలెం ఎంపిపి మోడల్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాలకు కావాల్సిన సౌకర్యాలపై ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఎస్టిమేషన్ వేయించామన్నారు. బడదనాంపల్లి, రాజవొమ్మంగి, కింద్ర, లాగరాయి, దోనేలపాలెం, వంచంగి, దూసరపాము గ్రామ ఎంపిపి మోడల్ పాఠశాలలకు కూడా అదనపు గదులు, వరండాలు, పర్నీచర్, ఇలా అవసరమైన వాటిని సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ ఎస్టిమేషన్ వేస్తారన్నారు. ఆ ప్రతిపాదనలను ఉన్నతస్థాయి అధికారులకు పంపుతామన్నారు. కార్యక్రమంలో హెచ్. ఎం. బొంకు దొరబాబు, కోడూరి లోవరాజు, బుటారి చంటిబాబు, చోడి సత్యనారాయణ, సి ఆర్పీ చవల సతీష్ పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ...



**సఖినేటిపల్లి జూలై 7, ప్రభాత వార్త:** రాజోలు నియోజకవర్గం మలికిపురంలో 141 మంది లబ్ధిదారులకు రూ.70 లక్షల విలువైన చెక్కుల ను ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పంపిణీ చేసినారు. నియోజక వర్గ ప్రజల సంక్షేమానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాజోలు శాసన సభ్యులు దేవ వరప్రసాద్ అన్నారు. లబ్ధిదారులకు మంజూరైన రూ.70 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల ను లక్కవరం గ్రామం లోని ఎం.జి. గార్డెన్స్ నందుఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పంపిణీ చేశారు. ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి బాధిత కుటుంబానికి ప్రభుత్వం అందించే సహాయాన్ని త్వరితగతిన అందించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 1230 బాధిత కుటుంబాలకు 9 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించినట్లు తెలిపారు. ప్రజల సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యతగా తీసుకుని ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు

## పాత పద్దతి లోనే రైతులకు ఎరువులు విక్రయించాలి

### వైస్ ఎంపిపి మిరియాల



**పెద్దాపురం జూలై 07(ప్రభాత వార్త )** ప్రస్తుతం వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ప్రభుత్వం పాత పద్ధతులోనే రైతులకు ఎరువులు విక్రయించాలని పెద్దాపురం మండల పరిషత్ ఉపాధ్యక్షులు, వైఎస్ఆర్ సీపీ సీనియర్ నాయకులు మిరియాల లావరాజు (రాజా ) కోరారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కొత్తగా ఎరువులు పంపిణి యాప్ ద్వారా ఇవ్వడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. చదువురాని రైతులు ముఖ్యంగా కౌలు రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారని వారి ఇబ్బందుల దృష్ట్యా ప్రభుత్వం అధికార యంత్రాంగం పాత పద్ధతి లోనే ఎరువులు పంపిణి చేయాలనీ కోరారు.

అదేవిదంగా ఏలేరు నుండి సాగునీరు త్వరగా విడుదల చేసి రైతన్నని ఆదుకోవాలని వైస్ ఎంపిపి రాజా కోరారు.

## వి.ఆర్.పురం వెలుగు ఎపిఎంగా సుధాకర్ బాధ్యతలు స్వీకరణ

**వి.ఆర్.పురం,జూలై 7,ప్రభాతవార్త** వి.ఆర్.పురం వెలుగు ఎపిఎం గా సుధాకర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సుధాకర్ చింతూరు నుండి బదిలీపై వి.ఆర్.పురం వచ్చారు. ఇటీవల వరకు ఇక్కడ ఎపిఎం గా పనిచేసిన స్వామి రంపచోడవరం బదిలీ అయ్యారు. సుధాకర్ కు గతంలో వి.ఆర్.పురం సిసి గా పనిచేసి అనుభవం ఉంది. ఎపిఎం గా బాధ్యతలు చేపట్టిన సుధాకర్ కు మండల మహిళా సమైఖ్య అధ్యక్షులు కారం రమాదేవి, కార్యదర్శి ఉయికా అశ్విని, కోశాధికారి సోడి మమత, సిసి లు ఎం సోమినాయుడు, ఎస్ నాగేశ్వరావు, వి కల్యాణ చక్రవర్తి, ఎం భద్రయ్య, కె నీలిరాజు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

## పునర్నిర్మాణ ప్రదేశాలను పరిశీలించిన అర్జేసి...



**సఖినేటిపల్లి జూలై 7, ప్రభాత వార్త:** డా బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానంలో నిర్మించే రథం షెడ్డు నిర్మాణం, గోదావరి పుష్కరాల రేవును చేర్పులు మార్పులతో చేసే విధంగా ఆదేశాలు, గ్రామ సంరక్షకుడు శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం నూతన ఆలయం నిర్మాణం, గుర్రలక్క ఆలయం నూతన ఆలయం నిర్మాణం లను దేవాదాయ ధర్మాదాయ శాఖ అర్జేసి వేంద్ర త్రినాధరావు, డీసీ, ఏసి లతో పరిశీలించారు. నిర్మాణ ఆలయాల వివరాలు తెలుసుకొని, పుష్కర రేవు లో అక్రమాలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి సి రమేష్ బాబు, జిల్లా ఏసీ సత్యన్నారాయణ, డి ఈ లు, అసిస్టెంట్ కమీషనర్ ఏం కే టి నాగవర ప్రసాదు, తదితరులు పాల్గొన్నారు.

## జనసేన ఫ్లెక్సీలు ధ్వంసం



**యు.కొత్తపల్లి, జూలై 7 (ప్రభాతవార్త) :** మండలంలోని గోర్స గ్రామంలో ఇటీవల జరిగిన గ్రామ దేవత ఉత్సవం సందర్భంగా గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులు భక్తులకు, ప్రజలకు స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఫ్లెక్సీలలో గ్రామానికి చెందిన ఈ ఇద్దరు నాయకుల ఫోటోల ముఖచిత్రాలను చింపివేసారు. జనసేన పార్టీ గ్రామ ఇంచార్జ్ ఉలవల శ్రీనివాస్, గంధం నాగేంద్రలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ధ్వంసం చేయడం జరిగిందని ఇది రెండవసారని, దీనిపై పోలీసులకు పిర్యాదు చేయనున్నట్లు మంగళవారం తెలిపారు.

## కాట్రావులపల్లిలో ఓటరు నమోదు-

**60% పూర్తి, గడువులోగా 100% లక్ష్యం.. ముసిరెడ్డి నాగేశ్వరరావు**



**జగ్గంపేట, జులై 7( ప్రభాతవార్త)** జగ్గంపేట మండలం కాట్రావులపల్లి గ్రామంలో ఓటరు నమోదు ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. ఈనెల 14తో ఓటరు నమోదు గడువు ముగుస్తున్న నేపథ్యంలో గ్రామ టీడీపీ అధ్యక్షులుముసిరెడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బీఎల్ఓలు, బీఎల్ఏలతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. కాట్రావులపల్లిలో ఇప్పటికే 60% ఓటరు నమోదు ప్రక్రియ పూర్తయింది. ఇంకా ఓటు నమోదు చేసుకోని వారిని గుర్తించి, ఇంటింటికీ వెళ్లి నమోదు చేయిస్తున్నారు. జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ఆదేశాల మేరకు నమోదు ప్రక్రియను వేగవంతం చేశారు. ఓటరు అవగాహన కోసం గ్రామంలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. గడువు జులై 14 అర్హులైన ప్రతి ఒక్కరూ జులై 14లోగా ఓటు నమోదు చేసుకోవాలి. ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. గడువు సమీపిస్తున్నందున కుటుంబంలో ఎవరైనా18 ఏళ్లు నిండి, ఇంకా ఓటరుగా నమోదు కాని వారు వెంటనే బీఎల్ఓలను సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని ముసిరెడ్డి నాగేశ్వరరావు కోరారు. గ్రామంలో 100% ఓటరు నమోదే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముసిరెడ్డి శ్రీనివాస్, బిక్కిన బాబి, కాకరపల్లి కామేష్,రాయుడు శివ ప్రసాద్,సుంకర సింహాద్రి, ధమరసింగు మధు, కానేటి ప్రసాద్,పోలినాటి యెర్రా శాస్త్రి అప్పికొండ సింగర రావు దువ్వ మోజేష్ బుర్ర దుర్గాప్రసాద్ ,దాకారపు గంగరాజు బొంతు పెద్దకాపు,సూరిమిల్లి సత్తిబాబు"బి ఎల్ వో పాల్గొన్నారు.

## భారీ వృక్షాలను తొలగించాలి..



**అంబాజీపేట, జూలై 7, (ప్రభాతవార్త):** అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో ప్రతి బుధవారం జరుగు వారపు సంత ఆవరణలో కూలడానికి సిద్ధంగా ఉన్న భారీ వృక్షాలను తక్షణమే తొలగించాలని ఆ సమీప నివాసితులు అధికారులను కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో, మాచవరం గ్రామ ప్రత్యేక అధికారిని బి.మమతకు, మాచవరం పంచాయతీ కార్యాలయంలో సిబ్బందికి వినతి పత్రాలను మంగళవారం అందజేశారు. సుమారు 100 ఏళ్ల వయసు పైబడిన భారీ వృక్షాలు ఒకవైపునకు ఒరిగిపోయి నేలను తాకేందుకు సిద్ధంగా ఉన్నాయని, ప్రమాదభరితంగా ఉన్న వాటిని తొలగించాలని కోరారు.ఈ నెల 3న ఓ భారీ వృక్షానికి చెందిన పెద్ద కొమ్మ గృహ నిర్మాణ శాఖ కార్యాలయ భవనంపై పడింది. ఉదయం సమయం కావడం, కార్యాలయం తెరవకపోవడంతో ప్రమాదం తప్పింది. అయితే చెట్టుకొమ్మ పడడంతో కార్యాలయ భవనం పాక్షికంగా దెబ్బతింది. అలాగే గృహ నిర్మాణ శాఖ కార్యాలయ భవనానికి ఎదురుగా భారీ వృక్షం క్రమక్రమంగా నేలపై పడేందుకు వాలుతూ ఉంది.ఈ ప్రాంతంలో ఐసిడిఎస్, వెలుగు,గ్రామ సచివాలయం, వెల్నెస్ సెంటర్, కాపు సామాజిక భవనాలు ఉన్నాయి. అలాగే సమీపంలో నివాస గృహాలతోపాటు శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయం ఉన్నాయి. భారీ వృక్షాల వలన ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని బిక్కుబిక్కుమంటూ బ్రతుకుతున్నామని వినతి పత్రంలో పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్చించుకుని మా సమస్యను పరిష్కరించాలని వారు అధికారులకు ఇచ్చిన వినతి పత్రంలో కోరారు.

**మానసిక దివ్యాంగురాలైన బాలికపై అత్యాచార ఘటనకు సంబంధించి**

## సమగ్ర దర్యాప్తు నిర్వహించాలి

**నిందితుడ పై పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలి**

**రెడ్డి దుర్గాదేవి,ా ఉటౌ( స్త్రీ విముక్తి) జిల్లా నాయకులు**





**పెద్దాపురం జూలై 07 (ప్రభాత వార్త )** పెద్దాపురం మండలం జె.తిమ్మాపురం గ్రామం కోళ్ల ఫారం లో మానసిక దివ్యాంగురాలు (మైనర్ బాలిక) అత్యాచార సంఘటనలో నిందితుడకు కొమ్ముగాసిన మహిళా పోలీస్ ఎస్ ఐ పై న్యాయ విచారణ జరిపించాలని, నిందితులపై పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల మహిళా సంఘం ( స్త్రీ విముక్తి) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెద్దాపురం ఒకటో వార్డు, దమ్ము పేటలో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ప్రగతిశీల మహిళా సంఘం ( స్త్రీ విముక్తి) జిల్లా నాయకులు రెడ్డి దుర్గాదేవి నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా దుర్గాదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు, మైనర్ బాలికలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. దివ్యాంగులను కూడా కామాంధులు విడిచిపెడతలేదని వాపోయారు. పెద్దాపురం మండలం తిమ్మాపురం కోళ్ల ఫారం లో జరిగిన సంఘటనే దేనికి ఉదాహరణ అన్నారు. నిందితుడు(కోళ్ల ఫారం ఓనర్) అధికార పార్టీకి చెందినవాడు కాబట్టి తన డబ్బు, పలుకుబడితో పోలీసులను మేనేజ్ చేసుకుని తప్పించుకునే ప్రయత్నం చేశాడని, పాపం పండి డిసెంబర్లో జరిగిన సంఘటన నేడు బయటకు వచ్చిందని గుర్తు చేశారు. కంచే చేను మేసిన చందంగా చట్టాన్ని కాపాడవలసిన పోలీసే అందులోనూ మహిళ ఎస్సై డబ్బులు తీసుకుని నిందితుడకు కొమ్ము కాయడం దారుణమన్నారు. బాధిత కుటుంబాన్ని కనపడకుండా దాచి పెట్టారని ప్రచారం జరుగుతుందన్నారు. ఈ సంఘటనపై రాష్ట్ర హోమ్ మినిస్టర్ వంగలపూడి అనిత, డిప్యూటీ సీ.ఎం పవన్ కళ్యాణ్, ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని సమగ్ర దర్యాప్తు నిర్వహించి, బాధితురాలకి ఆమె కుటుంబానికి రక్షణ కల్పించాలని, నిందితుడ పై ఫోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, మహిళా ఎస్సై పై న్యాయ విచారణ జరిపించి, చర్యలు తీసుకోవాలని, బాధితురాలికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రగతిశీల మహిళా సంఘం (స్త్రీ విముక్తి) ఆధ్వర్యంలో ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ తలుపులమ్మ, సీమ సత్య, కోట అప్పల నరసమ్మ, దమ్ము లక్ష్మి, పిల్లి గోగులమ్మ, కోట దుర్గ, దమ్ము రామలక్ష్మి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మందకృష్ణ పుట్టినరోజు వేడుకలు



**కొత్తపేట జూలై 7 (ప్రభాతవార్త)** కొత్తపేటలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదినోత్సవ వేడుకలు ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు కొత్తపేట మండల ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్ కముజు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు అలాగే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు ఈ సందర్భంగా కొత్తపేట ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంచిపెట్టారు చర్చిలలో ప్రార్ధనలు చేశారు కొత్తపేట నుండి పలివెల గ్రామం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు కొత్తపేట పలివెలలో కేక్ కటింగ్ చేశారు అనంతరం పలివెల గ్రామంలో అన్నదానం నిర్వహించారు ఈ కార్యక్రమంలో జిల్లా ఎంఎస్పి నాయకులు యార్లగడ్డ సత్తిబాబు జిల్లా ఉపాధ్యక్షులు కొమ్మర వీర రాఘవులు ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్ క్రాప నాగరాజు రావులపాలెం మండల కొడమంచిలి చిరంజీవి కొత్తపేట మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు తొత్తరమూడి రాము ప్రధాన కార్యదర్శి నవ్వుంద్రి వెంకటేష్ మండల ఎమ్మార్పీఎస్ పెద్దలు నవుంద్రి ధనరాజు సత్యనారాయణ పల్లేరి తాతాజీ కుందుర్తి నాగేశ్వరరావు నవ్వుంద్రి జయరాజు పెప్పర సత్యానంద బాపూజీ ఉండ్రాజవరపు నాగేశ్వరరావు సిద్దుల కృపానందం నేదునూరి సత్యనారాయణ పులుసు గంటి జీవారత్నం కముజు నాగు గునపాటి గంగయ్య గుంజా మురళి తదితరులు పాల్గొన్నారు

## రావులపాలెం ఆర్టీసీ డిపో అభివృద్ధికి కృషి

**డిపో మేనేజర్ వై.వి.వి.ఎస్. కుమార్**



**రావులపాలెం, జూలై 07( ప్రభాతవార్త):** ఏపీఎస్ ఆర్టీసీ రావులపాలెం డిపో అభివృద్ధికి గత ఏడాది కాలంలో పలు చర్యలు చేపట్టినట్లు డిపో మేనేజర్ వై.వి.వి.ఎస్. కుమార్ తెలిపారు. డిపో మేనేజర్గా బాధ్యతలు స్వీకరించి మంగళవారంతో ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో బస్‌స్టేషన్‌కు పూర్తిస్థాయిలో పెయింటింగ్ పనులు నిర్వహించి నూతన రూపు తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇన్‌గేట్ వద్ద ఏర్పాటు చేసిన వాల్ పెయింటింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోందన్నారు. ఆధునిక సౌకర్యాలతో మరుగుదొడ్ల నిర్మించడంతో పాటు, కొత్త కుర్చీలు, అదనపు ఫ్యాన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆర్వో ప్లాంట్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉంచడంతో పాటు సేవా సంస్థల సహకారంతో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజల విజ్ఞప్తి మేరకు వాడపల్లి ప్రాంతానికి బస్సుల సంఖ్య పెంచడంతో రవాణా సౌకర్యాలు మెరుగుపడ్డాయని పేర్కొన్నారు. స్త్రీ శక్తి పథకం అమలు తర్వాత పెరిగిన ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు సిబ్బందిని నియమించి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ యోగా తరగతులు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించినట్లు చెప్పారు. డిపోలో పరిశుభ్రత, క్రమశిక్షణ, ప్రయాణికులకు మర్యాదపూర్వక సేవలు అందించే దిశగా సిబ్బందికి నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల ఆదరణ, ఉద్యోగుల సహకారం, ఉన్నతాధికారుల మార్గదర్శకత్వంతో గత ఏడాదిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా అమలయ్యాయని, భవిష్యత్తులో కూడా మరిన్ని సౌకర్యాలు కల్పిస్తూ డిపో అభివృద్ధికి కృషి చేస్తామని వై.వి.వి.ఎస్. కుమార్ పేర్కొన్నారు.

## వాడపల్లి దేవస్థాన ప్రధాన రహదారి విస్తరణ అభివృద్ధి పై సమీక్ష ...

**ఈనెల 16 వ తేదీన సంబంధిత రైతులతో సమావేశం.. ఆర్డీఓ. వి వి సత్యనారాయణ.**



**ఆత్రేయపురం జూలై 07,(ప్రభాత వార్త).** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి వెళ్లే ప్రధాన రహదారి విస్తరణ పై ఆర్డీఓ వి.వి సత్యనారాయణ అధ్యక్షతన సమీక్షా సమావేశం సోమవారం నిర్వహించారు.మంగళవారం కొత్తపేట రెవెన్యు డివిజినల్ అధికారి కార్యాలయంలో ఆర్ జే సి త్రినాధరావు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, ఎమ్ ఆర్ ఓ ఆర్.డి రామచంద్రమూర్తి, సర్వేయర్, ఆర్ అండ్ బి అధికారులతో సమావేశం నిర్వహించి ఈనెల 16 వ తేదీన సంబంధిత రైతులతో సమావేశం ఏర్పాటు చేస్తామని ఆర్డీఓ తెలిపారు.

## మహిళల భద్రత, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి




**మామిడికుదురు.జూలై 07(ప్రభాతవార్త)** మహిళల భద్రత, చట్టాలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నగరం ఎస్ఐ ఎ.పద్మారావు సూచించారు.మామిడికుదురు దీప్తి కళాశాలలో మంగళవారం మహిళల భద్రత, చట్టాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.మహిళలు,విద్యార్థినీలు వేధింపులకు గురైతే భయపడకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.శక్తి యాప్ వినియోగం, ఫోక్సో చట్టం,గృహ హింస,వరకట్నం వేధింపులు,ఈవ్ టీచింగ్,సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆపద సమయంలో 112,118 నెంబర్లకు డయల్ చేయడంతో పాటు మహిళా హెల్ప్ లైన్ 1091 చైల్డ్ హెల్ప్ లైన్ 1098 నెంబర్లకు ఫోన్ చెయ్యాలన్నారు. ఈ అవగాహన సదస్సులో కళాశాల కారాస్పాండెంట్ డివివి సత్యనారాయణ,ప్రిన్సిపాల్ మోకా రంగారావు పాల్గొన్నారు.

## పుష్కర పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



**మామిడికుదురు. జూలై 07(ప్రభాతవార్త)** 2027 గోదావరి పుష్కరాల సందర్భంగా చేపట్టిన పనులు నాణ్యతా ప్రమాణాలను పాటించాలని పూర్తి చేయాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమీషనర్ వి.త్రినాధరావు పేర్కొన్నారు.పుష్కరాల అభివృద్ధి పనుల్లో భాగంగా నిర్వహిస్తున్న పునఃనిర్మాణం పనులు నూతన అన్నప్రసాద వనం పనులను మంగళవారం ఆయన పరిశీలించారు.పనుల పురోగతిని ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.పుష్కరాల నాటికి భక్తులకు అన్ని వసతులు కల్పించేలా పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు.ఆయన వెంట డిప్యూటీ కమీషనర్ డిఎల్వి రమేష్ బాబు,ఎస్.ఈ టి.దుర్గేష్,ఈఈ శ్రీనివాస్,డిఈఈ ఎన్.ఉదయ్ కుమార్, జిల్లా ఎసి వి.సత్యనారాయణ,ఆలయ ఈఓ ఎం.రాంబాబు రెడ్డి,ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త మొల్లేటి చక్రపాణి ఉన్నారు.

## అగ్నికి ఆహుతైన తాటాకు ఇల్లు



**మామిడికుదురు. జూలై 07(ప్రభాతవార్త)** మండలంలోని పెదపట్నంలంక గ్రామంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న యేడిద వెంకటేశ్వరరావు కు చెందిన తాటాకు ఇల్లు మంగళవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో పూర్తిగా కాలిపోయింది.అందరూ నిద్రిస్తున్న వేళ ఇంట్లోని వారు బంధువుల ఇంటికి వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం జరగడంతో ప్రాణాపాయం తప్పింది.ఇంట్లోని సామానులు,రూ.10వేలు నగదు,ఆ కుటుంబానికి ఆధారమైన తాడు మిషన్,డొక్క పీచు, మూడు విద్యుత్ మీటర్లు పూర్తిగా కాలిపోయాయి.రూ.4లక్షల విలువైన తాడు మిషన్ తోపాటు అన్నీ కాలి పోయాయని బాధితులు వాపోతున్నారు.ఆస్తి నష్టం సుమారు రూ.10 లక్షలు ఉంటుందన్నారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే రాజోలు అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగిందన్నారు.ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య,మాజీ సర్పంచ్ సుందరనీడి చిన్ని,స్థానికులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

మరిన్ని వార్తలు 6లో

# ఘనంగా మందకృష్ణ జన్మదిన వేడుకలు..



ఆత్రేయపురం, జూలై 07,(ప్రభాత వార్త) పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు,మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎంఆర్పిఎస్ నాయకులు కార్యకర్తలు వేడుకల్లో పాల్గొని ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని మెర్లపాలెం గ్రామంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మర రాఘవ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో గ్రామ మాజీ సర్పంచ్ మెర్ల రాము టిడిపి నాయకుడు గుండబోగుల రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ పథకాన్ని గ్రామ మాజీ సర్పంచ్ మెర్ల రాము ఎంఆర్పిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మర రాఘవ మాదిగ ఆవిష్కరించారు. అనంతరం మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు పురస్కరించుకుని కొమ్మర రాఘవ కేక్ కట్ చేసి పలువురికి పంచి వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ 32 సంవత్సరాలపాటు సుదీర్ఘ పోరాటం నిర్వహించి ఆత్మగౌరవ నినాదంతో సమాజంలో అణగారిన వర్గాల వారికి హక్కులు కొరకు పోరాడారు అని అన్నారు. వికలాంగులు వృద్ధులు వితంతువులు అందరికీ కార్పొరేట్ హాస్పిటల్లో ఆరోగ్యం అందేలా ఆరోగ్య శ్రీ సాధన కోసం కృషి చేశారని అన్నారు. శాంతియుత మార్గంలో ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమాలు నిర్వహించి వర్గీకరణ సాధన కోసం కృషి చేశారని కొనియాడారు. మందకృష్ణ మాదిగ పోరాట స్ఫూర్తితో ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎం.ఎస్.పి జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం యాకోబు మాదిగ , ఎం.ఎస్.పి నియోజకవర్గ ఇంచార్జ్ కాప నాగరాజు,ఎం.ఆర్.పి.ఎస్ మండల అధ్యక్షుడు లకారపు చంద్ర శేఖర్, ఎం.ఆర్.పి.ఎస్ సీనియర్ నాయకులు ఆకుమర్తి యేసేబు, ముప్పిడి పండు, కోడమంచిలి చిరంజీవి, రాచర్ల అరుణ్ కుమార్, మండల యువసేన అధ్యక్షుడు లంకా ప్రేమ్ కుమార్, పోసి రాజు, మెర్లపాలెం గ్రామ మహిళలు, యువత పాల్గొన్నారు.

## మహిళా మార్ట్ అవకతవకలపై విచారణ జరిపించాలి.

### తాళ్లరేవు మండల వైకాపా డిమాండ్.



తాళ్లరేవు జూలై 7 (ప్రభాతవార్త): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలో అప్పటి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన వెలుగు మహిళా మార్ట్ లో జరిగిన నగదు అవకతవకలపై సమగ్ర విచారణ నిర్వహించి, దర్యాప్తు చేయాలని, అప్పటి ఏపీఎం పై చర్యలు తీసుకోవాలని తాళ్లరేవు మండల వైస్సార్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఎమ్. పి. డి. ఓ. స్వర్ణ కు వినతిపత్రం అందజేశారు. ముందుగా కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, నిందితులపై చర్యలు తీసుకోవాలని నినాదాలుచేశారు. ఈ కార్యక్రమం లో మండల పార్టీ అధ్యక్షులు కాదా గోవింద్ కుమార్, నాయకులు, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్ర ప్రసాద్, ఎంపీటీసీ పోతుల రత్నకుమారి, మాజీ ఎంపీటీసీ బొంతు మోహన్, మాజీ సర్పంచ్ రేవు మల్లేశ్వరి, నాయకులు ఆకుల వెంకన్న, పందిరిపల్లి రాజేష్, పొన్నాడ భైరవమూర్తి, ఉంగరాల సంతోష్, పేర్ని ఆదినారాయణమూర్తి, శీలి రాజు,పెయ్యల రమేష్, వెంటపల్లి వాసంతి, మురముళ్ల అనంత లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం

### వైభవంగా పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు



రావులపాలెం, జూలై 07 (ప్రభాతవార్త) : గోపాలపురం గ్రామంలో ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం, సంస్థ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మర రాఘవ మాదిగ పాల్గొని ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పద్మశ్రీ మందకృష్ణ మాదిగకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాఘవ మాట్లాడుతూ, మందకృష్ణ మాదిగ నాయకత్వంలో గత 32 సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్ హక్కులు, ఆత్మగౌరవం కోసం నిరంతరం పోరాటాలు చేస్తూ సామాజిక ఉద్యమాలకు దిశానిర్దేశం చేసిందన్నారు. అణగారిన వర్గాల హక్కుల సాధనతో పాటు వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, అమరవీరుల కుటుంబాల సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి చేసిందని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాల సాధనలో కూడా ఎమ్మార్పీఎస్ కీలక పాత్ర పోషించిందన్నారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో వివిధ సామాజిక అంశాలపై ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ నియోజకవర్గ ఇంచార్జి కాప నాగరాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆకుమర్తి యేసేబు, కొడమంచిలి చిరంజీవి, మండల యువసేన అధ్యక్షుడు లంకా ప్రేమ్ కుమార్, గ్రామ మహిళలు, యువత మరియు తదితరులు పాల్గొన్నారు.

## పేదల పాలిట వరం ముఖ్యమంత్రి సహాయనిధి : ఎమ్మెల్యే నానాజీ



కాకినాడ రూరల్ జూలై 7 (ప్రభాతవార్త):ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా చేసుకొని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో అమలు చేస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేదల పాలిట వరం అని కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ అన్నారు. వలసపాకల గంగరాజు నగర్ జనసేన పార్టీ కార్యాలయంలో ముఖ్య మంత్రి సహాయనిధి ద్వారా 18 , నలుగురికి ఎల్వోసీతో కలిపి మొత్తం 22 మందికి మంజూరు అయిన రూ.21,83,858/- రూపాయల విలువ గల చెక్కులను లబ్ధిదారులకు కాకినాడ రూరల్ శాసన సభ్యులు పంతం నానాజీ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ ఇప్పటివరకు నియోజకవర్గం నుండి 422 అప్లికేషన్స్ పంపించగా ఈనాటి కి సుమారు 316 మందికి రూ. 3,03,50,626/-ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థికంగా చేయూతనివ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి శ్రీమూర్తులు, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు కరెడ్ల గోవింద్,తాటికాయల వీరబాబు, సోదే ముసలయ్య, జీని శ్రీనివాస్, హేమ పద్మజ, చవ్వాకుల శాంతి, ముద్రగడ రమేష్, పుల్ల శ్రీరాములు, బస్వా చంటి బాబు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం.. ఎమ్మెల్యే గిడ్డి.

### ఇరుసుమండలో పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ..



అంబాజీపేట,జూలై 7, (ప్రభాతవార్త): రైతు సంక్షేమం దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, రైతుల మధ్య భూ సరిహద్దు వివాదాలు, తగాదాలు లేకుండా చేయడమే భూ రీ సర్వే ఉద్దేశ్యమని పి. గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఇరుసుమండ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మీ భూమి -మీ హక్కు కార్యక్రమంలో భాగంగా 443 మంది రైతులకు తహసిల్దార్ బి.చినబాబు ఆధ్వర్యంలో రైతులకు ప్రభుత్వ రాజముద్రతో ముద్రించిన పట్టాదారు పాస్ పుస్తకాలను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, పట్టాదారు పాసుపుస్తకాలపై తన ఫోటోను ముద్రించుకున్న అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రైతులను భయభ్రాంతులకు గురి చేశారన్నారు.రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం భూమి ఉన్న ప్రతీ రైతుకు భరోసా కల్పిస్తూ మీ భూమి-మీ హక్కు అంటూ రైతులకు ధైర్యం కల్పిస్తుందన్నారు. గత వందేళ్ల క్రితం బ్రిటిష్ కాలంలో చేపట్టిన భూ సర్వే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరోసారి రీ సర్వే జరిపి భూ వివాదాలు లేకుండా చేస్తుందన్నారు.రీ సర్వేలో భూ సమస్యలుంటే గ్రామ రెవెన్యూ అధికారుల ద్వారా తనను సంప్రదించి సమస్యని పరిష్కరించుకోవాలని తాసిల్దార్ చినబాబు రైతులకు సూచించారు. అనంతరం మండల రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో స్థానిక వైవిపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు హెచ్ఎం శ్రీ సత్య ఆధ్వర్యంలో నోటి పుస్తకాలు, పెన్సిల్ తదితర విద్యా సామాగ్రిని ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో నియోజవర్గ టిడిపి కో-కన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ,రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్లు సుంకర గణపతి రావు,కుడుపూడి రాంబాబు, టిడిపి,జనసేన,బిజెపి మండల శాఖల అధ్యక్షులు గూడాల ఫణి, దొమ్మేటి సాయికృష్ణ, కురసా ఆంజనేయులు,కూటమి నాయకులు గణపతి వీర రాఘవులు,రవణం రాము, మైపాల తాతాజీ, అక్కిశెట్టి సత్యనారాయణ, సుంకర రామదాసు నాయుడు, పత్తి దత్తుడు, కముజు శ్రీనివాసరావు, వెంకటరమణబాబు, నాగాబత్తులు సత్యానందరావు, కొత్తపేట డివైఈవో కె. వెంకటేశ్వరరావు,ఆర్ఐ ఏడుకొండలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేకు ఏపీజేఏసీ వినతి



గోపాలపురం జూలై 07, (ప్రభాతవార్త): ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ ఏపీ జాయింట్ యాక్షన్ కమిటీ (ఏపీజేఏసీ) ప్రతినిధులు మంగళవారం క్యాంపు కార్యాలయంలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఏపీజేఏసీ తూర్పుగోదావరి జిల్లా చైర్మన్ మీసాల మాధవరావు, కన్వీనర్ కె.వి.వి. సత్యనారాయణ, గోపాలపురం జేఏసీ చైర్మన్ జోడాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగ వర్గాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వంతో చర్చించి తగిన చర్యలు తీసుకునేలా సహకరించాలని ఎమ్మెల్యేను కోరారు. మూడేళ్లుగా పెండింగ్లో ఉన్న వేతన సవరణ అమలు, సరెండర్ లీవుల నగదు చెల్లింపు, నాలుగు డీఏ బకాయిల విడుదల, ఇన్సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు, సీపీఎస్ రద్దుతో పాటు మొత్తం పది ప్రధాన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేజీకే మూర్తి, సీహెచ్ విజయకృష్ణ, ఏపీఎన్జీఓ జిల్లా కార్యదర్శి పాపారావు, నరసింహారాజు, ప్రసన్నకుమార్, ఈశ్వరరావు తదితర ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతులకు యూరియా కష్టాలు

అయినవిల్లి జులై 7 ప్రభాతవార్త ఈ సంవత్సరం వర్షాలు లేకపోవడం ఇజ్రాయిల్ అమెరికా ఇరాన్ యుద్ధం కారణంగా భారతదేశంలోని రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు యూరియా కొరత ఏర్పడటం కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెంచడం రైతులకు చేయనీయ పరిస్థితి ఏర్పడింది ప్రస్తుతం అయినవిల్లి మండలం పరిసర గ్రామాల్లో రైతులు యూరియా కోసం సొసైటీల వద్ద క్యూలైన్లో పడిగాపపులు పడి ఉండవలసి వస్తుంది ఆన్లైన్ విధానం ద్వారా అతంటికేషన్తో సొసైటీలు వద్ద యూరియా ఇస్తున్నారు దీంతో రైతులు పనులు మానుకుని రోజుల తరబడి ఉండవలసి వస్తుందని రైతులు తెలిపారు ఒకపక్క వర్షాలు లేక ఎరువుల కొరత ఏర్పడటం కారణంగా ప్రస్తుత రైతులు పరిస్థితి దయనీయంగా మారింది రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధ ప్రా తిపదికన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు

## పి.పి.పి. విధానం రద్దు చేయాలి,

### పాత విధానం కొనసాగించాలి.



తాళ్ళరేవు జూలై 7 (ప్రభాతవార్త): స్టాంప్స్ మరియు రిజిస్ట్రేషన్ శాఖలో ప్రభుత్వం సంస్కరణల పేరుతో తీసుకొచ్చిన పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్షిప్ (పి.పి.పి.) విధానం రద్దు చేయాలని, జీవో నెంబర్ 396 ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ దస్తావేజు లేఖరులు, స్టాంపు వెండర్, డిటిపి ఆపరేటర్లు చేస్తున్న సమ్మెకు పలువురు మద్దతు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం పిలుపులో భాగంగా తాళ్ళరేవులో రెండవ రోజు దస్తావేజు లేఖరులు, స్టాంపు వెండర్, డిటిపి ఆపరేటర్స్ చేస్తున్న నిరసన శిబిరంలో వ్యవసాయ కార్మిక సంఘం కాకినాడ జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ సంస్థలలో ప్రైవేటు పెట్టుబడి దారులను ఆహ్వానిస్తూ ప్రజలకు చౌకగా అందుతున్న సేవలను ప్రైవేటు పరం చేస్తూ ఆయా రంగాల్లో పనిచేస్తున్న వారి ఉపాధిని దెబ్బతీస్తుందన్నారు. ఉపాధి రంగాలకు నష్టం చేకూర్చే ఈ విధమైన సంస్కరణ లను అందరూ అర్థం చేసుకుని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పి ఈ విధానాన్ని తిప్పి కొట్టాలన్నారు. ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకిస్తూ దస్తావేజు లేఖరులు చేస్తున్న ఉద్యమానికి వ్యవసాయ కార్మిక సంఘం పూర్తి మద్దతు తెలియజేస్తుందని అన్నారు. రెండవ రోజు తాళ్ళరేవు మాజీ సర్పంచ్ రెడ్డి రెడ్డి బాబు మద్దతు తెలిపారు. ఈ దీక్షలలో దంగేటి కృష్ణమూర్తి, ఎలుగుబంటి బూరయ్య, కాట్నం పద్దరాజు, విత్తనాల వెంకటేశ్వరరావు, గండి వీరబాబు, బొండా సురేష్, కొలను సూర్యనారాయణమూర్తి, తిమ్మలపూడి శ్రీను, కే.సతీష్,నిమ్మతి అబ్బాయి పాల్గొన్నారు.

## శ్యాంప్రసాద్ ముఖర్జీ పేరుపై బిజెపి అన్నదానం.



తాళ్ళరేవు, జూలై 7 (ప్రభాతవార్త) భారతీయ జన సంఘ్ (నేటి భారతీయ జనతా పార్టీ) వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ 125 వ జయంతి వేడుకలను పురస్కరించుకుని మండల బిజెపి ఆధ్వర్యంలో తాళ్ళరేవు మండలంలో పలువురికి అన్నదానం నిర్వహించారు. స్థానిక గాంధీనగర్ లో నాయకులు దంగేంటి కృష్ణ నివాసంలో జరిగిన ఈ కార్యక్రమం లో ముందుగా ఆయన చిత్ర పటానికి నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు యనమండ్ర విజయకుమార్ మాట్లాడారు. భారతీయ జనసంఘ్ (నేటి భారతీయ జనతా పార్టీ) వ్యవస్థాపకుడు, ప్రముఖ విద్యావేత్త శ్యాంప్రకాష్ ముఖర్జీ జాతీయవాదం, సమగ్రతకు చేసిన సేవలకు గుర్తింపుగా కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆయన జయంతి ఉత్సవాలను నిర్వహిస్తోందని అన్నారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ బ్రహ్మోర్పణ కార్యక్రమం ద్వారా పేదల ఇంటింటికి వెళ్లి భోజనం క్యారేజీలు అందజేశారు. ఈకార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రదాన కార్యదర్శి కొపనాతి దత్తాత్రేయ వర్మ, మేడిశెట్టి పవన్ కుమార్, కొలను సత్తిబాబు, టేకుమూడి రామకృష్ణ, జిల్లా సోషల్ మీడియా ఇన్ చార్జి రొక్కాల సత్తిబాబు, విత్తనాల కరిమిల స్వామి, జొన్నలగడ్డ శ్రీనివాస్, రాములు,దాసరి కుమారస్వామి పాల్గొన్నారు.


## విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తే చర్యలు



రామచంద్రపురం,జూలై 07 (ప్రభాతవార్త):
ఆర్.టి.ఈ12(1)(జ) కింద ఉచిత సీట్లు పొందిన విద్యార్థుల నుంచి ట్యూషన్,అడ్మిషన్,గేమ్స్ తదితర ఎలాంటి ఫీజులు వసూలు చేయరాదని విద్యాశాఖ అధికారులు ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలను హెచ్చరించారు. తల్లిదండ్రులు,విద్యార్థి సంఘాలు,పాఠశాలల ప్రతినిధులతో మండల విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు స్పష్టం చేశారు.పీడీఎస్యూ ఆధ్వర్యంలో జరిగిన ఫిర్యాదులు,ఆందోళనల నేపథ్యంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తే సంబంధిత విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల విద్యాశాఖ అధికారులు హెచ్చరించారు.ఈ సందర్భంగా పీడీఎస్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధుమాట్లాడుతూ ఆర్.టి.ఈ విద్యార్థులకు పెండింగ్లో ఉన్న ట్యూషన్ ఫీజులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని,యూనిఫాంలు,పాఠ్యపుస్తకాలు కూడా ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో డివిజనల్ విద్యాశాఖ అధికారి రామలక్ష్మణమూర్తి,మండల విద్యాశాఖ అధికారులు ఎం శ్రీనివాస్,వి.నాగేశ్వరి ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యం,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వాడపల్లి నిత్యాన్న పథకానికి రూ,1,01116/-విరాళం...

### శ్రీవారి అష్టోత్తర పూజ, నిత్య కళ్యాణంలో పాల్గొని పులకించినభక్తులు.





ఆత్రేయపురం, జూలై 07,(ప్రభాత వార్త) ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం మంగళవారం వేలాది మంది భక్తుల గోవింద నామస్మరణతో మార్మోగింది. ఏడు వారాల నోము పూర్తయిన భక్తులు అష్టోత్తర శతనామావళి, నిత్య కళ్యాణం, గోపూజ, పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. అలాగే భీమవరం చెందిన యర్రంశెట్టి నాగేశ్వరరావు, శ్రీలక్ష్మి దంపతులు, చిరంజీవి నిహారిక, వారి కుటుంబ సభ్యులు నిత్యాన్నదాన పథకానికి రూ. 1,01116/- విరాళంగా అందించారు. స్వామివారి దర్శనం అనంతరం వారికి ఆలయ అర్చకులు వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు లు శ్రీ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు ఏర్పాట్లు చేశారు.

## జేగురుపాడులో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఘనంగా శ్రీకారం



కడియం, జూలై 7 ( ప్రభాతవార్త) కడియం మండలం, జేగురుపాడు: గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా పలు ప్రాంతాల్లో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను సోమవారం కొబ్బరికాయలు కొట్టి ఘనంగా ప్రారంభించారు. గ్రామ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ శ్యాంప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు నాగిరెడ్డి సూర్య రామకృష్ణ, మాజీ ఉప సర్పంచ్ పాతూరి రాజేష్, దేవస్థాన చైర్మన్ కర్రి చిన్నబాబు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు మర్రెడ్డి రమేష్ పాల్గొని పనులను ప్రారంభించారు. అనంతరం గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గంగరాజు రమణ, గంగరాజు రాము, కొత్తూరి ఫణికుమార్, కొంబాబత్తుల సూరికుమార్, వందే ధర్మరాజు, కేసనపల్లి గట్టయ్య, వనమాలి వెంకట బాలాజీ, బోనం నాగయ్య, రంకిరెడ్డి చిట్టయ్య, వల్లూరి మోహన్రావు, మాదారం సూరిబాబు, మాన్యం చంద్రమోహన్, జుత్తుగ నారాయుడు, నాగిరెడ్డి భాస్కరరావు, ఎన్నమని నరేష్, హనుమంతు శ్రీను, పంచాయతీ కార్యదర్శి, మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాధా రంగ మిత్రమండలి కడియం మండల అధ్యక్షుడిగా నాగవరపు వి.ఎస్. ప్రశాంత్ (బాబి) నియామకం



కడియం, జూలై 7 (ప్రభాతవార్త) రాధా రంగ మిత్రమండలి కడియం మండల అధ్యక్షుడిగా నాగవరపు వి.ఎస్. ప్రశాంత్ (బాబి) నియమితులయ్యారు. ఈ మేరకు ఆంధ్ర--తెలంగాణ రాష్ట్ర రాధా రంగ మిత్రమండలి అధ్యక్షుడు కాళ్లపాలెం బుజ్జి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, అభిమానులు ప్రశాంత్ను అభినందించారు. వంగవీటి మోహనరంగా గారిని ఆదర్శంగా భావిస్తూ, ఆయన సేవా స్ఫూర్తిని అనుసరించి ప్రజల మధ్య సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్న ప్రశాంత్కు స్థానికంగా మంచి గుర్తింపు ఉందన్నారు. దామిరెడ్డిపల్లి బాబిగా పరిచయమైన ఆయన, పార్టీలకు అతీతంగా అన్ని కులాలు, మతాల ప్రజలను సమానంగా గౌరవిస్తూ సామాజిక సేవలో చురుకుగా పాల్గొంటున్నారని పేర్కొన్నారు.యువతకు ఆదర్శంగా నిలుస్తూ పలు సేవా కార్యక్రమాలను తనదైన శైలిలో నిర్వహిస్తున్న ప్రశాంత్, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలతో నిరంతరం మమేకమవుతూ ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. సాధారణ కుటుంబం నుంచి ఎదిగి, మంచితనం, మానవత్వంతో ప్రజాభిమానాన్ని సంపాదించుకున్న ఆయనకు ఈ పదవి రావడం ఆనందదాయకమని అభిమానులు తెలిపారు.నూతన బాధ్యతలను స్వీకరించిన నాగవరపు వి.ఎస్. ప్రశాంత్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు కాళ్లపాలెం బుజ్జికి కృతజ్ఞతలు తెలిపారు. రాధా రంగ మిత్రమండలి ఆశయాలకు అనుగుణంగా యువతను సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తూ ప్రజలకు మరింత చేరువయ్యేలా కృషి చేస్తానని చెప్పారు.

## రైతు బజారును తనిఖీ చేసిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు.



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూలై7, ప్రభాతవార్త. అమలాపురం నియోజకవర్గ శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు మంగళవారం పట్టణంలోని స్థానిక రైతు బజారును సందర్శించి,తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన రైతు బజారులోని స్టాళ్లను, కూరగాయల విక్రయాలను పరిశీలించారు. మార్కెట్లో అందుబాటులో ఉన్న ధరలు, మౌలిక వసతుల గురించి అక్కడి సిబ్బందిని మరియు అధికారుల ను అడిగి తెలుసుకున్నారు.రైతు బజారు నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్ర మౌళి,అముడా చైర్మన్ అల్లాడి సోంబాబు, స్థానిక కూటమి ముఖ్య నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం. డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## జనసేన కేంద్ర కార్యాలయానికి చేరిన నిర్మాణ సారథుల దరఖాస్తులు






ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూలై7,ప్రభాతవార్త. జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ కార్యకర్తల నుండి స్వీకరించిన దరఖాస్తులను మంగళగిరి లోని జనసేనపార్టీ కేంద్ర కార్యాలయాని కి చేరుకున్నాయి.ప్రతిదరఖాస్తుని ఐటీ టీం డిజిటలైజ్ చేసి, సీలు చేసి సిద్ధం చేసిన ట్రంకు పెట్టెలను పరిశీలకులు, పెందుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ఆదేశాలతో కమిటీ లోని సీనియర్ నాయకుడైన, రాష్ట్ర హ్యాండీ క్రాఫ్ట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆర్డీఎస్ ప్రసాద్ ద్వారా కార్యాలయానికి పంపించారు. దీనితో సమాచార సేకరణ ప్రక్రియ పూర్తి అయ్యిందని, ఈ ప్రక్రియలో కమిటీ సభ్యుల దరఖాస్తులతో పాటు సుమారు 2300 దరఖాస్తులు స్వీకరించడం జరిగింది. కమిటీ తెలిపిన వివరాలప్రకారం నియోజకవర్గాల వారిగా అమలాపురం 367, కొత్తపేట 395, పి.గన్నవరం 363, రాజోలు 337, రామచంద్రపురం 339, ముమ్మిడివరం 249, మండపేట 196 దరఖాస్తులు వచ్చాయి. వీరిలో పార్లమెంట్ స్థాయి పదవులకు 214 మంది దరఖాస్తు చేసుకోగా, అసెంబ్లీ స్థాయి పదవులకు 307, మండల స్థాయి పదవులకు 637, పట్టణ స్థాయి పదవులకు 133, గ్రామ స్థాయి పదవులకు 955 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు ఆర్డీఎస్ ప్రసాద్ తెలిపారు. ప్రతి ఒక్క దరఖాస్తును కూడా ప్రజాస్వామ్య పద్ధతిలో స్వీకరించి, చాలా భద్రంగా పార్టీకి అందచేశామని, త్వరలోనే అదినేత పవన్ కళ్యాణ్ స్వయంగా వీటిని పరిశీలించి కమిటీల రూప కల్పన ప్రక్రియ మొదలు మెడతారని ఎమ్మెల్యే రమేష్ బాబు తెలిపారు. ఈ ప్రక్రియ విజయవంతానికి కృషి చేసిన కమిటీ సభ్యులకు, ఐటీ విభాగానికి, పార్టీ ఎమ్మెల్యేలకు, ఇన్చార్జిలకు, నాయకులకు, వీరమహిళలకు, వాలంటీర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేశారు.


## కళలకు జీవం పోస్తున్న డాక్టర్ వర్మ అభినందనీయుడు

### బిజెపి నాయకులు రామసేన అధ్యక్షులు కంబాల, జనసేన నాయకులు అను శ్రీ



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిది ,జూలై7,ప్రభాతవార్త. జానపద కళలకు జీవం పోస్తూ సామాజిక సేవకులను సత్కరిస్తున్న ప్రముఖ ఇంద్రజాలికులు కళా ప్రపూర్ణ డాక్టర్ చల్లగాలి శ్రీనివాస వర్మ అభినందనీయులని ప్రముఖ బిజెపి నాయకులు రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు జనసేన నాయకులు అత్తిలి సత్యనారాయణ అనుశ్రీ అన్నారు గత 15 నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా ముగ్గురు కళాకారులను ముగ్గురు సంఘ సేవకులను గుర్తించి వారిని ఇంద్రజాలికులు శ్రీనివాస్ వర్మ ఘనంగా సత్కరిస్తున్న విషయం తెలిసిందే అందులో భాగంగా ముగ్గురు కళాకారులను ముగ్గురు సామాజిక సేవకులను స్థానిక జ్ఞాన సరస్వతి ఘాటు వద్ద డాక్టర్ శ్రీనివాస్ వర్మ ఘనంగా సత్కరించారు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కంబాల శ్రీనివాసరావు పాల్గొని ప్రసంగించారు పుట్టినరోజులు వర్ధంతులను ఏడాదికోసారి నిర్వహించడమే కష్టమైపోతున్న ఈ రోజుల్లో నెల నెల ఆరుగురిని సత్కరించడం చాలా అరుదైన విషయం అని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీనివాస్ వర్మ అభినందనీయుడని కొనియాడారు అందులో భాగంగా నిజామాబాద్ కు చెందిన జాదూరత్న వేదాంతం రంగరాజు ఇంద్రజాలంతోను బొమ్మూరు పద్మజ మధుర గేయాలతోనూ కొనకల్ల ఫణీంద్ర గజిల్తోను మార్తా రవి ఇంద్రజాలంతోను అందరినీ అలరించారు మరో ముఖ్య అతిథి జనసేన నగర అధ్యక్షులు అత్తిలి సత్యనారాయణ అనుశ్రీ మాట్లాడుతూ ఎంతో గుండెల నుండా బాధ ఉన్నప్పటికీ పెదవిపై చిరునవ్వు జరగకుండా అందరిచే చక్కటి వినోదాన్ని విజ్ఞానాన్ని అందిస్తున్న జాదూగర్ శ్రీనివాస్ వర్మ అభినందనీయుడన్నారు ఈ కార్యక్రమంలో డాక్టర్ బి హెచ్ పి రమాదేవి ప్రభువుల ఆంజనేయులు భగీరథరాజు ప్రసాద్ పట్నాయక్ కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు

## పాడైన బోర్పైపు..స్పందించని మున్సిపాలిటీ



రామచంద్రపురం, జూలై 07 (ప్రభాతవార్త): పట్టణంలోని గుబులవారిపేట వీధిలో తాగునీటి సమస్య తీవ్రంగా మారింది.మున్సిపల్ బోర్ పైపు దాదాపు 20 రోజులుగా పాడై ఉండటంతో ఆ వీధికి తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది.సమస్యను పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.తాగునీటి కోసం మహిళలు,వృద్ధులు ప్రతిరోజూ ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని వారు వాపోయారు.పాడైన బోర్ పైపు తుప్పుపట్టి నిరుపయోగంగా మారినా మరమ్మతులు చేపట్టకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన మున్సిపాలిటీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే జోక్యం చేసుకుని బోర్ను మరమ్మతు చేసి తాగునీటి సరఫరా పునరుద్ధరించాలని స్థానికులు ముల్లేటి అనంతలక్ష్మి,?గుబ్బల నీరజ,?వాసంశెట్టి దుర్గ,?గుబ్బల దుర్గ,?యనమదల మురళీకృష్ణ,?ముల్లేటి సూరిబాబు,?వాసంశెట్టి పద్మ,?నరాల శ్రీను,?నరాల పద్మ కోరుతున్నారు.

## మంద కృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ



వి.ఆర్.పురం,జూలై 7,ప్రభాతవార్త ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ అవార్డు గ్రహీత, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎం.ఆర్.పి.ఎస్) వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను, మంగళవారం వి.ఆర్.పురంలో ఆ సంఘం నాయకులు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమాన్ని పురస్కరించుకొని, రేఖపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు స్థానిక వైద్యాధికారి డాక్టర్ షేక్ నిలోఫర్ చేతుల మీదుగా పండ్లు, రొట్టెలను అందించారు. కేంద్రం అందించే ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ అవార్డును గత ఏడాది మే 27 న ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్లో, భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా మందకృష్ణ మాదిగ పద్మశ్రీ అవార్డును అందుకున్న విషయం విదితమే. పద్మశ్రీ అవార్డు అందుకున్న తరువాత, ఆ హోదాలో మంద కృష్ణ మాదిగకు ఇది మొదటి జన్మదినం కావటం అంతటా వేడుకలకు ప్రత్యేక సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఎం.ఆర్.పి.ఎస్ సీనియర్ నాయకులు బంగి విష్ణుమూర్తి, గద్దం కిరణ్, ఉంగుటూరు కుమార్, ములకపల్లి సరోజిని, గద్దం సుధాకర్, మోదుగు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps